ఆంధ్రజ్యోతి
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
ఆదివారం 20 ఆగస్టు 2017

ANDHRAJYOTHY FOCUS

అనావృష్టి అనంతం

అంబటి చినబ్రహ్మానందారెడ్డికి ఉదయగిరి మండలం గుడినరవ గ్రామంలో ఐదెకరాల మాగాణి భూమి ఉంది. చినుకు జాడ లేకపోవడంతో భూమంతా బీడుగా మారింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు పొట్ట చేతపట్టుకొని తెలంగాణకు వెళ్లాడు. తన భార్య సాయమ్మతో బడ్డీ కొట్టు పెట్టుకొని జీవిస్తున్నాడు.



- మరో నెలలో ముగియనున్న ఖరీఫ్
- చినుకులతోనే సరిపెడుతున్న వరుణుడు
- డెడ్‌స్టోరేజీలో కండలేరు, సోమశిల.. తగ్గిన సాగు విస్తీర్ణం
- వరి సాగు కావాల్సింది 50వేల హెక్టార్లు.. అయ్యింది 18 వేలే
- ఇతర పంటలదీ అదే పరిస్థితి.. తొలి పంట నార్లకు నీటి కష్టాలు
- తాగునీటికీ తిప్పలు తప్పవేమో!.. మెట్టలో పరిస్థితి మరీ ఘోరం
- ఆదుకోని 'ఉపాధి'.. పెరుగుతున్న వలసలు


- వివరాలు సెంటర్‌స్ప్రెడ్‌లో..



ఈ పంటను కాపాడుకునేదెట్టబ్బా..



ఉదయగిరి మండలం గుడినరవ గ్రామ జనాభా 650 మంది. సుమారు 600 ఎకరాల మాగాణి, మెట్ట భూములు ఉన్నాయి. గండిపాళెం జలాశయం కుడి కాలువలో పారే నీటితోపాటు గ్రామ చెరువు నీటితో ఏడాదికి రెండు కార్లు వరి, ఒక కారు ఆరుతడి పంటలు పండించేవారు. అటు పాడి, ఇటు వ్యవసాయంతో ప్రతి ఒక్కరూ ఆనందంతో గడిపేవారు. కానీ ఇదంతా గతం. ఇప్పుడు అక్కడ ఆ పరిస్థితులు లేవు. ఐదేళ్లుగా నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామం ఖాళీ అవుతోంది. మాగాణి భూములు చిల్లచెట్లతో చిట్టడవిని తలపిస్తున్నాయి. 100 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటడంతో వందల వ్యవసాయ బోర్లు వట్టిపోయాయి. ఈ విపత్కర పరిస్థితులు ప్రతి ఏడాది దాపురిస్తుండటంతో ఒక్కొక్కరు గ్రామం విడిచి పట్టణాలకు వలస పోతున్నారు.



నిలువునా ఎండిన బత్తాయి చెట్లు, అడుగంటిన సోమశిల జలాశయం

ఆ టెండర్లు వివాదాస్పదం

- రెండు ప్యాకేజీలకు టెక్నికల్ బిడ్ బ్రేక్
- ఐదు ప్యాకేజీలకు ప్రైజ్ బిడ్ ఓపెన్
- బ్యాచ్ మిక్స్ ప్లాంట్ లీడ్‌తోనే వివాదం
- ముగ్గురు కాంట్రాక్టర్ల టెండర్లు తొలగింపు
- కమీషన్ కోసం పట్టువీడని నేత.. నివేదిక కోరిన ఈఎన్‌సీ

7

రెండు పాఠశాలలకు స్వచ్ఛ పురస్కార్!



3

ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి, శ్రీహరికోట పాఠశాలలకు జాతీయ అవార్డులు

1న ఢిల్లీలో అందజేయనున్న ప్రధాని మోదీ

క్రికెట్ బెట్టింగ్.. 85 మంది అరెస్టు

మిల్లర్ల నుంచి దస్త్రాలు స్వాధీనం

- 25న ఐటీ కార్యాలయానికి రండి
- మిల్లర్లకు అధికారుల సూచన
- ఆడిటర్లు, న్యాయవాదుల వద్దకు పరుగులు

6



● టికెట్ ధరలో మినహాయింపు
● వివిధ వర్గాలకు వర్తింపు
● తెలుసుకుంటే ఎంతో ఉపయోగం

రాయితీల రైలు!

భారతీయ రైల్వే... దేశంలోని అతిపెద్ద శాఖల్లో ఒకటి. ఆ సేతు హిమాచలాన్ని కలిపే రవాణా సంస్థ. రైలు బండి కూతను, రైల బోగీలో ప్రయాణాన్ని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తి కాదు. అంతలా ప్రజలతో మమేకమైన రవాణా సాధనం ఈ చుకు...చుకు.. రైలు. దేశవ్యాప్తంగా 16 జోన్లుగా విస్తరించిన రైల్వే శాఖ ప్రయాణికులకు ఎన్నో సౌకర్యాలు, మరెన్నో వసతులు కల్పిస్తోంది. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాలను ఏకం చేయడమేకాక తక్కువ ఖర్చుతో అన్ని స్థాయిల వారినీ గమ్యస్థానాలకు చేరుస్తున్న ఘనత ఆ శాఖకే సొంతం. రైలులో ప్రయాణించేందుకు వివిధ వర్గాల వారికి రాయితీలు కూడా కల్పిస్తోంది. అయితే వాటి గురించి చాలా మందికి తెలియదు. సుమారు 271 అంశాల్లో రాయితీలను రైల్వే శాఖ అందిస్తోంది. వాటిలో కొన్నింటిని పాఠకుల కోసం అందిస్తున్నాం.

- నెల్లూరు (క్రైం)

● క్రీడాకారులకు...

అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు 50 శాతం నుంచి 75శాతం రాయితీ లభిస్తుంది. అలాగే వివిధ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులకు సెకండ్ క్లాస్ స్లీపర్‌లో 75శాతం, ఏసీ తరగతుల్లో 50శాతం రాయితీని అందిస్తోంది.

● దివ్యాంగులకు...

దివ్యాంగులకు 50 శాతం నుంచి 75 శాతం రాయితీ ఇస్తోంది. ఏసీ, త్రీ టైర్ ఏసీ, ఏసీ చైర్ కార్, స్లీపర్ చార్జీలకు ఈ రాయితీ వర్తిస్తుంది. దివ్యాంగులతోపాటు సహాయకులకు కూడా ఇదే రాయితీ లభిస్తుంది. ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్‌లకు 25 శాతం, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో 25 శాతం రాయితీ ఇస్తున్నారు. అంధులు, చెవిటి వారికి ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్‌లలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నారు.

● సీనియర్ సిటిజన్స్‌కు...

60 ఏళ్లు దాటిని పురుషులకు 40 శాతం, 58 ఏళ్లు దాటిన స్త్రీలకు 50 శాతం రాయితీ ఇస్తున్నారు. దేశంలో తిరిగే అన్ని రైళ్లలో దాదాపుగా ఈ రాయితీ వర్తిస్తుంది. అయితే రాయితీ పొందాలనుకునే వారు తగిన ధ్రువీకరణ పత్రాలు చూపించాలి. ప్రయాణంలో వాటిని దగ్గర పెట్టుకోవాలి. రిజర్వేషన్ సమయంలో సందర్భాన్ని బట్టి ఒరిజినల్, నకలు అందించాలి.

● అవార్డు గ్రహీతలకు...

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ రాష్ట్రపతి నుంచి అవార్డు తీసుకున్న పోలీసులు, సైనికులకు కూడా రైల్వే శాఖ ప్రయాణ చార్జీలో రాయితీ కల్పిస్తోంది. ప్రధానమంత్రి నుంచి జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఉద్యోగులకు కూడా ఈ రాయితీలు వర్తిస్తాయి. వీరికి టిక్కెట్ ధరలో 50 శాతం రాయితీ ఉంటుంది. ఇది అన్ని ఎక్స్‌ప్రెస్‌లకు వర్తిస్తుంది.

● విద్యార్థులకు...

విద్యార్థులకు రైల్వేస్ పలు రాయితీలు అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లి పట్టణాలు, నగరాల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచితంగా పాస్ మంజూరు చేస్తోంది. దూర ప్రాంతాల్లో చదివి స్వగ్రామాలకు వెళ్లే విద్యార్థులకు టిక్కెట్‌లో 50శాతం నంచి 75 శాతం రాయితీ ఇస్తోంది. అలాగే క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, విహార యాత్రలకు వెళ్లే సమయాల్లో కూడా సెకండ్‌క్లాస్ స్లీపర్‌లో 50 శాతం రాయితీ, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 50 శాతం రాయితీ అందిస్తోంది.

● కళాకారులకు...

కళాకారులకు రైల్వేస్‌లో 50 శాతం నుంచి 75 శాతం రాయితీలున్నాయి. కొన్ని తరగతులకు మాత్రం 50 శాతం రాయితీ ఉంది. దేశంలో షూటింగ్‌లకు వెళ్లే బృందాలకూ ఈ రాయితీలు వర్తిస్తాయి. అయితే సంబంధిత గుర్తింపు కార్డులు తప్పనిసరి.



● స్వాతంత్ర్య సమర యోధులకు...

స్వాతంత్ర్య సమర యోధులకు దాదాపు అన్ని రైళ్లలో పూర్తి స్థాయిలో రాయితీ లభిస్తుంది. వీరితోపాటు ఒక సహాయకునికి కూడా ఉచిత ప్రయాణం చేసే సౌకర్యం కల్పిస్తారు.

● జర్నలిస్టులకు...

జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు అన్ని తరగతుల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది. ఏడాదికి ఒక్కసారి స్పౌజ్ (భార్య/భర్త)తో దేశంలో ఎక్కడికైనా 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చు. పాత్రికేయులు మాత్రం ఎన్ని సార్లయినా 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవచ్చు.

● యువతకు...

జాతీయ యువజన సదస్సులు, ప్రాజెక్టులలో పాల్గొనే యువతకు జనరల్, స్లీపర్ క్లాస్‌లలో 50 శాతం, మానవసేవా సమితి శిబిరాలకు వెళ్లే వారికి 40 శాతం, రైతు శిబిరాల్లో పాల్గొనే వారికి 40 శాతం, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విధులకు హాజరయ్యే వారికి 50 శాతం, యూపీ పీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష లకు హాజరయ్యే వారికి జనరల్ తర గతిలో 50 శాతం రాయితీ లభిస్తుంది. 35 ఏళ్ల వయస్సు కలిగి, పరిశోధనలకు వెళ్లే రీసెర్చ్ స్కాలర్స్‌కు జనరల్, స్లీపర్స్ తరగతులలో 50 శాతం రాయితీ అంది స్తున్నారు.

● రోగులకు...

రైళ్లలో రోగులకు కూడా రాయితీలున్నాయి. చికిత్స పొందే ఆసుపత్రి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకువస్తే దాని ఆధారంగా వైద్య పరీక్షలకు వెళ్లే సమయంలో చార్జీల్లో 50 నుంచి 75 శాతం రాయితీ కల్పిస్తున్నారు. కేన్సర్ రోగులకు ఫస్ట్‌క్లాస్, ఏసీ చైర్‌కార్‌లో 75 శాతం రాయితీ ఇస్తున్నారు. అదే స్లీపర్‌లో, సెకండ్ క్లాస్‌లలో 50 శాతం రాయితీ లభిస్తుంది. రోగుల సహాయకులకు కూడా ఇది వర్తిస్తుంది. గుండె, కిడ్నీ రోగులకు 50 శాతం, క్షయ, కుష్ఠు బాధి తులకు 75శాతం, హెచ్ఐవీ, ఉబ్బసం రోగులకు 50 శాతం రాయితీ కల్పిస్తు న్నారు. ఇది సహాయకులకు కూడా వర్తిస్తుంది. అలాగే కేన్సర్ రోగులు వైద్య పరీక్షలకు వెళ్లేందుకు సీటు, బెర్త్ రిజర్వేషన్ చేసుకుంటే వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నా సరే ఎమర్జెన్సీ కోటా (ఈక్యూ)లో కన్ఫం చేస్తారు. ఈ ఏడాది జూన్ నుంచి దీనిని అమలు చేస్తున్నారు.

● ఆర్మీ కుటుంబాలకు...

దేశం కోసం సైన్యంలో పనిచేసి మృతి చెందిన వారి కుటుంబాలకు కూ డా రైల్వేశాఖ రాయితీలు కల్పిస్తోంది. వీరికి స్లీపర్ క్లాస్ చార్జీలో 75 శాతం రాయితీ వర్తిస్తుంది. సైన్యంలో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ సిబ్బందికి రైలు టిక్కెట్టులో పూర్తి రాయితీ ఉంటుంది. అలాగే, మావోయిస్టులు, టెర్రరిస్టులు, ఇతర సంఘ విద్రోహ శక్తులతో పోరాడి మృతి చెందిన వారి కుటుంబాలకు కూడా రాయితీలున్నాయి.

ఆధ్యాత్మికం

కోరిన కోర్కెలు తీర్చే

పంచభూతేశ్వరస్వామి

● అర్చకుడు కచ్చి వెంకట శివకుమార్



"కావలి రూరల్ మండలం గౌరవరంలో వెలసిన పార్వతీసమేత పంచభూతేశ్వరస్వామిని దర్శించుకుంటే కోర్కెలు నెరవేరుతాయి. సుమారు 700 సంవత్సరాల క్రితం చోళరాజులు పంచభూతేశ్వరస్వామి శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. స్వామి వారికి 11 వారాల పాటు అభిషేకాలు చేస్తే సంతానం, వివాహం, ఉద్యోగం, ఆరోగ్యం లాంటి కార్యాలు సిద్ధి స్తాయి. ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినం నాడు భక్తులు తమ స్వహస్తాలతో స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేసుకోవచ్చు."

- కావలిరూరల్

రుణాల గ్రౌండింగ్‌కు ఈడీ సహకరించాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రాజు

ఉద్యోగపర్వం

"బీసీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలలో గ్రౌండిగ్ సమయంలో ఈడీ సహకరించకపోవడం దారుణమని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డీ జనార్ధన్‌రాజు పేర్కొన్నారు. శనివారం నగరంలోని విజయమహల్ గేటు వద్ద గల కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016-17 సంవత్సరానికి సంబంధించిన రుణాల గ్రౌండిగ్ చాలా వరకు జరగలేదని, బ్యాంకర్లు ఇబ్బందులు పెడుతున్నారని ఈడీ దృష్టికి తీసు కెళ్లామని చెప్పారు. ఈడీ ఎంపీడీవోల దృష్టికి తీసు కెళ్లాలని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని వాపోయా రు. గతేడాది రుణాల పట్టించుకోకుండా ఇప్పుడు తిరిగి పత్రికల్లో (ఆంధ్రజ్యోతిలో కాదు) బీసీలకు కోట్లలో రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈడీ స్పందించి రుణాల గ్రౌండింగ్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మస్తాన్‌బాబు, భాస్కర్, మాలకొండయ్య, రాజారత్నం, సురేష్, వరలక్ష్మీ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు."

- నెల్లూరు (వేదాయపాళెం)



మాట్లాడుతున్న జనార్ధనరాజు

బాలల సంరక్షణకు ప్రత్యేక చట్టం

నెల్లూరు (వేదాయపాళెం) : బాలల సంరక్షణకు 2005లో ప్రత్యేక చట్టం వచ్చిందని లోక్‌అదాలత్ న్యాయమూర్తి పీజే సుధ తెలిపారు. ఆమె శనివారం నెల్లూరులోని బాలసదన్‌ను సందర్శించారు. అనం తరం ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ప్రాథమిక హక్కులు, పెద్దయిన తర్వాత సమాజంలో బాధ్యతలు ఉంటాయన్నారు. ఆ బాధ్యతలు, విధులు, దేశ భక్తి గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వివరించా లన్నారు. బాలసదన్‌లోని పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పాలని, పౌష్టి కాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీసీపీవో సురేష్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

● అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ ముత్యాలరాజు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేత్తలను అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ ముత్యాలరాజు అన్నారు. కలెక్టర్ బంగ్లాలో శనివారం పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పరిశ్రమలకు అవసరమైన భూమిని త్వరితగతిన సేకరించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అంద జేయలన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకుంటే గడువు లోపు అనుమతులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రతిపాదనలో ఉన్న ఎంఎస్ఎంఇ పార్కులను త్వరిత గతిన ప్రారంభించాలన్నారు. ఇఫ్కో సెజ్‌లో గమేస పరిశ్రమకు అవసరమైన పంచాయతీ అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమలకు సంబంధించిన భూముల కేసులను కౌంటర్‌ఫైల్‌చేసి పరిష్కరించాలన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాసులు, ఏడి జి.మురళి, ఏపిఐఐసి అధికారి వెంకటేశ్వర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ప్రమోద్‌కుమార్, జిల్లా అగ్ని మాపక అధికారి జ్ఞానసుందరం, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్‌బాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

రెండు పాఠశాలలకు స్వచ్ఛ పురస్కార్

● 1న ఢిల్లీలో ప్రధాని పంపిణీ

ఆత్మకూరు: జాతీయ స్థాయిలో ఇచ్చే స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డుకు ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి ప్రాథమికోన్నత, శ్రీహరికోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి. ఒక్కో పాఠశాలకు రూ.50 వేల నగదు బహుమతి ఇవ్వనున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లతో పాటు, ఒక విద్యార్థికి ప్రతిభ అవార్డు అందచేయనున్నారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 21 పాఠశాలలు స్వచ్ఛవిద్యాలయ పురస్కార్ అవార్డులకు ఎంపికయ్యాయి. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, విద్యాప్రమాణాలు, మౌలిక సౌకర్యాల కల్పన తదితర అంశాల ప్రాతిపదికన ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.

పురస్కార్ అవార్డు దక్కడం గర్వకారణం



చెర్లోయడవల్లి పాఠశాలకు స్వచ్ఛవిద్యాలయ పురస్కార్ అవార్డు దక్కడం గర్వకారణం. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, విద్యాప్రమాణాలు, మౌలిక సౌకర్యాల కల్పన తదితర అంశాల్లో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామపెద్దలు సహకారం మరువలేనిది.

- సోమవరపు భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు



రాష్ట్రంలో అవార్డు అందుకోబోతున్న 21 పాఠశాలల్లో చెర్లోయడవల్లికి చోటు దక్కడంతో ప్రత్యేక గుర్తింపు లభించింది. అదే స్ఫూర్తితో పాఠశాలలో మౌలిక సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చేయూతనందిస్తాం. జాతీయ అవార్డు సాధించడంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులు అభినందనీయులు.

- కేతా విజయభాస్కర్ రెడ్డి, సర్పంచు, చెర్లోయడవల్లి

ఉద్యోగుల గ్రీవెన్స్ ప్రశాంతం

నెల్లూరు(కలెక్టరేట్): కలెక్టర్ బంగ్లాలో శనివారం సాయంత్రం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 24 మంది ఉద్యోగులు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. వారు తమ సర్వీసు సమస్యలను వివరించి పరిష్కరించాలని కలెక్టర్ ముత్యాలరాజును కోరారు. 24 సమస్యలలో 11 రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చాయి. బిసి సంక్షేమశాఖ నుంచి ఒకటి, విద్యాశాఖ నుంచి 2, పంచాయతీరాజ్ శాఖ నుంచి మూడు, ఎస్సీ కార్పొరేషన్, ప్రభుత్వ జనరల్ వైద్యశాల, ఐసీడీఎస్ నుంచి ఒక్కొక్కటి వంతున సోమశిల ప్రాజెక్టు, జడ్పీ నుంచి రెండు వంతున రాత పూర్వక విన్నపాలు వచ్చాయి. వాటిలో న్యాయమైన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్వో వెంకటసుబ్బయ్య, కలెక్టరేట్ ఏవో మధుసూదన్‌శర్మ పాల్గొన్నారు.

విషజ్వరాలతో మంచం పడుతున్న పల్లెలు

జలదంకి: చిరుజల్లులతో వాతావరణంలో మార్పులు జరిగాయి. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో పల్లెల్లో విషజ్వరాలు సోకి పల్లెప్రజలు మంచం పడుతున్నారు. మండలంలోని తిమ్మసముద్రం, గట్టుపల్లి, కేశవరం, రామవరప్పాడు తదితర గ్రామాలలో విషజ్వరాలు అధికంగా ఉన్నాయి. వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై జ్వరాలు విజృంభించక ముందే నివారణచర్యలు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అటకెక్కిన ఆరోగ్య చైతన్యం

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- పట్టించుకోని అధికారులు

కావలిటౌన్: ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి అమలు చేస్తున్న ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు అధికారుల అలసత్వంతో అవి అటకెక్కాయి. ప్రజలు ఆరోగ్యాలు పరిరక్షించాల్సిన వైద్యాధికారులు క్షేత్ర స్థాయి పరివేక్షణకు దూరమవడంతో కింది స్థాయి సిబ్బంది తూతూ మంత్రంగా ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు జరుపుతున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ లేక, ప్రజల్లో అవగాహన లేక వ్యాధుల బారిన పడుతున్నారు. వాంతులు, విరేచనాలు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు, మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

ప్రబలుతున్న వ్యాధులు

వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ, పంచాయతీ మున్సిపాలిటీ అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్యాన్ని పరిరక్షించి ప్రజల్లో వైద్య ఆరోగ్య చైతన్యం కల్పించాల్సి ఉంది. ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు మొక్కుబడిగా మారడంతో ప్రజల్లో తగిన అవగాహన కరువై వ్యాధులబారిన పడుతున్నారు. 2012-13 సంవత్సరంలో జిల్లాలో 139 మలేరియా, 18 డెంగ్యూ కేసులు నమోదు కాగా, 2013-14 సంవత్సరంలో 179 మలేరియా, 68 డెంగ్యూ కేసులు కేసులు నమోదయ్యాయి. 2014-15లో 165 మలేరియా, 25 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. 2015-16 లో 186 మలేరియా, 556 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. 2016-17 సంవత్సరంలో 156 మలేరియా, 850 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇవి కాక అనధికారికంగా మరిన్ని కేసులు ఉన్నట్లు సమాచారం. 2015-16 సంవత్సరంలో విషజ్వరాల బారిన పడి జిల్లా పరిధిలో 100కు పైగా మరణాలు సంభవించినట్లు సమాచారం.



రాజీవ్ నగర్‌లోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం

శాఖల మధ్య సమన్వయ లోపం

గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య పరిరక్షణ కోసం కోట్లాది రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తున్నా శాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల, పాలకుల నిర్లక్ష్యంతో లక్ష్యం గాడి తప్పింది. పారిశుధ్య పరిరక్షణలేకపోవడం, కలుషిత నీరు, పందుల స్వైరవిహారం, దోమల కారణంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజా ఆరోగ్య సేవలు అందించడంలో ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంలో శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది.

మొక్కుబడిగా చైతన్యకార్యక్రమాలు

ముందస్తు చర్యలలో భాగంగా వ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్య శాఖ వారు ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారిలో వైద్యఆరోగ్య చైతన్యాన్ని నింపాల్సి ఉంది. వారు అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి బాధితుల రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించి ఎప్పటికపుపడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా అది జరగడం లేదు. ఒక ప్రాంతంలో ఇద్దరి ముగ్గరి రక్త నమూనాలు సేకరించి నాలుగు మాత్రలు పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దోమలపై దండ యాత్ర కొద్ది రోజులకే అటకెక్కింది. మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. పట్టణంలో పందులు స్వైరవిహారం చేస్తున్నా, కాలువల్లో మురుగు నిల్వచేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎప్పుడో ఒక సారి కాలువల్లో బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం లాంటి చర్యలతో సరిపెడుతున్నారు. అనేక వీధుల్లో తాగు నీటి పైపులైన్లల్లో మురుగు నీరు కలిసి నీరు కలుషితమవుతోంది.

అవగాహన కల్పిస్తున్నాం

ఎక్కడైన వ్యాధులు ప్రబలినట్లు తెలిస్తే వైద్య బృందాలను పంపించి సర్వేలు నిర్వహించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. పట్టణంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ఆరోగ్య చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సెలినా కుమారి

బాధితురాలికి న్యాయం చేయాలి

కావలిటౌన్: అట్రాసిటీ కేసులో బాధి తురాలికి అధి కారులు న్యాయం చేయాలని అశ్వీలత ప్రతి ఘటన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీ. శారద కోరారు. బాధి తురాలు గోళ్ల అమరజ్యోతితో కలిసి ఆదివారం స్థానిక కారొనేషన్ రీడింగ్‌రూం ఆవరణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వెంగళరావునగర్‌కు చెందిన అమరజ్యోతిని వైకుంఠపురానికి చెందిన ఎస్‌కె జమీల్ వివాహం చేసుకుని పదేళ్ల కలిసి ఉన్నాడని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మరో వివాహం చేసుకున్నాడన్నారు. జ్యోతిని నమ్మబలికి జమీల్ ఆమె వద్ద రూ. 1.65 లక్షలు విలువ చేసే నివేశన స్థలం, రూ. 1.50 లక్షలు విలువ చేసే నగలు, రూ. 8 లక్షల నగదు తీసుకున్నాడని ఆరోపించారు. అప్పటిలో పోలీసులను ఆశ్రయించగా మోసం చేసినట్లు, కులం పేరుతో దూషించినట్లు జమీల్‌పై రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. జ్యోతిని మోసం చేసి మరో మహిళ గొంతుకోసిన జమీల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక కార్యకర్త కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శారద

అంగన్‌వాడీల్లో రంగుల గుర్తింపు



పిల్లలకు రంగులు గురించి వివరిస్తున్న సీడీపీవో

కావలి: అంగన్‌వాడీ పిల్లలకు ప్రాథమిక స్థాయిలో రంగులు గుర్తించే విధంగా ప్రతి నెలా ఒక రంగు గురించి వివరిస్తూ ఆ రంగుకు సంబంధించిన వివిధ రకాల ఆట వస్తువులను విద్యార్థులకు చూపిస్తున్నట్లు కావలి సీడీపీవో పద్మజ పేర్కొన్నారు. కావలి పట్టణ క్రిస్టియన్ పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బ్లూకలర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ బ్లూ కలర్ దుస్తులు ధరించి బ్లూకలర్ ఆటవస్తువులను చూపిస్తూ ఆ కలర్‌ను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లలు ప్రాథమిక దశలో కలర్ గుర్తించే విధంగా ప్రతి నెలా ఒక కలర్‌ను వారికి పరిచయం చేస్తామన్నారు. ఆ కలర్ వారి మనస్సుల్లో గుర్తిండిపోయేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. బ్లూ, ఎల్లో, రెడ్ కలర్‌ను గుర్తించి వివరిస్తూ వారు అన్ని కలర్‌ను గుర్తించే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్బమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రి పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల తిరునాళ్ల



గరిమెనపెంటలోని సీతారాముల దేవాలయం

కొండాపురం: మండలంలోని గరిమెనపెంట గ్రామంలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న సీతారాముల తిరునాళ్ల శనివారంతో ముగిసింది. చివరిరోజు స్వామివారికి పారువేట కార్యక్రమం జరిగింది. సీతారాముల దేవాలయంలో జరిగిన పూజాకార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్థులు చిన్నా పెద్ద తేడాలేకుండా ప్రతిఒక్కరూ పారువేట కార్యక్రమంలో పాల్గొని వసంతం చల్లుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఇతరప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. తిరునాళ్ల జరిగిన ఆరురోజులపాటు గ్రామంలో భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పందులదాడి

బాధితురాలికి టీడీపీ ఆర్థిక సాయం

కావలిటౌన్: పందులదాడిలో గాయపడిన బాధితురాలు బీబీజాన్‌కు టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్థికసాయం అందించారు. కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బీబీజాన్‌ను టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి, ఉపాధ్యక్షులు జెట్టి శేషారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కొమరా రమణయ్య, ప్రభుత్వా సుప్రతి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పాదర్తి నాగరాజు, ద్రోణాదుల వెంకటరావు, కోశాధికారి రవ్వా సుబ్బారావు, కౌన్సిలర్లు వడ్డమూడి వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఆయేషా పరామర్శించారు. రూ. 5 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా అమరా వేదగిరి మాట్లాడుతూ వృద్ధ మహిళపై పందులు దాడిచేసి గాయపరిచిన సంఘటన పట్టణంలో సంచలనం రేపిందన్నారు. గాయపడిన మహిళ ఇళ్లలో పాచిపని చేసుకుంటూ బతికే నిరుపేద కావడంతో ఆమెను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించామన్నారు. పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్‌ను, కమిషనర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖమర్‌బాబు, ఎస్‌ఎస్‌ఆర్ రవి, ఇబ్రహీం, జ్వాలారావు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న టీడీపీ నేతలు

లారీని ఢీకొన్న మరో లారీ

కావలి(క్రైం): కావలి బైపాస్ రోడ్డులో అల్లిగుంట పాలెం క్రాస్‌రోడ్డు వద్ద శనివారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగిఉన్న లారీని వెనుకనుంచి వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ సంఘటనలో వెనుకనుంచి ఢీకొన్న లారీడ్రైవర్లు పప్పుయాదవ్, రతన్‌కుమార్ యాదవ్ గాయపడ్డారు. లారీ సిబ్బంది కథనం మేరకు.. హైదరాబాదు నుంచి చెన్నైకు వెళుతున్న కొరియర్ లారీ కావలి బైపాస్‌రోడ్డులో ముందుగా ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదానికి గురైన ముందు ఆగివున్న లారీ జంగారెడ్డిగూడెం నుంచి తమిళ నాడులోని నమక్కల్‌కు మొక్కజొన్నల లోడుతో వెళుతోంది. వెనుక నుంచి ఢీకొన్న లారీ కేబిన్ వెనుకకు వంగిపోవడంతో కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ పప్పుయాదవ్‌ను హైవే సిబ్బంది రక్షించారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్ సిబ్బంది లక్ష్మణ్, కొండయ్య ఏరియా వైద్యశాలకు తరలించారు.



గాయపడిన లారీడ్రైవర్

ఏడుగురు పంటర్ల అరెస్ట్

కావలి(క్రైం): కావలి రైల్వేరోడ్డులో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురు పంటర్లను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఒకటో పట్టణ సీఐ రోశయ్య తెలిపారు. నిందితుల నుంచి ఏడు సెల్‌ఫోన్లు రూ.11,100నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం వన్డే మ్యాచ్ సందర్భంగా వీరు బెట్టింగులకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. అరెస్టయిన వారిలో గన్నేపూడి సతీష్, పులికొండ కొండయ్య, మొర్ల వెంకటేశ్వర్లు, ఎల్లంపల్లి రాము, జనిగర్ల మనోహర్, మారిశెట్టి శ్రీకాంత్ ఉన్నారు. గతంలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ప్రధానబుకీలు పోలీసు విచారణలో తెలిపిన వివరాల మేరకు వీరిని అరెస్టుచేశారు. ప్రధాన బుకీలుదాదాపు 150 మంది పంటర్ల వివరాలు తెలిపినట్లు సమాచారం. ఈ వివరాల మేరకు అరెస్టులు జరగనున్నట్లు సమాచారం



అరెస్టయిన పంటర్లతో పోలీసులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కావలిరూరల్: గ్రామ పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఈవోపీ ఆర్‌డీ ఆదినారాయణ తెలిపారు. కావలి రూరల్ మండలం కొండాయగారిపాలెంలో సర్పంచ్ మొర్ల అమరావతి అధ్యక్షతన తుమ్మలపెంట పీహెచ్‌సీ, రామ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈవోపీఆర్‌డీ ఆదినారాయణ, రామ్ సెంటర్ నిర్వాహకుడు మనోహర్‌రెడ్డి, వైద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైద్యశిబిరంలో 56 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద కార్యకర్త ఆనంద్, ఎంపీటీసీ మొగిలి కోటమ్మ, కార్యదర్శి వెంకటరమణ, ఎంపీహెచ్‌వో శ్రీనివాసులు, సక్కుబాయ్ ఎఎన్‌ఎంలు, వైద్య ఇబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి
ఆదివారం
20 ఆగస్టు 2017

పందుల స్వైరవిహారం

బిట్రగుంట: బోగోలు మండలంలో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. శుక్రవారం కావలిలో జరిగిన సంఘటనతో రోడ్డుపైకి రావాలన్నా జనం బిక్కుబిక్కు మంటున్నారు. ఇంటి ఆవరణంలో పందులు విచ్చలవిడిగా తిరగడమే కాకుండా జనావాసంలో ఉండడం వల్ల ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని భయపడుతున్నారు. విశ్వనాథ రావుపేట పంచాయతీ కొత్తూరుగ్రామంలో పందులు విపరీతంగా సంచరిస్తున్నాయని అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నా బిడ్డను చంపేశారు

- ఎమ్మెల్యే ముందు కన్నీటిపర్యంతమైన మృతుడి బంధువులు



విలపిస్తున్న సుబ్బయ్య కుటుంబ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : భార్యను వెతుక్కుంటూ అత్తగారింటికి వెళ్లిన నా బిడ్డని వాళ్లే చంపేశారంటూ మండలంలోని మునులపూడికి చెందిన బద్దిపూడి లక్ష్మయ్య, కుటుంబసభ్యులు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ముందు కన్నీటిపర్యంతమయ్యారు. మండలంలోని మునులపూడి, రెడ్డిపాళెం గ్రామాలలో శనివారం సిమెంటు రోడ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ముందు వారు గోడు వెళ్లబోసుకున్నారు. పెనుబల్లి గిరిజన కాలనీలో భార్య సుష్మా ఇంటి వద్ద సుబ్బయ్య ఉరేసుకుని మృతి చెందినట్లు పలువురి సమాచారం మేరకు బుచ్చి పోలీసులు నమోదు చేశారని పోస్టు మార్టం రిపోర్టును తమకు ఇవ్వడంలేదని ఎమ్మెల్యే ముందు వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్యే ముందు ప్రాధేయపడ్డారు. తమ కుమారుడి మృతిపై పలు అనుమానాలున్నాయని పోస్టుమార్టం రిపోర్టు తమకు ఇవ్వాలని వారు ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు.

సత్యాగ్రహం గాంధీజీ ఆయుధం

ఇందుకూరుపేట : స్వాతంత్ర్యం పోరాటంలో గాంధీజీ సత్యాగ్రహం ఉద్యమమే ప్రధాన తారకమంత్రం అయిందని, దాని వల్లనే పోరాటంలో విజయం సాధించగలిగామని చిత్తూరు జిల్లా తెలుగు భాష ఉద్యమ నాయకురాలు శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం పల్లెపాడు పినాకినీ ఆశ్రమంలో గాంధీజీ ఫిలాసఫీ తరగతులను ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, నిర్వాహకులు గూడూరు లక్ష్మీ, గణేశం కృష్ణారెడ్డి, నేదురుమల్లి సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై దాడులు నిలిపివేయాలి

బుచ్చిరెడ్డి పాళెం:జిల్లాలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై ఆర్టీఏ,పోలీసు అధికారుల దాడులను నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నెల రోజులుగా అధికారులు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై దాడులు చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని నెల తరబడి వాటిని విడదల చేయకపోవడంవల్ల కార్మికుల కుటుంబ పోషణ జరగడం కష్టంగా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు సురేష్, మునీర్‌అహ్మద్, మల్లికార్జున, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

కలిగిరి: ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా పనిచేస్తున్న వి.బాలనాగేశ్వరరావు ఉత్తమ వైద్యాధికారిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టరు రేవు ముత్యాలరాజు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారికి సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ వైద్యాధికారిగా తమ పీహెచ్‌సీ వైద్యాధికారికి గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో తనకు వచ్చిన ఈ గుర్తింపుతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.సిబ్బంది సహకారంతో పీహెచ్‌సీని ఉన్నత స్థానంలో నిలబెడతామని పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీ హెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వైద్యాధికారి బాలనాగేశ్వరరావుని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రసన్నాంజనేయులుకు ప్రజా సంఘాల సత్కారం

కావలిటౌన్: రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులుకు ఉత్తమ సేవా పురస్కారం లభించడంతో స్థానిక ఆర్వీడీఎస్ కార్యాలయంలో శనివారం జై భీమ్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జైభీమ్ సంస్థ అధ్యక్షులు పీఆర్ఏఈ డి చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు మహిళా సంఘాలు, ఆర్వీడీఎస్ ప్రజా సంఘాల నాయకులు గంధం ప్రసన్నాంజనేయులను శాలువాలు, పూలమాలలతో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ మాజీ కౌన్సిలరు అయిన ప్రసన్నాంజనేయులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ రక్తదాన ఉద్యమంలో పట్టణ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగి గుర్తింపుతెచ్చుకున్నారని అన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ రక్తదాన ప్రోత్సాహకులుగా అవార్డు అందుకోవడం శుభపరిణామమన్నారు. ఆర్వీడీఎస్ అధ్యక్షుడు మద్దెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సంస్థల్లో కుటుంబ సభ్యుడు లాంటి గంధం ప్రసన్నాంజనేయులుకు అవార్డు రావడం సామాజిక కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు లభించినంత సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కందుల శ్రీనివాసరావు, జైభీమ్ సంస్థ కో-ఆర్డినేటర్ దాసరి బాలకృష్ణ, ఆర్వీడీఎస్ సభ్యులు రాఘవ, కమలాకర్, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గంధం ప్రసన్నాంజనేయులును సత్కరిస్తున్న ప్రజా, మహిళ సంఘాలు

నాణ్యత తెలుసుకోవాలి

ఏడీఏ సత్యనారాయణచౌదరి

కలిగిరి: పంటలు సాగుచేస్తున్న రైతు విత్తన ఎంపికలో నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవాలని వింజమూరు ఏడీఏ సత్యనారాయణ చౌదరి పేర్కొన్నారు. కలిగిరిలో ఎస్‌బీఐ ఎదురుగా శనివారం జరిగిన సోము శ్రీనివాసులురెడ్డికి చెందిన విత్తనాల దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు బ్రాండ్‌కల్గిన కంపెనీ విత్తనాలను రైతులకు అమ్మాలని సూచించారు. అదే విధంగా రైతులు కూడా విత్తన కంపెనీల నాణ్యతా ప్రమాణాలను విచారించి కొనుగోలు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వ్యవ సాయాధికారిణి ఎం శ్రీవాణి, విస్తరణాధికారి చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలను రైతులకు అందిస్తున్న ఏడీఏ తదితరులు

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

జలదంకి: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా జలదంకిలో బీజేపీ నాయకులు వీధులను శుభ్రపరిచారు. గ్రామంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి గ్రామచావడి వరకు చీపుర్లతో వీధులు ఊడ్చారు. అనంతరం గ్రామప్రజలకు స్వచ్ఛ భారత్ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు చల్లా హనుమాన్‌రెడ్డి, నాయకులు వడ్డే శ్రీకాంత్‌రెడ్డి, కంచర్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.



వీధులు ఊడ్చుతున్న నాయకులు

నాలుగు రోజుల్లో పూడ్చించండి

పొదలకూరు: జిల్లాలో నోళ్లు తెరుచుకున్న బోర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నాలుగు రోజుల్లో వాటిని పూడ్చించాలని అన్ని మండలాల అధికారులను కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఆదేశాలు జారీ చేశారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో, వ్యవసాయశాఖ అధికారులతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుపయోగంగా వదిలేసిన బోర్లు సుమారు 21వేల పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు.

• ఇంటర్వ్యూ



ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్స్‌తో భూసమస్యల పరిష్కారం

జాన్‌ప్రభాకర్. తహసీల్దార్, జలదంకి

?: ప్యూరిఫికేషన్స్ ఆఫ్ ల్యాండ్స్ అంటే

!: సర్వేనెంబర్ల వారీగా పూర్తి విస్తీర్ణం గుర్తించి పట్టాదారుల పేరు మీద ఎంత విస్తీర్ణం రికార్డులో ఉందో గుర్తించి తక్కువ, ఎక్కువలను గుర్తించడం.

?: తేడాలుంటే ఏంచేస్తారు.

!:ఎక్కువ విస్తీర్ణం రికార్డులలో ఉంటే వీఆర్వో భూమి వద్దకు వెళ్లి విచారించి వాస్తవంగా సాగులో ఉన్న వారిపేర్లు ఉంచి మిగతా పేర్లు తొలగిచడం చేస్తారు. తొలగించిన పేర్లు ఏ సర్వేనంబరులో ఉందో గుర్తించి ఆనంబరులో పేర్లు చేర్చడం జరుగుతుంది.

?: ప్రభుత్వభూములు విషయంలో

!: ప్రభుత్వ భూములు ఉన్న సర్వేనంబర్లలో అడంగల్, వన్‌బీలలో పేర్లు ఉంటే వారికి పట్టా ఎప్పుడు ఇచ్చారో పరిశీలిస్తారు. వాస్తవంగా ఇచ్చి ఉంటే పేరు ఉంచడం లేకుంటే రికార్డుల్లో నుంచి తీసేయడం జరుగుతుంది.

- జలదంకి

15 మంది బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

రూ, 1.72 లక్షల నగదు స్వాధీనం

పొదలకూరు: పొదలకూరులోని బాలాజీనగర్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 15మంది బెట్టింగ్ రాయుళ్లను శనివారం పొదలకూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి లక్షా 72వేలా 9వందల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆత్మకూరు డీఎస్పీ సుబ్బారెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రముఖ క్రికెట్ బెట్టింగ్ బుకీ మన్నెం శ్యామ్‌ప్రసాద్ వద్ద కొంతకాలంగా పంటర్లుగా బెట్టింగ్ నిర్వహిస్తున్న బెట్టింగ్‌రాయుళ్ల బుకీ శ్యామ్‌ప్రసాద్‌ను ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడంతో పరారయ్యారని అన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో పొదలకూరులోని బాలాజీనగర్‌లో పెసళ్ల సతీష్ ఇంట్లో ఇండియా -ఏ, సౌత్‌ఆఫ్రికా- ఏ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్‌మ్యాచ్‌పై కిక్‌బజ్ యాప్ ద్వారా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ అల్లూరి జగత్‌సింగ్‌కు సమాచారం అందిందన్నారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వెళ్లి ఇంట్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 15బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,72,900లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరందరినీ 3అండ్5 గేమింగ్ యాక్ట్ ప్రకారం అరెస్టు చేసి గూడూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు. అరెస్టయిన వారిలో ఉయ్యాల కృష్ణారెడ్డి, పెసళ్ల సతీష్, మన్నవరపు సంపత్‌కుమార్, షేక్ పరియాజ్, పలుకూరు శ్రీనివాసులురెడ్డి, విజయ్‌మోహన్, రాజగోపాల్ రెడ్డి, పందిపాటి సుధీర్‌రెడ్డి, తరుగు నాగేంద్ర, గజ్జెల వెంకటేశ్వర్లు, పెంచల రాంబాబు, కండే మురళి, పెరిచెర్ల మాల్యాద్రి, గాలి వెంకటేశ్వర్లు, లెక్కల శ్రీనివాసులురెడ్డి ఉన్నారు. వీరు కొంత కాలంగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు.



పోలీసుల అదుపులో బెట్టింగ్ రాయుళ్లు

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉ క్కుపాదం మోపనున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉచిత ఇసుక పాలసీలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత


నగదు అందజేస్తున్న జీఆర్‌పీ పోలీసులు

బిట్రగుంట: సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో పోగొట్టుకున్న రూ. 2.13 లక్షల నగదును శనివారం బిట్రగుంట రైల్వే పోలీసులు బాధితుడికి అప్పగించారు. పోలీసుల కథనం మేరకు, సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో బాపట్లకు చెందిన రాజేష్‌కు ప్లాస్టిక్ కవర్ దొరకడంతో రైలు భోగీలోని తోటి ప్రయాణికులను ఆ కవరు విషయమై అడిగాడు. చివరకు జీఆర్‌పీ పోలీసుల వద్ద కు వెళ్లడంతో అసల విషయం తెలిసింది. నెల్లూరుకు చెందిన షిరిడీ సాయి ఎలక్ట్రికల్ దుకాణం వారు ఈ నెల 15 వ తేదీ తునిలో స్నేహితుడి వివాహానికి వెళ్లి శనివారం తిరుగు ప్రయాణంలో నగదు ఉన్న కవరు పోగొట్టుకున్న విషయం బిట్రగుంటలో గుర్తించారు. బోగీలో ప్రయాణికులను బాధితుడు త్రివేద్‌కుమా ర్ అడిగాడని, ఇంతకు మునుపు ఓ వ్యక్తి ఆ కవరు విషయమై తమతో చెప్పి జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌వైపు వెళ్లినట్లు చెప్పారు. అదే బోగీలో విధులు ముగించుకుని వెళ్తున్న కానిస్టేబుల్ ప్రసాద్‌కు తెలియడంతో అప్రమత్తమైన ఆయన బిట్రగుంట జీఆర్‌పీ పోలీసులకు తెలిపాడు. ఈ విషయంపై ఎస్‌ఐ భాస్కర్ సూచనల మేరకు బాధితుడిని తోటి ప్రయాణికులను విచారించగా ఆ కవరు రాజేష్ అనే వ్యక్తి జీఆర్‌పీ పోలీసులకు ఇచ్చినట్లు తెలిపారు. ఆ కవరులో ఉన్న రూ. 2.13 లక్షలు నగదు త్రివేద్‌ది అని గుర్తించి రాజేష్ సమక్షంలో జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు బాధితునికి అందజేశారు.

మిల్లర్ల నుంచి దస్త్రాలు స్వాధీనం

● 25న కార్యాలయానికి రండి : ఐటీ

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నెల్లూరులో శుక్రవారం రైస్ మిల్లర్ల యజమానుల ఇళ్లలో ఐటీ, సిట్ అధికారులు దాడులు నిర్వహించి విలువైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 25న వీరంతా తిరుపతిలోని ఐటీ కార్యాలయానికి హాజరు కావాలని ఐటీ అధికారులు కోరారు. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకు రైసుమిల్లుల యజమానులు, ఆడిటర్లు, న్యాయవాదుల వద్దకు పరుగులు తీశారు. విశాఖ భూ కుంభకోణంలో నెల్లూరు రైసుమిల్లర్ల పాత్ర ఉందన్న సమాచారంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), ఐటీ అధికారులు శుక్రవారం నెల్లూరులోని రైసుమిల్లర్ల ఇళ్లలో సోదాలు చేపట్టిన సంగతి తెలిసిందే. బినామీ పేర్లతో వీరంతా విశాఖలో భూమి కొనుగోళ్లకు పెట్టుబడులు పెట్టినట్లు సిట్ ప్రాథమికంగా నిర్ధారించింది. ఇలా రూ.20 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టినట్లు సమాచారంతో జరిగిన దాడుల్లో కీలకంగా కన్సల్టెంట్ వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించారని గుర్తించారు. ఈ సోదాల్లో పలు కీలకమైన డైరీలు, విలువైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్న సిట్, ఐటీ అధికారులు వెళ్లారు. తిరుపతి రీజియన్ పరిధిలో ఉన్న ఐటీ కార్యాలయంలో దీనిపై విచారణ జరుగుతుందని ఈనెల 25న హాజరు కావాలని అధికారులు ఆదేశించినట్లు సమాచారం. వీరే కాకుండా బ్యాంకుల్లో నోట్ల మార్పిడి, ఆదాయ పన్ను చెల్లింపుల్లో జాప్యం తదితర అంశాలపై మరో 12 మంది ఇళ్లపై ఐటీ అధికారులు దాడులు నిర్వహించి రికార్డులు స్వాధీనం చేసుకుని వెళ్లారు. ఈ కేసుల నుంచి బయట పడేందుకు ఆడిటర్లు, న్యాయవాదులతో వీరంతా సంప్రదిస్తున్నట్లు సమాచారం. ఈ దాడులతో నెల్లూరు నగరంలో వ్యాపార వర్గాలు, రైసుమిల్లర్లలో కలకలం రేగింది.

ఆర్‌ఎంపీ వైద్యుడు విజయవాడలో ఆత్మహత్య

అనంతసాగరం: మండలంలోని పాతాళపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు గండికోట రాజగోపాల్(45) విజయవాడలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పాతాళపల్లికి చెందిన రాజగోపాల్ రెండేళ్ల క్రితం అనంతసాగరంలో ఆర్‌ఎంపీ వైద్యునిగా పని చేస్తుండేవాడు. కుటుంబ కలహాల కారణంగా, భార్యతో విడిపోయి, బుచ్చిరెడ్డిపాళెం సమీపం లోని గ్రామానికి వెళ్లి క్లినిక్ నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఆయన విజయవాడలో సీఎంను కలిసేందుకు శుక్రవారం వెళ్లాడని, అక్కడ సెక్యూరిటీ సిబ్బంది అనుమతించకపోవడంతో, పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సెల్‌ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు శనివారం రాజగోపాల్ మృతదేహాన్ని పాతాళపల్లికి తీసుకొచ్చారు.

85 మంది పంటర్ల అరెస్టు

● 2.66 లక్షల నగదు, 59 సెల్‌ఫోన్ల స్వాధీనం

● జిల్లావ్యాప్తంగా దాడులు, అరెస్టులు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లావ్యాప్తంగా శనివారం బెట్టింగ్ రాయుళ్లు, పంటర్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 85 మంది పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లు, రూ.2.66 లక్షల నగదు, 59 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. గత కొద్ది రోజులుగా జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు దాడులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రధాన బుకీలు, సబ్ బుకీలను 115 మందిని అరెస్టు చేశారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లలో పాల్గొంటున్న వారిపై కూడా జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఈ దాడులు జరిగాయి. నెల్లూరు మూడో నగర పోలీసుస్టేషన్ పరిధిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, ఓ టీవీని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు రూరల్ పోలీసులు నలుగురు బెట్టింగ్ రాయుళ్ల నుంచి రూ.10,300, నాలుగు సెల్‌ఫోన్లు, ఎల్‌ఈడీ టీవీ, కావలిలో ఏడుగురు నుంచి రూ. 11,100, ఏడు సెల్‌ఫోన్లు, పొదలకూరులో 15 మంది నుంచి రూ. 1,72,900లు, ఒక సెల్‌ఫోన్, కోవూరులో 11 మంది నుంచి రూ.6వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గూడూరు సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 42 మంది నుంచి రూ.63,860తోపాటు 38 సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకుని మొత్తం 85 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ అరెస్టుల పరంపర మరో రెండు రోజులపాటు కొనసాగుతాయని పోలీసు వర్గాలు తెలిపాయి.


గూడూరులో 42 మంది బెట్టింగ్ రాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

వైద్య విద్యార్థుల ఘర్షణ

● జూనియర్లపై సీనియర్ల దాడి

● రణరంగంగా మెస్ ప్రాంగణం

● ప్రిన్సిపాల్, కమిటీ చైర్మన్ ఆగ్రహం

నెల్లూరు (వైద్యం) : నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల మధ్య చిన్నపాటి మాటల యుద్ధం రణరంగానికి దారితీసింది. దీంతో ఒకరిపై ఒకరు కొట్లాటకు దిగారు. సీనియర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో జూనియర్లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో కొందరు విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తూ పరుగులు తీశారు. శనివారం ఉదయం 9గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాలలోని మెస్‌లో టిఫిన్ చేస్తున్న మూడో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థి మనోజ్‌కుమార్, రెండో సంవత్సరం చదువుతున్న ఎస్.కె.షాహుల్‌ను రేయ్.. అంటూ సంబోధిస్తూ మంచినీళ్లు తేవాలని అడిగాడు. దీంతో షాహుల్ తనను రేయ్ అంటావా అంటూ మనోజ్‌ను నిలదీశాడు. దీంతో మనో జ్ ఒక్కసారిగా షాహుల్‌పై దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన షాహుల్ స్నేహితుడు వినయ్‌కృష్ణపై కూడా దాడి చేశాడు. ఇంతటితో ఆగకుండా మనోజ్‌కుమార్‌కు సపోర్టుగా మూడు, నాలుగు సంవత్సరం విద్యార్థులు కూడా మూకుమ్మడిగా షాహుల్‌పై దాడి చేసి తీవ్రంగా దాడి చేశారు. చొక్కా చింపి, కళాశాల రోడ్డుపై దొర్లించుకుంటూ రణరంగాన్ని సృష్టించారు. గంట తర్వాత తేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది కలుగజేసుకుని ఘర్షణను నివారించారు.

ప్రిన్సిపాల్ ఆగ్రహం

విషయం తెలుసుకున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, కళాశాల అబివృద్ధి కమిటీ చైర్మన్ చాట్ల నరసింహారావు విద్యార్థుల చర్యలపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. షాహుల్‌పై దాడి చేసిన మనోజ్‌కుమార్‌పై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హెచ్చరించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులపై కూడా చర్యలు తప్పవన్నారు. అన్యాయంగా తోటి జూనియర్ విద్యార్థిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి మొదటి హెచ్చరికగా వార్నింగ్ ఇవ్వడం జరుగుతుందని, పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ చాట్ల నరసింహారావు మాట్లాడుతూ వీధి రౌడీల్లా విద్యార్థులు ఇలాంటి ఘర్షణకు దిగడం సరికాదని అన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఈ కళాశాల అభివృద్ధికి పాటుపడుతుంటే ఇలాంటి చర్యలకు దిగడం సరికాదని, విద్యార్థుల ప్రవర్తన మార్చుకోకపోతే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజు, డాక్టర్ భక్తవత్సలం, డాక్టర్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను హెచ్చరిస్తున్న ప్రిన్సిపాల్

బైక్‌ల దొంగ పట్టివేత

● రూ.5లక్షల సొత్తు స్వాధీనం

● సీసీఎస్ డీఎస్పీ బాలసుందరం

నెల్లూరు (క్రైం) వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం దొంగగా మారిన బైక్ మెకానిక్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి రూ.5లక్షలు విలువ చేసే ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని సీసీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీఎస్పీ బాలసుందరరావు నిందితుడిని, చోరీసొత్తును మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు..

విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన గౌరవరపు శివప్రసాద్ అనే వ్యక్తి అదే ఊరిలో స్కూటర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. విలాసాలు, వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించడం కోసం ద్విచక్ర వాహనాలను అపహరించడం ప్రారంభించాడు. రెండు నెలలుగా నగరంలో ఎనిమిది బైక్‌లను చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్పీ రామకృష్ణ ఆదేశాలతో సీసీఎస్ డీఎస్పీ ఎం బాలసుందరావు పర్యవేక్షణలో సీఐ బాజీజాన్‌సైదా, నాలుగో నగర సీఐ వీ సుధాకర్‌రెడ్డి తమ బృందాలతో నిఘా ఉంచారు. శనివారం ఉదయం మినీబైపాస్ రోడ్డులోని పీవీఆర్ కల్యాణ మండపం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా ఎనిమిది బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రూ.5లక్షల విలువ చేసే ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐలు బాజీజాన్‌సైదా, సుధాకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ రమేష్, హెచ్‌సీలు సురేష్‌కుమార్, రషీద్, పీసీలు రాజేష్, ప్రభాకర్, చిరంజీవి, సుధాకర్, అమీన్‌ను డీఎస్పీ అభినందించారు. త్వరలో వారందరికీ ఎస్పీ నుంచి రివార్డులు అందచేస్తామని ప్రకటించారు.

అపహరించిన బైక్‌లు ఇవే...

జయభారత్ ఆసుపత్రి వద్ద హీరో గ్లామర్ బైక్, ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ కింద హీరో గ్లామర్, ఆర్టీసీ సమీపంలోని యాక్సిక్ బ్యాంక్ పార్కింగ్ స్థలంలో స్ప్లెండర్ ప్రో, స్టోన్ హౌస్‌పేట అరుణా చలం వీధిలోని మయూరి సౌండ్ సిస్టం వద్ద బజాజ్ అవెంజర్ బైక్, లక్ష్మీసాయినగర్‌లోని ఓ ఇంటిలో యమహా ఎఫ్‌జెడ్, పరుచూరి వీధిలోని ఓ ఇంటి ముందు నిలిపి ఉన్న మరో ఎఫ్‌జెడ్ బైక్, మురళీకృష్ణ హోటల్ వద్ద పార్కు చేసిన హీరోహోండా గ్లామర్, వీఆర్సీ సెంటర్‌లోని కామాక్షి లాడ్జిముందు పార్కు చేసిన యమహా ఎఫ్‌జెడ్ బైక్‌లను శివప్రసాద్ చోరీ చేశాడు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

'చవితి'కి నిబంధనలు పాటించాల్సిందే..

వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు పోలీసుశాఖ నిబంధనలన్నీ కచ్చితంగా పాటించాల్సిందేనని సీసీఎస్ డీఎస్పీ, నగర ఇన్‌చార్జి డీఎస్పీ బాలసుందరరావు తెలిపారు. శనివారం సీసీఎస్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. గణేశ విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీలు పూర్తి బాధ్యత వహించి నిబంధనలు అమలు చేయాలన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

నెల్లూరు (క్రైం) : స్కూటీపై వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డుకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి పుచ్చకాయల తేజేష్(16) శుక్రవారం స్కూటీపై వెళుతూ ఆత్మకూరు బస్టాండు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. హస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ టెండర్లు వివాదాస్పదం

● రెండు ప్యాకేజీలకు టెక్నికల్ బిడ్ బ్రేక్
● ఐదు ప్యాకేజీలకు ప్రైజ్ బిడ్ ఓపెన్
● బ్యాచ్ మిక్స్ ప్లాంట్ లీడ్‌తోనే వివాదం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గూడూరు - దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధికి రూ.35 కోట్లతో పిలిచిన టెండర్లు వివాదాస్పదంగా మారాయి. రాజకీయ నేతల జోక్యం, కాంట్రాక్టర్ల మధ్య విబేధాలతో రెండు ప్యాకేజీ టెండర్ల టెక్నికల్ బిడ్ తెరుచుకోలేదు. మరో ఐదు ప్యాకేజీ పనులకు ప్రైజ్ బిడ్ దశ దాటి ఇంజనీరింగ్ చీఫ్ (ఈఎన్‌సీ)కి చేరింది. ఈ పనుల్లో ప్రధానంగా బ్యాచ్ మిక్స్ ప్లాంట్ లీడ్ వివాదం కాంట్రాక్టర్ల మధ్య రగడకు దారి తీసింది. ప్రస్తుతం ముగ్గురు కాంట్రాక్టర్లు వేసిన టెండర్లను ఇంజనీర్లు తొలగింపు జాబితాలో పెట్టారు. పట్టువీడని ఓ టీడీపీ నేత ఈ టెండర్లు ఖరారు చేసి ఐదు శాతం కమీషన్ కోసం పైరవీలు జోరుగా సాగిస్తున్నారు. కాంట్రాక్టర్ల ఫిర్యాదు, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలపై ఈఎన్‌సీ సమగ్ర నివేదిక కోరింది.

● 35 కోట్లతో రోడ్ల అభివృద్ధి

గూడూరు - దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధికి గతేడాది ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఒకే ప్యాకేజీలో టెండర్లు పిలిస్తే పెద్ద కాంట్రాక్టర్లకే పనులు దక్కి ఆలస్యమవుతాయని ఉన్నతాధికారులు ఆలోచించి జీరో నుంచి 15 కి.మీ వరకు ఉన్న ఈ రోడ్డును ఏడు ప్యాకేజీలుగా విభజించారు. ప్రతి ప్యాకేజీలో రూ.4 నుంచి 4.50 కోట్ల వరకు ప్రతిపాదించారు. జూలైలో ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో ఈ పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఆరుగురు కాంట్రాక్టర్లు ఈ పనులు దక్కించుకునేందుకు షెడ్యూల్ దాఖలు చేశారు. వీరిలో ఐదు పనులకు అంచనా వ్యయంపై నాలుగు నుంచి ఐదు శాతం లోపు పెంపుతో షెడ్యూల్ దాఖలు చేశారు. రెండు పనులకు అంచనా వ్యయంపై ఓ కాంట్రాక్టర్ రెండు శాతం లోపుతో దాఖలు చేశారు. ఆర్అండ్‌బీ ఇంజనీర్లు ఈ నెల మొదట్లో టెండర్లను ఓపెన్ చేసి తొలుత టెక్నికల్ బిడ్‌ను పరిశీలించారు. టెండర్ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్‌లు పూర్తిస్థాయిలో సమర్పించారా లేదా అని చూశారు. కాంట్రాక్టర్ల అనుభవం, గతంలో చేసిన పనులతోపాటు బ్యాచ్ మిక్స్ ప్లాంట్ వంద కిలోమీటర్ల లోపు ఉన్నదా లేదా అన్న దానిని ప్రధాన అంశంగా తీసుకున్నారు. టెక్నికల్ బిడ్‌లో కాంట్రాక్టర్లు బీ ప్రభాకర్‌రెడ్డి, పైడాల తిరుపతిరెడ్డి అండ్ కంపెనీ, భవానీ కనస్ట్రక్షన్ అర్హత సాధించాయి. పరంధామిరెడ్డి, డేగా సురేష్, హేమంత్ వేసిన షెడ్యూళ్లను బ్యాచ్ మిక్స్ ప్లాంట్ లేదన్న కారణంగా తొలగించాలని ఇంజనీర్లు నిర్ణయించారు. పరంధామిరెడ్డి బ్యాచ్ మిక్స్ ప్లాంట్‌కు కొటేషన్ ఇవ్వడం, హేమంత్ ప్లాంట్ ఏర్పాటు చేయకపోవడం, డేగా సురేష్ లీడ్ వంద కిలోమీటర్లు దాటడం వంటివి ప్రస్తావిస్తూ ఆ తొలగింపు నిర్ణయం తీసుకున్నారు. కాంట్రాక్టర్ సురేష్ మాత్రం ఆఫ్‌లైన్‌లో ప్లాంట్ లీజుకు తీసుకున్నట్లు ఈఎన్‌సీకి వినతిపత్రం సమర్పించారు. దీంతో ఒకటి, మూడు ప్యాకేజీల పనులను టెక్నికల్ బిడ్ వరకే పరిమితం చేసి ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. మిగిలిన ఐదు పనులకు సంబంధించి లైన్ క్లియర్ కావడంతో ప్రైజ్ బిడ్ కూడా ఓపెన్ చేసి ఈఎన్‌సీకి టెండర్లు నివేదించారు. టెండర్ ఆఫ్ కమిషనర్ (సీవోటీ) పరిశీలించి వీటిని ఆమోదించాల్సి ఉంది.

● బ్యాచ్ మిక్స్ ప్లాంటే కీలకం

జాతీయ, రాష్ట్రీయ రహదారుల నిర్మాణాల్లో కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఐదో రివిజన్ కింద కొన్ని మార్పులను సూచించింది. ఎక్కువ ట్రాఫిక్ ఉండే ఈ రహదారులను హాట్‌మిక్స్ ప్లాంట్‌తో నిర్మిస్తే మున్నాళ్ల ముచ్చటగానే మారుతాయని, ప్రభుత్వం ఎంత డబ్బు ఖర్చు చేసినా వృథాగా మారుతుందని వెల్లడిస్తూ మిక్స్ డీబీఎం, బీసీతో తారురోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు బ్యాచ్ మిక్స్ ప్లాంట్లు ఉండాలని నిబంధన పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 70 కి.మీ లోపు లీడ్ ప్రకటించి బ్యాచ్ మిక్స్‌ప్లాంట్ ఉండాలని నిబంధనలతో టెండర్లు నిర్వహించేది. కాంట్రాక్టర్లు 100 కి.మీ లీడ్ దూరం పెంచాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో నిపుణుల కమిటీని నియమించి 100 కి.మీలో ఉన్న బ్యాచ్ మిక్స్ ప్లాంట్ తయారు చేసిన 160 డిగ్రీలతో డీబీఎం, బీసీని వాహనాల ద్వారా తరలించి పరీక్షించగా 150 డిగ్రీల వేడి కొనసాగింది. నిబంధనల మేరకు వంద నుంచి 120 డిగ్రీల టెంపరేచర్ ఉంటే సరిపోతుందని నిపుణులు తేల్చారు. దీనిపై రాష్ట్ర, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సుమిత్రా దావరా జూన్ 19న జీవో జారీ చేస్తూ బ్యాచ్ మిక్స్ ప్లాంట్ 70 కి.మీ నుంచి 100 కి.మీకు లీడ్ దూరాన్ని పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ బ్యాచ్ మిక్స్ ప్లాంటే తారు రోడ్ల నిర్మాణాల్లో ఎంతో కీలకంగా వ్యవహరిస్తోంది. అందుకనే స్టేట్ హైవే పనుల్లో ఈ ప్లాంట్‌ను కచ్చితమైన నిబంధనగా పెట్టారు.

● కొనసాగుతున్న ఆ నేత పైరవీలు

గూడూరు - దుగరాజపట్నం రోడ్డు అభివృద్ధి కోసం రూ. 35 కోట్లతో పిలిచిన టెండర్లలో ఐదు శాతం కమీషన్ ఓ టీడీపీ నేతకు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. గతంలో జిల్లా ఇన్‌చార్జిమంత్రిగా పని చేసిన ఓ మంత్రి ఈ వ్యవహారాన్ని సర్దుబాటు చేసి ఇటు ఇంజనీర్లు, అటు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీనిపై వరుసగా ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో ఇది వెలుగులోకి వచ్చింది. గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయి ఆర్థికంగా నష్టపోయానని, అందుకే ఈ సర్దుబాటు అని మంత్రి అన్నారని సాగుతున్న ప్రచారం టీడీపీ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. ఈ టెండర్లు ఖరారు అయితే తమ కమీషన్ రాదన్న భావనలో ఆ టీడీపీ నేత పైరవీలు సాగిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అంచనా వ్యయంపై ఐదు శాతం పెంపుతో షెడ్యూల్ దాఖలు చేయడం వల్ల ప్రభుత్వంపై రూ. 1.75 కోట్లు భారం పడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరేమనుకున్నా తన కమీషన్ తనకు ఇవ్వాలని ఆ నేత పట్టుపడుతూ ఈ టెండర్లలో చక్రం తిప్పుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

● నివేదిక కోరిన ఈఎన్‌సీ

వరుసగా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలతోపాటు కాంట్రాక్టర్ డేగా సురేష్ అందించిన ఫిర్యాదులపై ఈఎన్‌సీ స్పందించింది. ఈ టెండర్ల ప్రక్రియపై పూర్తిసమాచారాన్ని అందించాలని కాంట్రాక్టరు జిల్లా ఎస్‌ఈని కోరారు. ఆయన బ్యాచ్ మిక్స్ ప్లాంట్ లీడ్ వివాదంలో ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ సమర్పించినా వాటి ప్రకారం డిస్క్వాలీఫై అయ్యారని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఈఎన్‌సీని కలిసి ఆఫ్‌లైన్‌లో వివరాలు సమర్పించడం టెండర్ విధానానికే విరుద్ధమని వాదనలు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై ఆర్అండ్‌బీ ఎస్‌ఈ విజయకుమార్‌ను వివరణ కోరగా ఈఎన్‌సీ ఈ టెండర్లపై నివేదిక కోరిందన్నారు. సోమవారం పూర్తి స్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికను అందిస్తామన్నారు. ఈ టెండర్లు వివాదాస్పదం కావడంతో ఖరారవుతాయా లేదా అన్న చర్చ రాజకీయ, కాంట్రాక్టు వర్గాల్లో సాగుతోంది.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● సీసీఎస్ డీఎస్పీ బాలసుందరరావు

నెల్లూరు (క్రైం) : పోలీసుశాఖ ప్రవేశపెట్టిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సీసీఎస్ డీఎస్పీ బాలసుందరరావు కోరారు. శనివారం సీసీఎస్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. డీజీపీ ప్రారంభించిన ఈ యాప్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనివల్ల నేరాలను కట్టడి చేయవచ్చన్నారు. ఈ ఆండ్రాయిడ్ అప్లికేషన్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంటుందని, దీన్ని మొబైల్‌లోకి డౌన్‌లోడ్ చేసుకుని యాప్ ఓపెన్ చేసి రిజిస్టర్ ఆప్షన్ ద్వారా ప్రస్తుతం మీరు నివసిస్తున్న ప్రాంతం, చిరునామా, సెల్ ఫోన్ నెంబరు వంటివి నమోదు చేయాలన్నారు. అనంతరం మీ అప్లికేషన్‌ను అమోదించడానికి ఓటీపీ నెంబర్‌తో పాటు యూసర్ ఐడీ వస్తుందని తెలిపారు. ఇంటికి తాళం వేసి ఊర్లకు, యాత్రలకు వెళ్లాల్సినప్పుడు ఈ యూజర్ ఐడీతో యాప్‌లోని రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా ముందుగా సమాచారం అందించి ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఉండరో తెలియ చేయాలన్నారు. వెంటనే పోలీసులు మీ ఇంటి వద్దకు వచ్చి సీసీ కెమరాలు ఏర్పాటు చేసి మీరు తిరిగి వచ్చేవరకు ఇంటిపై నిఘా ఉంచుతారని తెలిపారు. దొంగలు ఇంటిలోకి ప్రవేసిస్తే అక్కడ ఉన్న కెమెరా ద్వారా పోలీస్ కంట్రోల్ రూమ్‌లోని అలారం మోగుతుందన్నారు. ఆ సమాచారాన్ని దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు తెలియచేసి వారిని అప్రమత్తం చేస్తామని తెలిపారు. నెల్లూరు నగరంలో ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేపట్టాల్సినా పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లేకుంటే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోమల నియంత్రణకు చర్యలు

● పరుగులు తీస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోట: కోట పట్టణంలోని పలు కాలనీల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో బ్లీచింగ్, క్లోరినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోట డెంగ్యూ బాట' అన్న వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. మండల వైద్యాధికారులను తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇందీవర ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశ వలంటీరులు క్రాస్‌రోడ్డు, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ, గమల్లపాళెం, ఆకుతోటదిబ్బలో డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. పేడదిబ్బలను ఎత్తి వేయించారు. సర్పంచు రాఘవయ్య, కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఇంటింటికి తిరిగి ప్రజలను డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా అవగాహన కల్పించారు. డెంగ్యూతో బాధపడుతున్న అహమదాబీ, గజ్జల వెంకటమ్మ ఇళ్లకు వెళ్లి డెంగ్యూకు సంబంధించిన మందులను అందజేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డెంగ్యూ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణ ప్రజలకు వివరించారు.



మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న ఏఎన్ఎం, ఆశా వలంటీరులు

అర్హత ఉన్న మత్స్యకారులకు సభ్యత్వం

● మత్స్యశాఖ జేడీ సల్మాన్‌రాజ్

కలువాయి: జిల్లాలో అర్హత ఉన్న మత్స్యకారులకు మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తామని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ సల్మాన్‌రాజ్ తెలిపారు. మండలంలోని దాచూరులో శనివారం ముగిసిన మత్స్యకారుల వేట నైపుణ్య పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వాల కోసం నిర్వహిస్తున్న వేట నైపుణ్య పరీక్షలు పక్కాగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కండలేరు జలాశయం పరిధిలోని దాచూరు మత్స్య సహకార సంఘంలో నూతన సభ్యత్వాల కోసం నాలుగు రోజులుగా మత్సకారులకు వేట నైపుణ్య పరీక్షలు జరుగుతున్నట్లు తెలిపారు. శనివారం దాచూరు, ముక్కతిప్ప, ఆదూరుపల్లి గ్రామాల మత్స్యకారులకు విసురు వల తయారీ, లాగుడు వల వేయడం, ఈతకొట్టడం లాంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 145 మంది హాజరయ్యారన్నారు. ఆయన వెంట మత్స్యశాఖ గూడూరు ఏడీ లక్ష్మీనారాయణ, కో ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మునిప్రసాద్,ఉన్నారు.



అర్హత పరీక్షను పరిశీలిస్తున్న జేడీ సల్మాన్‌రాజ్

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రాస్పెక్టస్‌ను విడుదల చేస్తున్న అధికారులు

సంగం: ఆర్థిక సమస్యలతో అర్ధాంతరంగా చదువులు నిలిపేసినవారు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో- ఆర్డినేటర్ శైలజా లక్ష్మి పేర్కొన్నారు. ఆమె స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ ప్రాస్పెక్టస్ విడుదల చేశారు. చదువులు మధ్యలో నిలిచిపోయినవారు ఎంతో మంది ఓపెన్ స్కూల్‌లో చదివి నేడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. పదవ తరగతి, ఇంటర్‌ను ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు అవకాశం ఉందన్నారు. 2008- 09 ఏడాది పదవ తరగతి, 2010- 11లో ఇంటర్మీడియట్‌ను ప్రవేశ పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పదవ తరగతి 3,98,895 మంది, ఇంటర్ 3,16,249 మంది పరీక్షలు రాశారన్నారు. ఓపెన్ స్కూల్‌లో ఒకేషనల్ కోర్సులు కూడా ఉన్నాయన్నారు. వికలాంగులకు ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికేట్ రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమన్నారు. ఓపెన్ స్కూల్‌లో చేరదలచిన వారు సెప్టెంబర్ 30లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రుసుము చెల్లించి ప్రవేశం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో- ఆర్డినేటర్ ఎంఈవో హనుమయ్య ఉన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పల్లాపల్లిలో ఎండిన వరి


వాకాడు: స్వర్ణముఖి బ్యారేజిలో నీరేది


సాగునీటి కోసం పొలంలో బోరు వేస్తున్న రైతులు


పశువులకు మేతగా వరిపైరు



ఎండిన గూడూరు చెరువు


ఉదయగిరి : చుక్కనీరు లేని దున్నపోతుల వాగు


మెట్టలో ఇలాంటి బావులెన్నో..

కరువు మేఘం కమ్మేసింది!

- మరో నెలలో ముగియనున్న ఖరీఫ్
- చినుకులతోనే సరిపెడుతున్న వరుణుడు
- డెడ్‌స్టోరేజీలో కండలేరు, సోమశిల
- నీటి జాడ లేక తగ్గిన సాగు విస్తీర్ణం



జూన్ మొదటి వారంలో జిల్లాను పలకరించిన నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంతా భావించారు. జూన్ నెల సాధారణ వర్షపాతం 56.8 మి.మీ కాగా, 75.3 మి.మీ నమోదైంది. 32.6 శాతం అధిక వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ సీజన్ అదును దాటుతున్నా రైతన్నలు పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. మూడేళ్ల అనుభవాలు దృష్టిలో పెట్టుకున్న రైతన్నలు కాస్త ఆలస్యం చేసి జూలైలో కురిసే వర్షాలను బట్టి పంటలు సాగు చేయవచ్చని ఆలోచన చేశారు. అయితే, జూలైలో సాధారణ వర్షపాతం 86.3 మి,మీ కాగా, 44.6 మి.మీ నమోదైంది. ఒక్క సారిగా 33.4 శాతం లోటు వర్షపాతం కొనసాగడంతో రైతన్నలు పంటలు పెట్టేందుకు సాహసించ లేదు. ఖరీఫ్‌లో సాధారణ సాగు 81వేల హెక్టార్లు కాగా, బోర్లు, నీటి వనరులు ఉన్న చోట మాత్రమే 33వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు పెట్టారు. అంటే 40 శాతం పంటలే ఖరీఫ్‌లో సాగైనట్లు వ్యవయాసాధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఆగస్టులో 86.1 మి.మీ సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 45.6 మి.మీ మాత్రమే వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్, జూలై, ఆగస్టులలో గురువారం వరకు 194.6 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా, 164.5 మి.మీ వర్షపాతమే నమోదైంది. అంటే 7.2 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది.

ముగుస్తున్న సీజన్

జిల్లాలో రెండో పంటను ఖరీఫ్ కింద లెక్కిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ఏప్రిల్ నుంచి మొదలై సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌నే జిల్లాలో రైతులు రెండో పంట కింద లెక్కించి పంట సాగు చేస్తారు. మెట్ట ప్రాంతంలో ఆరుతడి పంటలతోపాటు సోమశిల ప్రాజెక్టు కింద కొంత, పెన్నా డెల్టాలో మరి కొంత వెరసి 81 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. తగిన నీటి వనరులు లేకపోవడంతో ఈసారి 33వేల హెక్టార్లకే పంటల సాగు పరిమితమైంది. ప్రస్తుతం పెట్టిన పంటలు కోత దశకు రావడం చివరి తడులు నీళ్ల లేక రైతన్నలు అల్లాడిపోతున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షంతో పంటలకు ప్రాణం పోస్తున్నా రబీ సీజన్‌లో పెట్టే పంటలకు సాగునీటి మాటేమిటన్నది రైతులను వేధిస్తోన్న ప్రశ్న. సోమశిలలో 7.50 టీఎంసీల డెడ్ స్టోరేజిని దాటి ప్రస్తుతం 6.673 టీఎంసీలు మాత్రమే ఉంది. కండలేరులో డెడ్ స్టోరేజిని దాటి 3.788 టీఎంసీలు నిల్వ ఉండగా, రోజుకు 270 క్యూసెక్కులను తాగునీటి అవసరాలకు పంపింగ్ చేస్తున్నారు. ప్రధాన జలాశయాలన్నీ ఎండిపోతుండటంతో వర్షాలు కురవకపోతే సాగునీటికే కాదు, తాగునీటి కష్టాలు వెంటాడుతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కురిసే వర్షాలకు పెన్నాకు వరద పోటెత్తి సోమశిలకు నీరు చేరేది. అలాంటిది ఆ జిల్లాల్లో కూడా వర్షాభావం కొనసాగుతుండటం పెన్నా ఎండిపోయి దర్శనమిస్తోంది. కృష్ణా నది పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. నెల రోజుల తరువాత రబీ మొదలు కానున్నది. వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు చేరితే తప్ప నార్లు పోసే సాహసం రైతన్నలు చేయడం లేదు. నాలుగేళ్లుగా జిల్లా రైతులకు ఖరీఫ్ కలిసి రావడం లేదు. ఈసారి కూడా అదే పరిస్థితులు కొనసాగుతుండడంతో అన్ని వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అల్పపీడనాలు, తుఫాన్‌ల జాడ కనిపించకపోవడంతో వర్షించే పరిస్థితి లేదని అధికారులు పేర్కొంటున్నారు. మరి వరుణుడు కరుణిస్తే తప్ప నీటి కష్టాలు తీరని పరిస్థితి నెలకొంది.

ఒకప్పుడు పచ్చని పొలాలు, కాడెద్దుల సేద్యం, రచ్చబండ కబుర్లతో చూడముచ్చటగా కనిపించే పల్లె సీమలు నేడు బోసిపోయాయి. పచ్చటి పొలాలు బీడువారి, కంపచెట్లు మొలిచాయి. సంతోషాల పలకరింపులు 'కరువ'య్యాయి. ఇంతటి కరువు తామెన్నడూ చూడలేదని ఎనిమిది పదులు దాటిన పెద్దలు చెబుతున్న మాటల్లో నిజం లేకపోలేదు. వరుసగా ఐదేళ్లు వర్షాలు కురవకపోవడంతో ఇంకేముంది మా బతుకులంటూ రైతులు వాపోతున్నారు. కరువు కోరల్లో చిక్కిన ప్రజలు ఎదురొడ్డి పోరాడలేక తమ బతుకుబండిని పట్టణాల వైపు మళ్లిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాలు ఖాళీ అవుతున్నాయి.

- ఉదయగిరి రూరల్

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లాలో కరువు మేఘం కమ్ముకుంటోంది. నాలుగేళ్లుగా ఖరీఫ్ సీజన్ రైతన్నలకు కలిసి రావడం లేదు. నైరుతి రుతు పవనాలు పలకరించకపోవడంతో చిను కు జాడ లేక నీటి కష్టాలు రోజు రోజుకు తీవ్రమవుతున్నాయి. మరో నెలలో ముగిస్తున్న ఖరీఫ్ సీజన్ పూర్తిగా నిరాశ మిగల్చగా కనీసం రబీలోనైనా ఆశాజనకంగా పంటలు సాగు చేసే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులో సాధారణ వర్షపాతం కన్నా 11.5 శాతం లోటు కొనసాగుతుండటం పెట్టిన 40 శాతం పంటలైనా చేతికందేనా అన్న సందేహం వ్యక్తమవుతోంది. ఇక జిల్లాలోని ప్రధాన జలాశయాలైన కండలేరు, సోమశిలలు డెడ్ స్టోరేజికి దిగువన చేరుకోవడం తాగునీటి కష్టాలు కొనసాగుతున్నాయి.

నాలుగేళ్ల వర్షపాతం వివరాలు

నెల	సాధారణం	2014-15	2015-16	2016-17	2017-18
జూన్	56.8	29.4	40.7	63.8	75.3
జులై	86.3	39.1	26.1	39.6	44.6
ఆగస్టు	86.1	79.0	138.0	26.7	45.6
మొత్తం	229.2	147.5	204.8	130.1	164.5



గడిచిన మూడు నెలల్లో సాగు వివరాలు (హెక్టార్లలో)

పంట	సాధారణం	జూన్	జూలై	ఆగస్టు
వరి	50,516	11,180	16,438	18,494
సజ్జ	847	187	486	1255
మొక్కజొన్న	152	8	27	44
రాగులు	1031	0	0	114
పెసర	464	2	2	14
మినుము	4131	12	24	58
వేరుశనగ	8177	5388	7192	7822
నువ్వు	1397	0	103	251
పొద్దుతిరుగుడు	761	16	108	198
పత్తి	4666	1201	3477	3689
చెరకు	4963	42	111	209
కూరగాయలు	960	102	204	310


గుడినరవకు వృద్ధులే దిక్కు..

ఐదేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా ఉద యగిరి నియోజకవర్గంలో గ్రా మాలన్నీ ఖాళీ అవుతున్నాయి. సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి, వింజమూరు మండలాల్లో సైతం నెలకొంది.

అందరూ ఉండి అనాథలా..


సీతారామపురం మం డలం పోలంగారిపల్లి, అయ్యవారిపల్లి, నారాయణప్పపేట, బాలాయపల్లి, పీఆర్‌దొడ్ల, ఉదయగిరి మండలం జీ.చెర్లోపల్లి, జీ.అయ్యవారిపల్లి, కృష్ణంపల్లి, పుల్లాయపల్లి, దుంపవారిపల్లి, దుత్తలూరు మండలం నందిపాడు, భైరవరం, నర్రవాడ, కొత్తపేట, రాచవారిపల్లి, వింజమూరు మండలం చాకలకొండ, కాటేపల్లి, నల్లగొండ్ల, ఊటుకూరు, తమిదపాడు, వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, ఎన్‌బీ కాలనీ, ఇస్కపల్లి, జడదేవి తదితర గ్రామాల్లో రైతులంతా వ్యవసాయ మాని పనుల కోసం ఇతర ప్రాంతాలకు పయనమవుతున్నారు.

● వేల ఎకరాల్లో ఉద్యాన పంటల ధ్వంసం

పంట చేతికొచ్చే ఉద్యాన పంటలైన బత్తాయి, నిమ్మ, మామిడి, బొప్పాయి, సపోట పంటలు నీరు లేక మలమల మాడిపోతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో 30వేల ఎకరాలకుపైగా ఈ పంటలు ఎండిపోయాయి.

● వేల సంఖ్యలో బోర్లు

గత రెండేళ్లుగా అటు ఉద్యాన, ఇటు సాధారణ పంటలను రక్షించుకొనేందుకు అదనంగా వేల సంఖ్యలో బోర్లు వేశారు. ఎలాగైనా పంటలను రక్షించుకొందామని బంగారు తాకట్టు పెట్టి, అప్పులు చేసి 500-900 అడుగుల లోతుల్లో బోర్లు వేసినా చుక్కనీరు రాక రైతు దివాలా తీశాడు. ఒక్కో రైతు ఆశకు వెళ్ళి 20 బోర్లకు వేశాడు. అయినా ప్రయోజనం లేదు. ఒక్కో బోరుకు లక్ష రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇలా ఐదేళ్లుగా పాతాళగంగమ్మ కోసం పాట్లు పడుతున్నా ఆమె కరుణించకపోవడంతో రైతన్న కుదేలయ్యాడు.



ఉపాధి పనులూ కరువే

రెండేళ్లుగా గ్రామంలో ఉపాధి పనులు కూడా లేవు. నాలుగేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటల సాగు లేక అల్లాడుతున్నాం. అధికారులు ఉపాధి పనులైనా కల్పిస్తే బాగుండు.

- బాలిబోయిన వెంకటేశ్వర్లు, గుడినరవ

కరువు.. అన్నదాతను వీడనంటోంది. తీవ్రవర్షాభావం నేపథ్యంలో పంటలు పండక రైతన్నలు అవస్థలు పడుతు న్నారు. జిల్లాలో 32.7 లక్షల ఎకరాలు ఉండగా, సాగుభూమి 11 లక్షల ఎకరాలు, ప్రాజెక్టుల కింద 7.16 లక్షలు, మెట్ట ప్రాంతాల్లో 3.84 లక్షల ఎకరాల భూమి సాగులో ఉంది. జిల్లాలో డెల్టా ప్రాంతం మినహా మిగతా ప్రాంతాల్లో ఐదేళుగా పంటలు సక్రమంగా పం డటం లేదు. ఇక మెట్ట ప్రాంత రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

- కావలి


వర్షం కురిస్తేనే ఈ భూమి సాగయ్యేది!

కరువు రైతుకు ఆదరణేది..?

● జిల్లాలో కరువు కాటేస్తోంది. వరుసగా కరువు కబళిస్తున్నా ప్రభుత్వం రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం జిల్లాలోని 27 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. దాని వల్ల రైతులకు ఒనగూరిన ప్రయోజనం కనిపించడం లేదు. పంట నష్టపరిహారం గానీ, రైతులకు రుణాల రీషెడ్యూల్ గానీ, పంటల బీమా చెల్లించిన దాఖలాలు గానీ లేవు. సేవ్‌ది క్రాప్ కింద రైతులను ఆదుకంటామని గతంలో చెప్పినా ఆచరణలో ఎక్కడా లేదు.

మెట్టప్రాంతాల పరిస్థితి ఘోరం

వర్షాధారంపై వ్యవసాయం సాగించే కావలి డివిజన్ లాంటి మెట్ట ప్రాంతాలలో రైతుల స్థితి మరింత అగమ్యగోచరంగా ఉంది. అదునులో రుతుపవనాల ఆధారంగా వర్షాలు పడే రోజులు పోయి అల్పపీడనాల ప్రభావంతోనే వర్షాలు కురిసే పరిస్థితులు వచ్చాయి. దాంతో అదునులో పంటలు వేయడం గగనమైంది. చివరకు అల్పపీడనాలు, వాయుగుండాలు కూడా తుస్సుమనడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మెట్ట ప్రాంతాలలో ఇప్పటికే మినుము, పెసర, కంది, మిరప, పొగాకు లాంటి పంటలకు అదును ప్రారంభమైంది. ప్రస్తుతం కురిసిన వర్షాలు కొన్ని చోట్ల దుక్కులు దున్నేందుకు ఉపయోగపడ్డాయి. మరికొన్ని చోట్ల దుక్కులు దున్నటానికి కూడా సరిపడా కురవలేదు. దుక్కులు దున్నిన చోట కూడా తల్లి పదునులో కలిసేట్లు వర్షాలు పడితేనే పంటలు సాగు చేసేందుకు వీలు పడుతుంది. మరో వైపు విత్తనాలు ఖర్చు అధికంగా ఉంది. సాగు ఖర్చు అధికంగా ఉండడంతో మరికొందరు సాగుకు ముందుకు రావటంలేదు.

ఐదేళ్లుగా కరువే!

● మెట్టలో పరిస్థితి దారుణం ● అయోమయంలో రైతన్న

ఎందుకు పనికిరాని మాగాణి భూములు

జిల్లాలో 1763 చెరువుల కింద సుమారు 3 లక్షల ఎకరాల భూమి సాగులో ఉంది. కావలి డివిజన్‌లో 488 చెరువుల కింద లక్ష ఎకరాల సాగు ఉంది. ఈ చెరువుల కింద వర్షాధారంగానే పంటలు పండిస్తారు. వానలు లేకపోవడంతో నాలుగేళ్లుగా పం టలు పండడం లేదు. ప్రస్తుతం ఆ భూములు మెట్ట సాగుకు పెద్దగా పనికి రావు. ఏదైనా ఆరుతడి పంటలు వేద్దామంటే వాటికి సరిపడా కూడా వర్షాలు కురవటంలేదు. కొన్నిచోట్ల మాగాణి భూములలో ఏదైనా మెట్ట పంటలు సాగుచేస్తే చదరం గా ఉండే ఆ భూములలో కొద్దిపాటి వర్షం పడినా నీరు సక్రమంగా కిందకు వెళ్లక పంటలు కుళ్లి పాడై పోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో విలువైన మాగాణి భూములు నేడు ఎందుకూ పనికి రాకుండా బీడు భూములుగా మారాయి. పెద్ద రైతుల పరిస్థితి కూలీలకన్నా దారుణంగా తయారై జీవనోధారం భారంగా మారింది.



అయోమయంలో ఉన్నాం

అదునులో వర్షాలు పడక రైతుల్లో అయోమయం నెలకొంది. వ్యవసాయ ఖర్చులు భారీగా పెరగడం, సకాలంలో వర్షాలు పడకపోవడంతో పంటలు సాగు చేయాలంటే రైతులు భయపడుతున్నారు. ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తే తప్ప వ్యవసాయం సాగని పరిస్థితి.

- బి. వెంకటకృష్ణారెడ్డి, ఉత్తమ రైతు, కోదండరామాపురం, జలదంకి



పశువులకు తాగునీరు కరువు

వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటడంతో బావుల్లోనూ, బోర్లలోనూ నీరు లేదు.ఐదేళ్లుగా పంటలకన్నా పశువులను నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నాం. పశువులకు కూడ నీరు లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సోమశిల నీటిని పశువులకైనా వదలి కాపాడాలి.

- దామా మల్లికార్జునరావు, కొత్తపల్లి, కావలి



తప్పని స్థితిలో సాగు

తప్పని పరిస్థితుల్లోనే కొందరు రైతులు వ్యవసాయాన్ని వీడలేకున్నారు. వర్షాభావం వారిని వేధిస్తోంది. ప్రస్తుతం అదును ప్రారంభమైనా వర్షాలు సరిగా పడకపోవడంతో దుక్కులకే పరిమితమయ్యాం. భూగర్భ జలమట్టం పెరిగితేనే పంటల సాగుకు అనుకూలించదు.

- ఎల్ చినకోటేశ్వరరావు, కందులవారిపాలెం, కలిగిరి

చుక్క నీరు లేని కలిగిరి చెరువు



డబ్ల్యూహెచ్‌ఒ రాయబారి మిల్కాసింగ్

అంతర్జాతీయం

పోలియో రహిత దేశంగా సోమాలియా

ప్రపంచ ఆరోగ్య సంస్థ సోమాలియాను పోలియో రహిత దేశంగా ఆగస్టు 13న ప్రకటించింది. మూడేళ్లగా సోమాలియాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అఫ్ఘనిస్తాన్, నైజీరియా, పాకిస్తాన్ లలో మాత్రమే పోలియో కేసులు నమోదవుతున్నాయి. సోమాలియాలో చివరిగా 2014లో పోలియో కేసు నమోదైంది. సోమాలియాను పోలియో రహిత దేశంగా ప్రకటించినా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందువల్ల టీకాలను నిరంతరం అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

బార్సిలోనాలో ఉగ్రదాడి



స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆగస్టు 17న ఉగ్రవాదులు జరిపిన దాడిలో 13 మంది మరణించారు. బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో ఉగ్రవాదులు వ్యానుతో పాదచారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పోలీసులు ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. పర్యాటకులు, జనసంచారంతో ఉండే ఈ దారిని దాడికి ఉగ్రవాదులు ఎన్నుకొన్నారు. 2004లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు రైళ్లలో పేలుళ్లకు పాల్పడటంతో 191 మంది మరణించారు.

అమెరికా ఉగ్ర జాబితాలో 'హిజ్బుల్ ముజాహిదీన్'

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. హిజ్బుల్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. 1989లో ఏర్పాటైన హిజ్బుల్ కశ్మీర్‌లో పెద్ద ఉగ్రవాద సంస్థల్లో ఒకటి. తాజా ప్రకటనతో ఆ సంస్థకు నిధుల సమీకరణ కష్టతరం కానుంది. ఆంక్షల కారణంగా హిజ్బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

జాతీయం

రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 275.6 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది. 2015-16లో 251.7 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి వచ్చింది. వరి దిగుబడి 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు పెరిగింది. గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.

ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామా



ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా తన పదవికి ఆగస్టు 18న రాజీనామా చేశారు. సీఈవోగా తప్పుకొన్న సిక్కాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. తాత్కాలిక సీఈవో & ఎండీగా యూబీ ప్రవీణ్ రావును నియమించారు. 2014 జూన్ 12న సిక్కా ఇన్ఫోసిస్ సీఈవో & ఎండీగా బాధ్యతలు చేపట్టారు. 1986లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్, నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రవీణ్ సభ్యుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ బీపీవోకు కూడా ప్రవీణ్ ఛైర్మన్.

డబ్ల్యూహెచ్‌ఒ రాయబారి మిల్కాసింగ్

పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి మిల్కాను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపిక చేసింది. ఈ ప్రాంతంలో 2025 నాటికి శారీరక శ్రమ 90 శాతం ఉండేలా, అంటువ్యాధులు కాని రోగాల విస్తృతిని 25 శాతానికి పరిమితం చేసేలా డబ్ల్యూహెచ్‌ఒ కార్యాచరణ రూపొందించింది. దీనికి ప్రచారకర్తగా మిల్కాను నియమించింది.

పురస్కారం

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

ఛత్తీస్‌గఢ్ పోలీస్ జవానుకు ఈ ఏడాది అత్యున్నత పోలీస్ పురస్కారం లభించింది. కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం 'రాష్ట్రపతి పోలీస్ శౌర్య' పతకాన్ని ప్రకటించారు. 2015లో నక్సల్స్‌తో జరిగిన పోరులో ఛత్తీస్‌గఢ్ పోలీస్ ప్లటూన్ కమాండర్ శంకర్‌రావు ప్రాణాలు కోల్పోయారు. పోలీస్ విభాగంలో అత్యున్నత పురస్కారంగా భావించే రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని పొందారు.

ఐదుగురికి 'కీర్తిచక్ర'

శాంతి సమయంలో సైనికులకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తిచక్ర'కి ఈ సారి ఐదుగురిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురికి మరణానంతరం ప్రకటించారు. వారిలో గూర్ఖా రైఫిల్స్‌కి చెందిన హవాల్దార్ గిరిస్ గురుంగ్, నాగా రెజిమెంట్‌కు చెందిన మేజర్ డేవిడ్ మన్లున్, సీఆర్పీఎఫ్ 49వ బెటాలియన్ కమాండెంట్ ప్రమోద్ కుమార్ ఉన్నారు. గార్వాలా రైఫిల్స్‌కు చెందిన మేజర్ ప్రీతం సింగ్, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి చేతన్‌కుమార్ చీతా కీర్తిచక్ర పొందిన మిగిలిన ఇద్దరు.

క్రీడలు

బల్గేరియా ఓపెన్ విజేత లక్ష్యసేన్



బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత యువ క్రీడాకారుడు లక్ష్యసేన్ నిలిచాడు. బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17తో క్రొయేషియాకు చెందిన రెండో సీడ్ జురెకిన్ జాక్‌పై గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. లక్ష్యకు ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. గతేడాది ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను గెలుచుకొన్నాడు. ప్రస్తుతం జూనియర్ ప్రపంచ నెంబర్ వన్‌గా ఉన్న లక్ష్యసేన్‌కు సీనియర్ విభాగంలో ఇది రెండో అంతర్జాతీయ టైటిల్.

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్



శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' శిఖర్ ధావన్‌కు, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు హర్దిక్ పాండ్యకు లభించింది. చివరి టెస్టులో భారత ఇన్నింగ్స్ 171 పరుగులతో విజయం సాధించింది. తాజా విజయంతో టెస్టు ర్యాంకింగ్‌లో భారత్ 125 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

రోజర్స్ కప్ విజేత అలెగ్జాండర్

వింబుల్డన్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న రోజర్ ఫెదరర్‌ను రోజర్స్ కప్ ఫైనల్లో జర్మనీ యువ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఓడించాడు. మాంట్రియాల్‌లో జరిగిన ఫైనల్లో జ్వెరెవ్ 6-3, 6-4 తేడాతో ఫెదరర్‌ను ఓడించి కప్ గెలుచుకున్నాడు. ఈ విజయంతో అలెగ్జాండర్ ప్రపంచ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి చేరుకున్నాడు.

స్వయం ఉపాధి



పైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

కారప్పూస, బూందీ, మురుకులు, మిక్చర్ వంటి సంప్రదాయ చిరు ఆహార పదార్థాలు; ఆలు చిప్స్, ఫ్రెంచి ఫ్రైస్, కుర్‌కురే, ఫ్రెయామ్స్ వంటి ఆధునిక బైపాస్ స్నాక్స్ గురించి మనందరికీ తెలుసు. వీటిలో కొన్ని వంటనూనెలో ఫ్రై చేసినవి కాగా మరికొన్ని ఎక్స్‌ట్రూడెడ్ ఆహార పదార్థాలు. మధ్యాహ్న సమయంలో టీ తోపాటు స్నాక్స్‌గా/ బైపాస్ స్నాక్స్‌గా వీటిని ఎక్కువగా తింటుంటారు. ఈ ఆహార పదార్థాలు రుచిగా ఉన్నప్పటికీ కొన్ని రకాల అనారోగ్యాలకు కారణమౌతున్నాయి. అందుకే వీటికి ప్రత్యామ్నాయంగా సహజమైన గింజలను లేదా నట్స్‌ను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. జీడిపప్పు, వేరుశనగ గింజలు, బాదాంలు వంటివి మంచి బలవర్ధకమైన

మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్



పోషకవిలువలు ఉన్న నట్స్/ గింజలుగా పరిగణించవచ్చు. వీటిలో తక్కువ కార్బొహైడ్రేట్స్, అధిక పీచు పదార్థం, అధిక కేలరీల శక్తితోపాటు అధికంగా అన్‌శాచురేటెడ్ కొవ్వు ఉంటాయి. అందుకే ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా పుష్టిగా ఉంచేందుకు తోడ్పడతాయి. వేరు శనగ గింజల్లో ఉండే మోనోశాచురేటెడ్ ఫాటీ యాసిడ్స్ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి తోడ్పడుతున్నట్లు పరిశోధనల్లో వెల్లడయింది. అంతేకాకుండా వీటిలో పుష్కలంగా ఖనిజాలు, విటమిన్లు ఉండటం వల్ల ప్రతిరోజూ పిడికెడు వేరుశనగ గింజలను తినడం ఆరోగ్యానికి మంచిదని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. జీడిపప్పులో అధిక అన్‌శాచురేటెడ్ కొవ్వు, విటమిన్ ఇ, మెగ్నీషియం, జింక్ ఖనిజాలు అధికంగా ఉంటాయి. జీడిపప్పును తినడం వల్ల గుండె సంబంధ వ్యాధులు రాకుండా నివారించవచ్చని, మధుమేహాన్ని కూడా రానివ్వదని పరిశోధకులు తెలియజేస్తున్నారు. బదానీల్లో ఎముకల వృద్ధికి తోడ్పడే విటమిన్ కె, మాంగనీస్ ఖనిజాలు అధికంగా ఉంటాయి.

రెడీ టు ఈట్ స్నాక్స్ మార్కెట్: ఇటీవల మనదేశంలో ప్యాక్‌డ్ ఫుడ్ వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రెడీ - టు - ఈట్ స్నాక్స్, నమ్‌కీన్స్ మార్కెట్ రూ.50,000 కోట్లకు పైగా ఉంది. 2014 - 19 కాలంలో సగటున ఏడాదికి 22 శాతం వృద్ధి ఉండవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో మారుతున్న జీవన సరళి; నూతన ఉత్పత్తుల ఆవిష్కరణపై పెరుగుతున్న ఆసక్తి; పెరుగుతున్న రిటైలింగ్ ; ప్రభుత్వ ప్రోత్సాహకాల కల్పన వంటి కారణాల వల్ల రెడీ టు ఈట్ స్నాక్స్ మార్కెట్ రోజురోజుకీ వృద్ధి చెందుతోంది.

మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్: పలు ఆరోగ్య అనుకూల లక్షణాలు ఉన్న అన్ని రకాల గింజలను కలిపి తినడం ద్వారా శరీరానికి మెరుగైన పలు పోషకాలు లభించడానికి అవకాశం ఉంటుంది. బదాణీలు, జీడిపప్పు, వేరుశనగ వంటివాటిని నేరుగా తినడానికి వీలుగా ఉండేలా తయారుచేసి నిర్ణీత నిష్పత్తిలో వాటిని కలిపి ప్రత్యేకమైన ఒక ప్యాకెట్ ద్వారా అందివ్వడమే మిక్స్‌డ్ నట్స్ స్నాక్స్ యూనిట్ పని.

అవసరమైన యంత్ర పరికరాలు: ● ట్రే డ్రయ్యర్ ● రోస్టర్ ● ఫ్రయ్యింగ్ పాన్ ● కోటింగ్ పాన్ ● ప్యాకింగ్ మిషన్ ● తూనిక యంత్రాలు తదితరాలు

ముడి పదార్థాలు: ● జీడిపప్పు ● వేరుశనగ గింజలు ● డ్రై బదాణీలు ● వంట నూనె ● ఉప్పు ● మసాలా దినుసులు ● ప్లాస్టిక్ ప్యాకింగ్ ఫిల్మ్ ● అట్టపెట్టెలు

తయారీ విధానం: బదాణీలను ముందుగా 8 గంటలపాటు నీటిలో నానబెట్టి తరవాత నీరు తీసివేసి రోస్టింగ్ చేయాలి. బదాణీల పై పొర తీసివేయాలి. వేరు శనగ గింజలను కూడా రోస్టింగ్ చేసి పైపొట్టు తీసివేయాలి. నాణ్యమైన జీడిపప్పును కూడా రోస్టింగ్ చేయాలి. ఈ మూడింటిని నిర్ణీత నిష్పత్తిలో కలిపి ఉప్పు చేర్చి రెడీ టు ఈట్ స్నాక్స్‌గా ప్యాక్ చేయాలి. వీటికి కొంత పరిమాణంలో మసాలా దినుసుల పొడి కలిపి మసాలా నట్స్‌గా కూడా తయారుచేయవచ్చు. మార్కెటింగ్ అవసరాల మేరకు 35గ్రా, 100గ్రా, 250గ్రా, 500గ్రా, 1 కిలో పరిమాణాల్లో ప్యాకెట్లను రూపొందించుకోవచ్చు. ఎక్కువగా 35గ్రా, 50గ్రా ప్యాకెట్స్ వినియోగదారులకు అనుకూలంగా ఉంటాయి.

మార్కెటింగ్: వినియోగదారుల సౌలభ్యం మేరకు అన్ని రకాల రిటైల్ దుకాణాల్లో, సూపర్ మార్కెట్లలో రెడీ టు ఈట్ స్నాక్ ప్యాకెట్స్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో, బార్ & రెస్టారెంట్లలో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు:

ఉత్పత్తి సామర్థ్యం: 250 కేజీలు(ఒక రోజు - ఒక షిఫ్టుకు)

పరిశ్రమ వ్యయం: రూ.25 లక్షలు

What are the total marks scored...

QUANTITATIVE APTITUDE

Direction (1-5) : What value should come in place of the question mark (?) in the following questions?

1. $\frac{\sqrt{4356}\times\sqrt{?}}{\sqrt{6084}}=11$
   (1) 196 (2) 125 (3) 169 (4) 225 (5) 81
2. $4\frac{1}{2}+\left(1\div2\frac{8}{9}\right)-3\frac{1}{13}=?$
   (1) $\frac{23}{13}$ (2) $\frac{13}{23}$ (3) $\frac{25}{13}$ (4) $\frac{25}{26}$
   (5) None of these
3. $\left\{(441)^{\frac{1}{2}}\times207\times(343)^{\frac{1}{3}}\right\}\div\left\{(14)^2\times(529)^{\frac{1}{2}}\right\}=?$
   (1) 5.75 (2) 6.75 (3) 7.75 (4) 6.25 (5) 6.50
4. $-676.76+1237+897.34-?=1294.25$
   (1) 168.2 (2) 164.2 (3) 154.2 (4) 164.8
   (5) None of these
5. $\frac{(22\times5+8^2+4^2)^2}{12\times25\times6\div36\times2}+\frac{85\times240\times750}{51\times8\times100}+\frac{800\times289}{17\times25}$
   $=?$
   (1) 1360 (2) 1177 (3) 1470 (4) 1280 (5) 1170

Direction (6-10): Study the following table carefully and answer the given questions. Table shows the percentage of marks scored by five different students in six different subjects.

Student→ Marks ↓	Math (150)	English (120)	Reasoning (50)	Computer (50)	Marketing (100)	GS (200)
Lucky	64%	65%	52%	60%	77%	49.5%
Priti	70%	50%	56%	58%	57%	54.5%
Kumkum	65%	75%	70%	54%	63%	57%
Alka	48%	55%	64%	56%	71%	61%
Poonam	56%	40%	48%	46%	53%	52.5%

6. What are the total marks scored by Priti in all the six subjects together?
   (1) 378 (2) 386 (3) 388 (4) 398 (5) None of these
7. What is the average marks scored in Reasoning by all the students?
   (1) 26 (2) 27 (3) 28 (4) 29 (5) None of these
8. Marks scored by Kumkum in Computer is **approximately** what percentage of marks scored by Alka in English?
   (1) 42% (2) 41% (3) 40% (4) 39%
   (5) None of these
9. What is the difference between the total marks scored by Lucky in Reasoning and Kumkum in GS and total marks scored by Priti in Reasoning and Alka in Math?
   (1) 80 (2) 100 (3) 90 (4) 120 (5) None of these
10. What is the aggregate **approx** percentage of Poonam considering all the six subjects?
   (1) 47% (2) 54% (3) 57% (4) 50%
   (5) None of these

Direction (11-15) : What will come in place of question mark (?) in the following number series.

11. 3 11 ? 115 567 3411
   (1) 25 (2) 27 (3) 42 (4) 37 (5) 33
12. 326.34375 219.0625 90.125 29.25 11 ?
   (1) 9 (2) 8 (3) 5.5 (4) 7.5 (5) 6.5
13. 5 4 23 7 3 24 9 2 ? 11 1 14
   (1) 29 (2) 31 (3) 20 (4) 21 (5) 25
14. 19 35 89 217 ? 899
   (1) 429 (2) 431 (3) 420 (4) 421 (5) 467
15. 19 29 47 77 125 ?
   (1) 235 (2) 283 (3) 200 (4) 220 (5) 225
16. A tank is fitted with 8 pipes, some of them that fill the tank and other pipes are meant to empty the tank. Each pipe that fills the tank can fill it in 8 hours, while each of those that empty the tank can empty it in 6 hours. All the pipes are kept open. When the tank is full, it will take exactly 6 hours for the tank to empty. How many pipes are filling the tank?
   (1) 4 (2) 3 (3) 6 (4) 2 (5) None of these
17. Wheels of diameters 7 cm and 14 cm start rolling simultaneously form X and Y, 1980 cm apart, towards each other in opposite directions. Both of them make same number of revolutions per second. If both of them meet after 10 second, then find the speed of the smaller wheel.
   (1) 32 cm/s (2) 42 cm/s (3) 56 cm/s
   (4) 66 cm/s (5) 44 cm/s
18. There is a ring road connecting points P, Q, R and S. The road is in a complete circular form but having several approach roads leading to the centre. Exactly in the centre of the ring road there is a tree which is 20 Km from Point P on the circular road. You have taken a round of circular road starting from point P and finish at the point after touching points Q, R and S. You then drive 20 km interior towards the tree from point P and from there, reach somewhere in between Q and R on the ring road. How much distance do you have to travel from the tree to reach the point between Q and R on the ring road?
   (1) 35 km (2) 42 km (3) 20 km (4) 25 km
   (5) None of these



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's & Clerks Special

Answers With Explanation

(1-5) :


1. (3) $\frac{\sqrt{4356}\times\sqrt{?}}{\sqrt{6084}}=11$
   $\Rightarrow \frac{66\times\sqrt{?}}{78}=11$
   $\Rightarrow \sqrt{?}=\frac{78\times11}{66}=13$
   $\therefore\ ?=169$
2. (1) $4\frac{1}{2}+\left(1\div2\frac{8}{9}\right)-3\frac{1}{13}=?$
   $=\frac{9}{2}+\left(1\times\frac{9}{26}\right)-\frac{40}{13}$
   $=\frac{9}{2}+\frac{9}{26}-\frac{40}{13}$
   $=\frac{117+9-80}{26}$
   $=\frac{46}{26}=\frac{23}{13}$
3. (2) $\left[(441)^{\frac{1}{2}}\times207\times(343)^{\frac{1}{3}}\right]\div\left[(14)^2\times(529)^{\frac{1}{2}}\right]$
   $=(21\times207\times7)\div(196\times23)$
   $=\frac{21\times207\times7}{196\times23}=6.75$
4. (5) $-676.76+1237+897.34-?=1294.25$
   $\Rightarrow 1457.58-?=1294.25$
   $\Rightarrow ?=1457.58-1294.25$
   $=163.33$
5. (4) $\frac{(22\times5+8^2+4^2)^2}{12\times25\times6\div36\times2}+\frac{85\times240\times750}{51\times8\times100}$
   $+\frac{800\times289}{17\times25}$
   $=\frac{(110+64+16)^2}{100}+375+544$
   $=\frac{36100}{100}+919$
   $=919+361=1280$

(6-10) :

6. (3) Required total
   $=150\times\frac{70}{100}+120\times\frac{50}{100}+50\times\frac{56}{100}$
   $+50\times\frac{58}{100}+100\times\frac{57}{100}+200\times$
   $\frac{54.5}{100}$
   $=105+60+28+29+57+109$
   $=388$
7. (4) Required average
   $=\frac{50}{5\times100}\times(52+56+70+64+48)$
   $=\frac{1}{10}\times290$
   $=29$
8. (2) Required percentage (%)
   $=\left[\frac{50\times\frac{54}{100}}{120\times\frac{55}{100}}\times100\right]\%$
   $=\left(\frac{27}{66}\times100\right)\%$
   $=40.90\%\approx41\%$
9. (5) Required difference
   $=\left(50\times\frac{52}{100}+200\times\frac{57}{100}\right)-$
   $\left(50\times\frac{56}{100}+150\times\frac{48}{100}\right)$
   $=(26+114)-(28+72)$
   $=140-100=40$
10. (4) Total marks obtained by Poonam
   $=150\times\frac{56}{100}+120\times\frac{40}{100}+50\times$
   $\frac{48}{100}+50\times\frac{46}{100}+100\times\frac{53}{100}+$
   $200\times\frac{52.5}{100}$
   $=84+48+24+23+53+105$
   $=337$
   $\therefore$ Required % $=\left(\frac{337}{670}\times100\right)\%$
   $=50.29\%$
   $\approx50\%$

(11-15) :

11. (2) The number series is as follows:
   $3\times2+5=11$
   $11\times3-6=$ **27**
   $27\times4+7=115$
   $115\times5-8=567$
   $567\times6+9=3411$
12. (4) The number series is as follows:
   $326.34375\div1.5+1.5=219.0625$
   $219.0625\div2.5+2.5=90.125$
   $90.125\div3.5+3.5=29.25$
   $29.25\div4.5+4.5=11$
   $11\div5.5+5.5=$ **7.5**
13. (4) The number series is as follows:
   $5\times4+3=23$
   $7\times3+3=24$
   $9\times2+3=$ **21**
   $11\times1+3=14$
14. (5) The number series is as follows :
   $19+2\times2^3=35$
   $35+2\times3^3=89$
   $89+2\times4^3=217$
   $217+2\times5^3=$ **467**
   $467+2\times6^3=899$
15. (3) The number series is as follows:
   19 29 47 77 125 **200**
   +10 +18 +30 +48 +75
   +8 +12 +18 +27
   ×1.5 ×1.5 ×1.5
16. (1) Let the no. of filler pipe $=x$
   $\therefore$ No. of empty pipe $=8-x$
   ATQ, $\frac{8-x}{6}-\frac{x}{8}=\frac{1}{6}$
   $\Rightarrow \frac{4(8-x)-3x}{24}=\frac{1}{6}$
   $\Rightarrow 32-4x-3x=4$
   $\Rightarrow 7x=28$
   $\Rightarrow x=4$
17. (4) Let the speed of smaller wheel $=x$ c.m/s
   In 10 sec, it will cover $10x$ cm.
   $\therefore$ Distance covered by the smaller wheel in one revolution
   $=2\times\frac{22}{7}\times3.5=22$ cm
   $\therefore$ No. of revolutions made by smaller wheel in 10 sec
   $=\frac{10x}{22}=\frac{5x}{11}$ .... (i)
   Distance covered by bigger wheel in 10 sec $=(1980-10x)$ cm
   $\therefore$ No. of revolutions made by bigger wheel
   in 10 sec $=\frac{1980-10x}{44}$ ....(ii)
   ATQ,
   $\frac{5x}{11}=\frac{1980-10x}{44}$
   $\Rightarrow 20x+10x=1980$
   $\Rightarrow 30x=1980$
   $\Rightarrow x=\frac{1980}{30}=66$ cm/sec.
18. (3)



Clearly, radius of the circle is 20 km.
Hence, One has to cover a distance of 20 km to reach a point between Q and R.

ఉద్యోగాలు

ఒఎన్‌జిసి

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఒఎన్‌జిసి) - నెట్ 2017 ద్వారా **ఇ 1 లెవెల్ ఎగ్జిక్యూటివ్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 27
హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ ఖాళీలు: 20
అర్హత: 60 శాతం మార్కులతో ఎంబిఏ(పర్సనల్ మేనేజ్‌మెంట్/ హెచ్‌ఆర్‌డి/ హెచ్‌ఆర్‌ఎం)/ పీజీ (పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఐఆర్/ లేబర్ వెల్ఫేర్)/ రెండేళ్ల పీజీ డిప్లొమా(పిఎం/ ఐఆర్/ లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు
యుజిసి నెట్ సబ్జెక్ట్: లేబర్ వెల్ఫేర్/ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ అండ్ సోషల్ వెల్ఫేర్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (సబ్జెక్ట్ కోడ్ 55)/ మేనేజ్‌మెంట్(సబ్జెక్ట్ కోడ్ 17)
ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఖాళీలు: 5
అర్హత: 60 శాతం మార్కులతో ఎంబిఏ(ఫైనాన్స్) పూర్తిచేసి ఉండాలి
వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు
యుజిసి నెట్ సబ్జెక్ట్: మేనేజ్‌మెంట్(సబ్జెక్ట్ కోడ్ 17)
అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ ఖాళీలు: 2
అర్హత: 60 శాతం మార్కులతో పీజీ(హిందీ) పూర్తి చేసి ఉండాలి. డిగ్రీలో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ట్రాన్స్‌లేషన్ వర్క్‌లో అనుభవం ఉండాలి.
వయసు: జనవరి 1 నాటికి 40 ఏళ్లు మించరాదు
యుజిసి నెట్ సబ్జెక్ట్: హిందీ(సబ్జెక్ట్ కోడ్ 20)
ఎంపిక: యుజిసి నెట్(నవంబర్ 2017) స్కోరు, అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
అభ్యర్థులు ముందుగా యుజిసి నెట్ 2017కు దరఖాస్తు చేసుకొని రిజిస్ట్రేషన్/ రోల్ నెం వచ్చిన తరవాతనే ఒఎన్‌జిసికి అప్లయ్ చేసుకోవాలి
యుజిసి నెట్ 2017 ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
యుజిసి నెట్ 2017 : నవంబరు 5
యుజిసి నెట్ వెబ్‌సైట్ : http://cbsenet.nic.in
ఒఎన్‌జిసి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 21 నుంచి
ఒఎన్‌జిసి ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 19
ఒఎన్‌జిసి ఇంటర్వ్యూలు: 2018 జనవరిలో
వెబ్‌సైట్: www.ongcindia.com

ఎన్‌ఎఫ్‌ఎల్

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్‌ఎఫ్‌ఎల్)- **మేనేజ్ మెంట్ ట్రైనీస్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 36**
విభాగాలవారీ ఖాళీలు: హెచ్‌ఆర్ 12, మార్కెటింగ్ 24
వయసు: ఆగస్టు 31 నాటికి 29 ఏళ్లు మించరాదు
అర్హత: 60 శాతం మార్కులతో (ఎంబిఏ/ పీజీ డిగ్రీ/ డిప్లొమా) (పర్సనల్ మేనేజ్‌మెంట్ & ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్ ఆర్)/ ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)/ (ఎంబిఏ/ పీజీడిబిఎం) (మార్కెటింగ్/ అగ్రి బిజినెస్ మార్కెటింగ్ / ఇంటర్నేషనల్ మార్కెటింగ్ / రూరల్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23న
పరీక్ష కేంద్రం: హైదరాబాద్ తదితర ప్రధాన నగరాలు
దరఖాస్తు ఫీజు: రూ.735(ఎస్సీ/ ఎస్టీ/ ఎక్స్ సర్వీస్‌మెన్/ దివ్యాంగులు/ డిపార్టుమెంటల్ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 6
వెబ్‌సైట్: www.nationalfertilizers.com

అడ్మిషన్స్

ఎన్‌ఎల్‌ఎస్‌ఐయు

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌ఎస్‌ఐయు)- కింది **డిస్టెన్స్ ఎడ్యుకేషన్** కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్ (ఎంబిఎల్) ప్రోగ్రామ్, ఏడాది పీజీ డిప్లొమా (హ్యూమన్ రైట్స్ లా/ మెడికల్ లా & ఎథిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ లా/ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా/ చైల్డ్ రైట్స్ లా/ కన్స్యూమర్ లా & ప్రాక్టీస్/ సైబర్ లా& సైబర్ ఫోరెన్సిక్) **అర్హత:** డిగ్రీ పూర్తిచేసి ఉండాలి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: http://ded.nls.ac.in

24న మహా ధర్నా

ఇందుకూరుపేట: డేవిస్‌పేటలోని మూడు ఆక్వా కంపెనీలు రసాయనిక నీటిని కాలువల్లోకి వదలటంపై మండల రైతులు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు ప్రకటించారు. శనివారం చంద్రరాజగోపాల్ ఆధ్వర్యంలో రైతు నాయకులు హాజరై ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ ఆక్వా ప్రాజెక్టుల వలన మండలంలోని అరటి, వరి, కొబ్బరి, చేపలు, రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చివరకు పశువులు కూడా కాలువల్లో నీటిని తాగి మృతి చెందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులందరూ సమీకృతమై 24న డేవిస్‌పేటలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


కబ్జాకు గురైన గుంత వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

రామతీర్థంలో గుంత కబ్జా

● పట్టించుకోని పాలకులు ● ఆందోళనకు దిగిన రైతులు

విడవలూరు: రైతులకు సాగునీరు అందించే పంచాయతీ గుంత కబ్జాకు గురయింది. అక్రమార్కులు ఈ గుంతను చదును చేసి ఇతరులకు అమ్మేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన రామతీర్థం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రైతుల కథనం మేరకు.. పంచాయతీ పరిధిలోని బకింగ్‌హం కెనాల్ సమీపంలో సుమారు 4ఎకరాల పంచాయతీ గుంత ఉంది. దీనిని తిత్తేలు మడవ కాలువని పిలుస్తారు. వర్షాలు పడినప్పుడు ఎగువ నుంచి వచ్చే వర్షపునీటిని ఈ పంచాయతీ గుంతలో నిల్వ చేసుకుని మోటార్ల సాయంతో నీటిని తోడుకుని రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ గుంత కింద సుమారు 50ఎకరాలు సాగులో ఉంది. అయితే ఈ గుంతపై గ్రామానికి చెందిన రిటైర్డ్ కలాసి వెంకయ్య, చలగా వెంకయ్య కన్ను పడింది. పంచాయతీ గుంతలో సగభాగాన్ని యంత్రాల సహాయంతో చదును చేసి గుట్టు చప్పుడు కాకుండా రామచంద్రాపురానికి చెందిన ఓ వ్యక్తికి రూ.3 లక్షలకు అమ్మేశారు. ఈ విషయాన్ని అలస్యంగా తెలుసుకున్న రైతులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమణలను అడ్డుకునే ప్రయత్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు పురిణి పుల్లయ్య, రైతులు నెల్లూరు రామారావు, కాటం శీనయ్య, వావిల పోలయ్య, తంబి జయ, పి.శీనయ్య మాట్లాడుతూ సాగునీటిని అందించే పంచాయతీ గుంత కబ్జాకి గురైన పంచాయతీ పాలకులు,అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. కబ్జాదారులతో పంచాయతీ పాలకులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఈవిషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

పంచాయతీ గుంత అక్రమణకు గురైనట్లు సమాచారం లేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ గుంతలను అక్రమించుకోవటం సరికాదు. అక్రమణకు గురై ఉంటే తొలిగిస్తాం.

- మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి

ప్రభుత్వ పాఠశాలలే ఆదర్శం

● ఎమ్మెల్యే పోలంరెడ్డి

కొడవలూరు: ప్రభుత్వ పాఠశాలలే అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లు పాఠశాలలో శనివారం స్థానిక దాత వేముల రామయ్య సహకారంతో 75 బెంచీలను ఎమ్మెల్యే పోలంరెడ్డి చేతులమీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందించిన సహకారం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివినవారే అత్యున్నత స్థాయికి ఎదిగారని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే గమ్యాన్ని ఎంచుకోవాలన్నారు. కొత్తవంగల్లు ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చెంది ఉందని అన్ని కాలనీలలో సిమెంటు రోడ్లు, రైతులకు అవసరమయిన చోట కల్వర్టులు ఇలా అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బషీర్, టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాసిన ప్రసాదు,నీటి సంఘాల అధ్యక్షుడు చెక్కా మధన్, సర్పంచు చక్కా నారయ్య, తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిపాళెంలో సిమెంటురోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి

సిమెంటు రోడ్లు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని మునులపూడి పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. మునులపూడి, రెడ్డిపాళెం గ్రామాలలో సుమారు రూ. 26లక్షలతో నిర్మాణాలు పూర్తయిన సిమెంటురోడ్లు, శ్మశానవాటిక ప్రహరీ, షెల్టర్‌ను ఆయన శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో నిరుపేదలతోపాటు గీత, చేనేత కార్మిక కుటుంబాలకు 2వేల మందికి ఫించన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలందరికి సంక్షేమ పథకాలను తెలుగుదేశం పార్టీ పాలనలో అమలవుతున్నాయని అన్నారు. సమావేశం అనంతరం పలువురు సమస్యలపై ఎమ్మెల్యేకి వినతిపత్రాలు సమర్పించుకున్నారు.

ఈకార్యక్రమంలో పెన్నాడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, మునులపూడి సర్పంచు బాబు, ఎంపీడీవో సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తల హరికృష్ణ, జొన్నవాడ ఆలయ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఎంపీ శేషయ్య, స్థానిక నాయకులు పాణ్యం వెంకురెడ్డి, సోము కృష్ణారెడ్డి, ఉమ్మయ్యస్వామి, రామానాయుడు, నారసింహారెడ్డి, బొమ్మాపెంచలరెడ్డి, టి, మల్లికార్జున్, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఇందుకూరుపేట: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఉప సంచాలకురాలు మారుతిదేవి తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటనలో ఇందుకూరుపేట డివిజన్‌లోని ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట మండలాల్లోని పంచాయతీకి ఒక్కో రైతు వంతున ఎంపిక చేస్తామని వీరందరికి అక్టోబరు 8 నుంచి 12 వరకు అనంతపురంలో ప్రముఖ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేస్తామని చెప్పారు. అనంతపురంలో ఐదు రోజులు ఉండాల్సి ఉందన్నారు. ఇందులో 50 శాతం మహిళా రైతులకు కూడా అవకాశం ఉందని వివరాలకు 9949081434, 8309021588లను సంప్రదించి మరిన్ని వివరాలు పొందవచ్చునని తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెంరూరల్ : మండలంలోని రేబాల గ్రామంలో 20రోజులుగా తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు వరిలో సుడిదోమను పరిశీలించి నివారణపై చర్యలు చేపడుతున్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకం కింద గ్రామంలోని రైతు సోదరులకు సుడిదోమ నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈకార్యక్రమంలో తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆర్.స్వాతి, బి.శిల్ప, ఎన్.సౌందర్య, కె. రోహిత, పి.యమున, ఎమ్.వౌనిక, సి.సువర్ణతోపాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


భాస్కర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొడవలూరు: రామన్నపాళెం పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న తెలుగు ఉపాధ్యాయుడు జంగిడి భాస్కర్‌కు సన్మానం జరిగింది. రామన్నపాళెం మాజీ సర్పంచు డేగా దయాకర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు డేగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు పండితులైన భాస్కర్ విద్యార్థులతో మమేకమై విద్యను అందించే వారని, పేద విద్యార్థులను ప్రోత్సహించి వారికి ఆర్థికంగా తోడ్పడేవారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సంపూర్ణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు తెలుసుకోవాలి

కోవూరు: విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతల్ని కూడా తెలుసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి రాధారాణి అన్నారు. జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన న్యాయవిజ్ఞానసదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిందిగా కోరారు. ఈర్ష్య, ద్వేషాలకు అతీతంగా మెలగాల్సిందన్నారు. ఈ కార్యక్రమంలో మేజిస్ట్రేట్ పెదఖాసీమ్, ఎస్సై వెంకట్రావు, ప్రధానోపాధ్యాయుడు నరసింహామూర్తి మాట్లాడారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాధారాణి

వ్యవసాయాధికారిణికి అభినందన

కోవూరు: రైతులకు సేవలందించడంలో మార్గదర్శకంగా వ్యవహరించిన వ్యవసాయాధికారిణి అనితను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు , రైతులు, వ్యవసాయాధికారులు అభినందించారు. పదోన్నతిపై నెల్లూరు నగరానికి సంయుక్త సంచాలకులుగా బదిలీ అయిన ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గిద్దలూరు ఉమ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసినందువల్లే రైతులు ఆమెను సన్మానిస్తున్నారని చెప్పారు. సన్మాన కార్యక్రమంలో జడ్పీటీసీ చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సర్పంచి కూట్ల ఉమ, తహసీల్దారు రామలింగేశ్వరరావు, ఎంపీడీఓ జాలిరెడ్డి, వ్యవసాయ సంయుక్త సంచాలకులు కుప్పయ్య, ఏపీఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో పంటర్ల అరెస్టు

కోవూరు: కోవూరు సర్కిల్ పరిధిలో మరో 12 మంది క్రికెట్ పంటర్లను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కోవూరు మండలానికి చెందిన కలికి రామిరెడ్డి(కొత్తూరు), గుంజి వెంకటరాజు(బండారుమాన్యం), దువ్వూరు శివ(కోవూరు), కడూరి మహేష్ (చిన్న పడుగుపాడు), బాబర్(స్టౌ బీడీ కాలనీ), ఎంద్రపాటి మురళీ మోహన్(కోవూరు), అలీమ్(పోతిరెడ్డిపాళెం), అర్షద్(కోవూరు), విడవలూరుకు చెందిన కాటా సురేష్, అల్లూరు మండలానికి చెందిన కొండూరు వాసు, కొండూరు శివ(ఇస్కపల్లె పట్టపుపాలెం) కొడవలూరు మండల పరిధిలోని రేగడిచెలిక గ్రామానికి చెందిన కటారి హజరత్తయ్యల్ని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుల్ని మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు.

మూడు ఆటోలపై కేసుల నమోదు

ఇందుకూరుపేట: మండలంలో డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా అధిక లోడుతో ప్రయాణించే ఆటోలపై చర్యలు తప్పవని ఎస్సై బలరామిరెడ్డి హెచ్చరించారు. శనివారం యాగర్ల సెంటర్ వద్ద అనుమతులు లేకుండా వేగంగానూ, అధిక లోడుతో వెళుతున్న మూడు ఆటోలపై కేసులు నమోదు చేశారు. మూడు వాహనాలను కూడా కోర్టులో పెడుతామన్నారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన సదస్సు


విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం ప్రాథమిక పాఠశాలలో విపత్తులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ ఇంటిగ్రేటి, రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం తీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కృషి చేసే భాగంలో విద్యార్థులకుఅవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విపత్తులపై అవగాహన స్వాగతించాల్సి ఉందని, దీని వలన మంచి అవగాహన, సమయస్ఫూర్తి, ధీరోదాత్తమైన లక్షణాలు అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ నిర్వాహకుడు హసన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఆదివారం, 20 ఆగస్టు 2017
ఉదయగిరి 13
ఉదయగిరి । సీతారామపురం । వరికుంటపాడు । దుత్తలూరు । వింజమూరు

గౌడ విద్యార్థులకు పురస్కారాలు

వరికుంటపాడు: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గౌడ కార్మికుల పిల్లలకు ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్‌లో అభినందన సభతోపాటు పురస్కారాలు అందజేయనున్నట్లు గౌడ సంఘం జిల్లా నాయకుడు చలం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతిలో 8.5 నుంచి 10 పాయింట్లు సాధించిన వారికి గౌడ సేవాసమితి ట్రస్టు ద్వారా రూ.5 వేల నగదు, జ్ఞాపిక, నోట్ పుస్తకాలు అందచేస్తారన్నారు. జిల్లాలోని గౌడ విద్యార్థులు ఈ సభకు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ, కలెక్టర్ ముత్యాలరాజు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.

నిమజ్జనానికి నీళ్లు కరువు!

● చవితి వేడుకలకు సన్నాహాలు

ఉదయగిరి రూరల్: వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయగిరి, కలిగిరి, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం మండల కేంద్రాల్లో విగ్రహాలను కళాకారులు తయారు చేశారు. వీటి కొనుగోలుకు నిర్వాహకులు అడ్వాన్సులు చెల్లించారు. స్టేజీలు, విద్యుత్ దీపాలంకరణతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు పోటీ పడుతున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో సుమారు 600 వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

నిమజ్జనానికి నీరు లేదే..

ఐదేళ్లుగా నియోజకవర్గంలో తగిన వర్షపాతం నమోదు కాకపోవడంతో ఈ ప్రాంతంలో చెరువులు, వాగులు, వంకలు, కుంటలు, వ్యవసాయ బావులు పూర్తిగా అడుగంటాయి. దీంతో వినాయక విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయాలన్న అంశంలో నిర్వాహకులు అయోమయంలో పడ్డారు. మండల పరిధిలోని గండిపాళెం జలాశయంలో సైతం నీరు లేకపోవడంతో గణనాధునికి అగచాట్లు తప్పడంలేదు. దీంతో, భారీగా వర్షాలు కురిపించి నిమజ్జనం సజావుగా సాగేలా చూడాలని గణపయ్యను వేడుకుంటున్నారు.

జలాశయాలే దిక్కు

స్థానిక జలవనరులన్నీ ఎండిపోవడంతో విగ్రహాలను కావలి సముద్రతీరంలోగానీ, జలదంకి, బుచ్చి, సంగం ప్రాంతాల్లోని జలాశయాల్లో గానీ నిమజ్జనం చేయాలని నిర్వాహకులు భావిస్తున్నారు. అప్పటిలోగా



చుక్క నీరు లేని వెంకట్రావుపల్లి చెరువు

వరుణుడు కరుణిస్తే తమ బాధలు తీరుతాయంటున్నారు

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వినాయక చవితి సందర్భంగా ఉదయగిరి సర్కిల్ పరిధిలోని మండలాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన శనివారం విలేఖరులతో మాట్లాడుతూ విగ్రహం ఎత్తు, నిమజ్జనం చేసే ప్రాంతం, ఏ వాహనంలో నిమజ్జనానికి తరలిస్తున్నారు, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను తదితర వివరాలను ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగానే తెలియచేయాలన్నారు. విద్యుత్ దీపాలంకరణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యుల ఆధార్, అడ్రస్ వివరాలు తెలియచేయాలన్నారు. రాత్రి వేళల్లో ఎవరి విగ్రహాల వద్ద వారే కాపలా ఉండాలన్నారు. వివాదాలు చోటుచేసుకొంటే కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

మొండి బకాయిలు వసూలు చేయండి

ఉదయగిరి: సొసైటీల్లో పేరుకుపోయిన మొండి బకాయిలను వెంటనే వసూలు చేయాలని జిల్లా సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ అంజిరెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎస్ డీసీసీ బ్యాంకులో వరికుంటపాడు, కమ్మవారిపాళెం, బూదవాడ, నందిపాడు, సీతారామపురం, కొట్టాలపల్లి సొసైటీల సెక్రెటరీలు, సిబ్బందితో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. బకాయిలు వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్యాంకు మేనేజర్ మజహ, సొసైటీ అధ్యక్షులు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి, సీతవోలు పోలయ్య, రత్నయ్య పాల్గొన్నారు.

18 మంది ఉపాధ్యాయుల బదిలీ

ఉదయగిరి: ఉదయగిరి మండల వ్యాప్తంగా 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినట్లు ఎంఈవో పి.మోహన్‌రావు శనివారం తెలిపారు. ఈ స్థానాలను ఇతర మండలాల నుంచి బదిలీపై వచ్చే ఉపాధ్యాయులతో భర్తీ చేస్తామన్నారు. బదిలీ ప్రక్రియతో విద్యాబోధనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని వివరించారు.

● ఇంటర్వ్యూ



బెల్టుషాపుల కట్టడి

నరసింహారావు, ఎక్సైజ్ సీఐ

?. బెల్టుషాపుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు

!. ఉదయగిరి ఎక్సైజ్ శాఖ పరిధిలో మద్యం బెల్టుషాపుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం.

?. సర్కిల్ పరిధిలో ఎన్ని దుకాణాలకు అనుమతించారు

!. ఉదయగిరి 4, సీతారామపురం 2, దుత్తలూరు 2, వరికుంటపాడు 2, మర్రిపాడు 6 అనుమతి పొందిన మద్యం షాపులున్నాయి.

?. కమిటీల ప్రక్రియ పూర్తయ్యిందా.

!. బెల్టుషాపులు నిరోధించేందుకు గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేశాం. ఈ కమిటీల ద్వారా సమాచారాన్ని తెలుసుకుని, దాడులు నిర్వహించి కేసులు బనాయిస్తాం.

?. ఒక వ్యక్తి ఒకేసారి ఎంత మద్యం కొనుగోలు చేయవచ్చు.

!. ఒక వ్యక్తికి ఆరు కంటే ఎక్కువ మద్యం బాటిళ్లు ఇవ్వరాదు. అలా విక్రయించిన దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటాం.

– ఉదయగిరి

నేడు ఎన్ఐవోఎస్ పరీక్షలు

ఉదయగిరి: మండలంలో ఆదివారం ఎన్ఐవోఎస్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సాక్షరభారత్ కోఆర్డినేటర్ షేక్ గాజుల తాహెర్ శనివారం తెలిపారు. మండలంలో 17 సాక్షరభారత్ కేంద్రాల్లో 242 మంది పరీక్షకు హాజరవుతున్నారని చెప్పారు. గతంలో ఫెయిలైనవారు, సీ గ్రేడ్ పొందిన వారు మాత్రమే ఈ పరీక్షలకు అర్హులని, గ్రామ కోఆర్డినేటర్లు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు.

వరికుంటపాడు: మండలంలోని సాక్షరభారత్ కేంద్రాల్లో ఆదివారం అభ్యాసకులకు అక్షరాస్యత పరీక్ష నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ డీవీ రమణయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన 14వ విడత ఎన్ఐవోఎస్ పరీక్షకు హాజరు కాని వారు, సీ గ్రేడ్ వచ్చిన అభ్యాసకులు ఈ పరీక్ష రాయవచ్చన్నారు.

పింఛన్ పంపిణీ ట్యాబ్‌ల పరిశీలన

ఉదయగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పింఛన్ల పంపిణీ చేసే ట్యాబ్‌లను జిల్లా కోఆర్డినేటర్ వినోద్ పరిశీలించారు. ఇటీవల ఈ ట్యాబుల్లో ఏపీడీజీ 41 వర్షన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. ఈ యాప్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సోమయాజులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు

వరికుంటపాడు: మండల పరిధిలోని జీ.కొండారెడ్డిపల్లిలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ శనివారం జీవవైవిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఔషధ మొక్కల గురించి తెలియచేశారు. సేంద్రియ వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మిత రమణారెడ్డి, బయోడైవర్సిటీ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, హెచ్ఎం హర్షనారాయణ, హరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ఉదయగిరి: కుటుంబ కలహాలు తీర్చేందుకు వెళ్లిన మహిళపై బంధువు దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికంగా నివసించే వెంకటలక్ష్మమ్మ తన కూతురును బీసీ కాలనీకి చెందిన ప్రసాద్‌కు ఇచ్చి వివాహం చేసింది. ఈ మధ్య కాలంలో ఆ దంపతుల మధ్య కలహాలు రావడంతో, విచారించేందుకు అల్లుని ఇంటికి వెళ్లింది. అక్కడ అల్లుని సోదరి సుభానీ ఇటుక రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, ప్రథమ చికిత్స అనంతరం ఆమెను నెల్లూరుకు తరలించారు.

ఉపాధి హామీ పనుల్లో యంత్రాల వినియోగం

● బహిరంగ ప్రజావేదికలో అధికారుల వెల్లడి

సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ బృందం బహిరంగ ప్రజా వేదిక నిర్వహించింది. మండలంలో రూ.16.67 కోట్లతో చేసిన ఉపాధి హామీ పనుల్లో, ప్రతి పంచాయతీలో యంత్రాలు వాడినట్లు తనిఖీ బృందం గుర్తించింది. పంట సంజీవని కుంటల పనుల్లో యంత్రాలను వినియోగించడంతోపాటు, తామే పనులు చేశామని గ్రామసభలో కూలీలతో చెప్పించినట్లు గుర్తించారు. నాబార్డు ద్వారా నిర్వహించిన పంటకుంటలను ఉపాధి పథకం కింద చూపారని, మస్టర్లలో వేలిముద్రలు, సంతకాలు తేడా ఉన్నట్లు గుర్తించినట్లు తనిఖీ బృందం స్పష్టం చేసింది. ఇప్పటివరకు అయ్యవారిపల్లి, దేవమ్మచెరువు, సీతారామపురం, దేవిశెట్టిపల్లి, బసినేనిపల్లి పంచాయతీల్లో జరిగిన వివరాలు వెల్లడించారు. పూర్తి వివరాలు ఆదివారం



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్పీ నారాయణరావు

వెలువడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నాజర్‌రెడ్డి, విజిలెన్స్ డీఈ శ్రీనివాసులురెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయకుమార్, ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వింజమూరు: సాతానువారిపాళెంలో శనివారం అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం ప్రభాతసేవ, ప్రబంధ పారాయణం, అభిషేకం, యంత్ర రత్న స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, విశ్వరూప దర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

వింజమూరు: మండల పరిధిలోని చాకలకొండ, బత్తినవారిపల్లి, పోలినాయుడుపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఐసీడీఎస్ సీడీపీవో కె.విజయలక్ష్మి తనిఖీ చేశారు. కేంద్రాల్లోని చిన్నారుల హాజరు పట్టికను పరిశీలించి హాజరు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: వడ్లమూడిపల్లి, దాసరిపల్లి ఎర్రబల్లిగుంట అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సీడీపీవో ఈశ్వర్‌రాణి తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని పరిశీలించి గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలుఅందచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

సంచార విజ్ఞాన ప్రదర్శన



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

దుత్తలూరు: స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సంచార విజ్ఞాన ప్రదర్శనలో జ్ఞానేంద్రియాల పనితీరు, వర్ణాంధత్వం, దూరదృష్టి, ధ్వని దిశను కనుగొనుట, చెవి పనితీరు తదితరాంశాలను విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ అంశాలపై మహేష్, భానుప్రకాష్, ధనుంజయ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న బోర్లను గుర్తించండి

ఉదయగిరి: మండలంలో నిరుపయోగంగా వున్న మూత లేని బోరు బావులను గుర్తించాలని ఎంపీడీవో వీరాస్వామి, తహసీల్దారు టి.వెంకటసునీల్ శనివారం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు విచారించి బోరు బావులను గుర్తించి, వాటి పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 1, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. షాపింగ్‌కు అనుకూలం. వేడుకల్లో పాల్గొంటారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. పొదుపు పథకాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. తల్లి, మాతృవర్గీయులకు సంబంధించిన వ్యవహారాలు ఆవేదన కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.

మిథునరాశి: (మే21-జూన్21): చర్చలు, ప్రయాణాల్లో నిదానం అవసరం. సోదరీసోదరుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సన్నిహితుల నుంచి ముఖ్యమైన మెయిల్స్, ఫోన్ సందేశాలు అందుకుంటారు. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. షాపింగ్‌లో ఖర్చులు అధికం. విలువైన వస్తువుల కొనుగోలు విషయంలో నాణ్యత గమనించాలి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కొత్త పనుల ప్రారంభానికి అనుకూల సమయం కాదు. వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించిన ఆలోచనలు కొలిక్కి వస్తాయి. సంకల్ప సాధనకు అధికంగా శ్రమించాల్సి ఉంటుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వినోదం, ఫొటోగ్రఫీ, రచనా రంగాల వారికి అనుకూలం. సినీ, రాజకీయ, న్యాయ, బోధన రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సహకార సంఘాలు, యూనియన్ కార్యకలాపాలకు అనుకూలం. బృందకార్యక్రమాల్లో అసౌకర్యం కలిగే అవకాశం వుంది. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాల్లో లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. పెద్దలు, ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ, మన్ననలు అందుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): న్యాయ, బోధన, రక్షణ, రవాణా రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుంటారు. డ్రైవింగ్, చర్చల్లో నిదానం పాటించండి. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆర్థిక విషయాల్లో కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. సంస్మరణల్లో పాల్గొంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. వాయిదా పద్ధతులపై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో నిదానం పాటించండి. శ్రీవారు, శ్రీమతి వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. వేడుకల్లో పాల్గొంటారు. బృందకార్యాక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆస్పత్రులు, హోటల్, క్యాటరింగ్ రంగాల వారికి కొంత నిరుత్సాహకరంగా వుంటుంది. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. సహోద్యోగుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆ అన్నం తినలేం..

- ఉడికీ ఉడకని భోజనం, నీళ్ల కూరలు
- మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల నిరసన
- రోజురోజుకూ ఆందోళన తీవ్రతరం
- గుడ్ల పంపిణీలోనూ అవకతవకలు
- హాజరులో మాయాజాలం
- పెద్ద ఎత్తున అక్రమాలు


భోజనం బాగా లేదని నిరసన తెలుపుతున్న విద్యార్థులు(ఫైల్)

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యత రోజురోజుకూ తీసికట్టుగా మారుతున్నది.దీంతో విద్యార్థులు తినలేని పరిస్థితి నెలకొంది. పలుచోట్ల అన్నం ఉడికీ ఉడకకుండానో.. ఎక్కువగా ఉడికి ముద్దగా మారిపోతుండడమో జరుగుతోంది. కూరల కు, నీళ్లకు తేడా లేకుండా పోతున్నది. దీంతో విద్యార్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనలు రోజురోజుకు ఎక్కువవుతున్నారు. గుడ్ల పంపిణీలో అవకతవలు చోటు చేసుకుంటున్నాయి. హాజరులో మాయాజాలం చూపి, పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

● విద్యార్థుల ఆందోళన

నెల్లూరుతో పాటు నాలుగు మండలాల్లో స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజనం పెట్టే కాంట్రాక్ట్‌ను ప్రభుత్వం అప్పగించిం ది. ఇక్కడ కూడా విద్యార్థులకు భోజన కష్టాలు తప్పడం లేదు. నాణ్యతలేని భోజనం సరఫరా చేయడం, అందులోనూ చాలీచాలని అన్నం పెడుతుండడంతో విద్యార్థులకు అర్ధాకలి తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో కొన్ని చోట్ల విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు.

● స్వచ్ఛంద సంస్థలకు అప్పగించినా..

జిల్లాలో 3,468 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,20,136 మంది చదు వుకుంటున్నారు. వీరందరికీ మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. గతేడాది వరకూ స్వయం సహాయక గ్రూపులకు చెందిన వారే భోజనం వండి పెట్టేవారు. ఈ సంవత్సరం కొన్ని ప్రాంతాలను స్వచ్ఛంద సేవా సంస్థలకు అప్పగించారు. నెల్లూరులో ఇస్కాన్ సంస్థ భోజనం పెడుతోంది. ఇక ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, గూడూరు మండలాల్లో అక్షయపాత్ర సంస్థ బాధ్యతలను నిర్వహిస్తోంది. మిగిలిన 42 మండలాల్లో స్వయం సహాయక గ్రూపులకు చెందిన మహిళలే పాత పద్ధతిలో భోజనం వండి పెడుతున్నారు.


అక్షయ పాత్ర సంస్థ వాహనం ముందు ఆందోళన చేస్తున్న మనుబోలు హైస్కూల్ విద్యార్థులు(ఫైల్)

● తినలేకపోతున్న విద్యార్థులు

అయితే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడంతో నాణ్యమైన భోజనం లభించడం లేదు. గత నెల 15న మధ్యాహ్నం 12 గంటలకు రావాల్సిన భోజనం 3 గంటలకు రావడంతో విద్యార్థులకు ఆకలి కేకలు తప్పలేదు. అంతేకాక అక్షయపాత్ర సంస్థ సరఫరా చేసే భోజనం తినలేకపోతున్నామని పలు చోట్ల విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. గత గురువారం మనుబోలు బాలుర ఉన్నత పాఠశాలలో భోజనం బాగోలేదని విద్యార్థులు ఆందోళనకు దిగారు. తెచ్చిన భోజనం కూడా సరిపోకపోవడంతో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బిస్కెట్ ప్యాకెట్లను కొనుగోలు చేసి పిల్లలకు పంచారు.

● హాజరు మాయాజాలం

స్వయం సహాయక మహిళలు వంటలు చేసే చోట్ల విద్యార్థుల హాజరు సంఖ్యను బట్టి ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది. ఇక్కడ తక్కువ మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చినా ఎక్కువ మంది వచ్చినట్లుగా హాజరు వేస్తున్నారన్న విమర్శలున్నాయి. హాజరు ఎక్కువగా ఉంటే వారి పర్ఫామెన్స్ బాగున్నట్లుగా పేర్కొంటారు. బదిలీ సమయంలో ఇది కూడా ఉపయోగపడుతుంది. అలానే విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా రాయడం ద్వారా మధ్యాహ్న భోజన నిధులు ఎక్కువగా అందుతాయి.

● గుడ్ల పంపిణీలోనూ..

కోడిగుడ్ల పంపిణీలో కూడా అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో భోజనం వండే వారికే ప్రభుత్వం గుడ్లు సరఫరా చేసేది. భోజనంతో పాటే వారు విద్యార్థులకు గుడ్డు ఇచ్చే వారు. అయితే ఇప్పుడు టెండర్ల ద్వారా గుడ్లు సరఫరా చేస్తున్నారు. భోజనం వండే వారికి కాకుండా హెచ్‌ఎం లకు అందజేస్తున్నారు. హెచ్‌ఎంలు ఆ గుడ్లను విద్యార్థులకు చేరేలా చూడాలి. అయితే ఇక్కడ కూడా హాజరును ఎక్కువగా చూపడం ద్వారా అవకతవకలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరి ఇప్పటికైనా అధికారులు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

డాక్టర్ శ్రీనివాసరాజుకు అమెరికన్ ఫెలోషిప్



నెల్లూరు (వైద్యం) : నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణుడు సీఎస్ శ్రీనివాసరాజును అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ ఫెలోషిప్‌నకు ఎంపిక చేశారు. అమెరికాలోని ఓర్లాండ్ ఎఫ్‌ఎల్ పట్టణంలో వచ్చే ఏడాది మార్చి 12వ తేదీన ఈ ఫెలోషిప్‌ను ప్రదానం చేస్తారు. ఫెలో ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ 67వ వార్షిక సైంటిఫిక్ సదస్సులో దీనిని అందజేస్తారు. 18 సంవత్సరాలుగా కిమ్స్ ఆసుపత్రిలో చీఫ్ ఇన్టర్వెన్షనల్ కార్డియాలజిస్టుగా, కార్డియాలజీ విభాగాధిపతిగా డాక్టర్ శ్రీనివాసరాజు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆయనను అమెరికన్ ఫెలోషిప్‌నకు ఎంపిక చేయడంపై ఆసుపత్రి వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుండె వైద్య చికిత్సల్లో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను, ఈ అవార్డును అందిస్తున్నట్లు అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ ప్రకటించింది. కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు తది తరులు డాక్టర్ శ్రీనివాసరాజుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

రేపటి నుంచి బీఎస్ఎన్ఎల్ మెగా మేళా

నెల్లూరు (వేదాయపాళెం) : బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న అన్ని పట్టణాలు, మండల కేంద్రాలలోని ప్రధాన కూడళ్లలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు మెగా మేళా నిర్వహించనున ్నట్లు సంస్థ పీజీఎం ఎం రవిబాబు ఓ ప్రకనటలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్ సిమ్‌లు ఉచితంగా అందజేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోవూరు విద్యార్థులకు జాతీయస్థాయి పతకాలు

కోవూరు: పట్టణంలోని పెన్నార్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పతకాలు సాధించారు. పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ నగరంలో శనివారం జరిగిన జాతీయ పెంకాక్ సిలాట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వెండి పతకాల్ని సాధించారు. పాఠశాలకు చెందిన ఛాత్రిక్ రెడ్డి, శ్రీమంత్ పతకాల్ని సాధించారని కరస్పాండెంట్ మాఘం రాము తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థుల్ని పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు అభినందనల సందేశాన్ని పంపారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,787
సవర (8 గ్రాములు)	-	22,296
వెండి కిలో ధర	-	42,200
వెండి గ్రాము ధర	-	42.20

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	84
లేయర్	82
స్కిన్ చికెన్	139
స్కిన్‌లెస్ చికెన్	163
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	94
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	154
స్కిన్‌లెస్	180
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,500 నుంచి రూ. 3,200 వరకు

పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,000 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	6.283 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	------------
అవుట్‌ఫ్లో :	350 క్యూసెక్కులు
ఆవిరి :	32 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం :	-------------
కనిగిరికాలువ :	-------------
ఎడమ కాలువ :	-------------
కనుపూరు కాలువ:	-------------
బీపీఆర్ కాలువ :	------------
నెల్లూరుచెరువుకాలువ :	-----------



సూక్తి

మనిషి
ఔన్నత్యానికి
కొలబద్ద మేధస్సు
కాదు హృదయం

- మదర్ థెరిసా

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియంన ▸ ....
2. రకొత ▸ ....
3. రంశిబి ▸ ....
4. కివాలి ▸ ....

టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Two tiny tigers take two taxis to town.

ఔనా!

ఆస్ట్రేలియాలో 10 వేల బీచ్‌లు ఉన్నాయి. రోజుకో బీచ్‌ను సందర్శించినా 27 ఏళ్లు పడుతుంది.





ఎవరైనా పిల్లలు బాగా హుషారుగా ఉంటే అబ్బో ఈ అబ్బాయికి తెలివి అంతా ఇంతా కాదు అని అంటుంటారు. మరి నిజంగా తెలివిని పరీక్షలించాలంటే? ఓ వ్యక్తిని మేధావిగా గుర్తించాలంటే? అవి తెలుసుకోవడానికే ఓ పరీక్ష ఉంది.. అదే - 'ఐక్యూ(Intelligence Quotient) టెస్ట్. మహామహులే ఆ పరీక్షలో నెగ్గాలంటే తలలు పట్టుకుంటారు. అలాంటిది తెలివితేటల్లో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌ల స్థాయిని దాటేశాడు ఓ తెలుగు కుర్రాడు. అతడే బండి యశ్వంత్.

ఐక్యూ 162.. భాషలు 5

బ్రిటన్‌లో ఉన్న 'మెన్సా' క్లబ్ ఐక్యూను పరీక్షించడంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. ప్రపంచం లోనే అతి పురాతమైన ఐక్యూ క్లబ్ ఇదే కావడం విశేషం. 1964లో రోలాండ్ బెరిల్, డాక్టర్ లాన్స్‌వేర్ కలిసి దీన్ని ప్రారంభించారు.



తెలివితేటలకు తూకం వేయాలంటే.. 'ఐక్యూ'(ఇంటెలిజెన్స్ కోషంట్) పరీక్షలో సత్తా చాటాల్సిందే. అందులో నెగ్గితే.. ప్రపంచ మేధావుల జాబితాలో ఒకరిగా పేరు పొందొచ్చు. బ్రిటన్‌లో ఈమధ్యే జరిగిన ఐక్యూ టెస్ట్‌లో మన తెలుగు అబ్బాయి మెరిశాడు. పన్నెండేళ్ల 'బండి యశ్వంత్' 162 మార్కులు గానూ, 162 సాధించి(ఐక్యూ పరీక్షలో అత్యధిక మార్కులు) ఔరా అనిపించాడు. వృత్తిరీత్యా యశ్వంత్ కుటుంబం లండన్‌లోని 'రీడింగ్'లో నివాసముంటుంది. యశ్వంత్ తండ్రి కృష్ణమోహన్, తల్లి మాధవి లత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా చేస్తున్నారు. కృష్ణమోహన్ స్వస్థలం తెనాలి(గుంటూర్)లోని కొలకలూరు కావడం విశేషం.



'నేను ఈ విజయాన్ని నమ్మలేకపోతున్నాను. ఎంతో ఆనందంగా ఉంది. నాకు పజిళ్లు పూర్తి చేయడమంటే భలే సరదా. రూబిక్ క్యూబ్ సాల్వ్ చేసేదాకా పట్టు వదలను. త్వరలోనే ముంబైలో జరిగే 'ప్రపంచ రూబిక్ క్యూబ్ టోర్నమెంట్'లో పాల్గొనబోతున్నాను. నాకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులంటే చాలా ఇష్టం. భవిష్యత్తులో మంచి వ్యాపారవేత్తను కావాలని అనుకుంటున్నాను. కాల్పనిక కథలు చదువుతుంటాను. కొత్త టెక్నాలజీ గురించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటాను. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాను. క్రికెట్ నా ఫేవరేట్ గేమ్. జర్మనీ, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో కూడా మాట్లాడగలను. ప్రస్తుతం లాటిన్, రష్యన్ భాషలను నేర్చుకుంటున్నాను. 'ఆస్ట్రానమీ క్లబ్'లో నేను ఓ మెంబర్‌ని కూడా. నాకు ఇష్టమైన పనిని, మనసు పెట్టి చేస్తాను'.

- యశ్వంత్

ఐక్యూ టెస్ట్ పరీక్ష ఎలా ఉంటుందంటే..

- ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ఒకటి 'కెటెల్ 3బీ పేపర్'. రెండోది 'కల్చర్ ఫెయిర్ స్కేల్'. ఈ రెండూ కలిపి రెండున్నర గంటల పరీక్ష ఇది. మొదటి పేపర్లో 42 ప్రశ్నలుంటే, రెండో దాంట్లో 250 ప్రశ్నలు ఉంటాయి.
- ఇందులో కష్టమైన ఇంగ్లీష్ పదాలకు అర్థాలు, వ్యతిరేక పదాలతో పాటు, బంధుత్వ ప్రశ్నలు, చిక్కులెక్కలు, మెదడు స్థాయిని పరీక్షించే తార్కిక ప్రశ్నలుంటాయి.

నవ్వుల్ నవ్వుల్

ఇద్దరు మేధావుల మాటలు..



మిస్టర్ మేధావి లింగం : ఒరేయ్! నువ్వు గేదె మీద వెళ్తున్నావు కదా. నిన్ను పోలీసులు పట్టుకుంటారు.

మిస్టర్ మేధావి గంగ : ఎందుకురా?

మిస్టర్ మేధావి లింగం : నువ్వు హెల్మెట్ పెట్టుకోలేదు కదా!

మిస్టర్ మేధావి గంగ : ఒరేయ్ ఇది ఫోర్ వీలర్. అందుకే బెల్టు పెట్టుకున్నా చూడు.

మిస్టర్ మేధావి లింగం : !!!!!!!!

చెప్పగలరా?

ఉరిలో ఉన్నా
కానీ గురిలో లేను

మేడలో ఉన్నా
కానీ మేనులో లేను

రాతలో ఉన్నా
కానీ రాయిలో లేను

అయితే ఇంతకీ
నేనెవర్నో
చెప్పగలరా?



జవాబులు

చెప్పగలరా? : ఉడత

జంతర్‌మంతర్ : 1. వినయం 2. కొరత 3. శిబిరం 4. వాకిలి

జంబ్లింగ్ వర్డ్స్ : 1.COLD 2.SOFT 3.RIDE 4.LIKE

జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. LCOD ▸ ....
2. STOF ▸ ....
3. DERI ▸ ....
4. KELI ▸ ....


రంగులు వేయండి



దారి కనుక్కోండి



బొమ్మ గీయండి




ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఆ కామాంధుడు మాకొద్దు

- ప్రాక్టికల్స్ సమయంలో వెకిలిచేష్టలు
- ఇక్కడ నుంచి పంపిస్తే మళ్లీ వచ్చాడు..
- డీకేడబ్ల్యూ కళాశాల ఎదుట విద్యార్థినుల ఆందోళన
- ప్రిన్సిపాల్ హామీతో విరమణ

నెల్లూరు (క్యాంపస్) : 'ఆయన గురువు కాదు.. కామాంధుడు. ప్రాక్టికల్స్ నేర్పించే సమయంలో మాతో అసభ్యంగా ప్రవర్తిస్తాడు. పరికరాలలో కొలతలు చూపుతూ మమ్మల్ని ఎక్కడ పడితే అక్కడ పట్టుకుంటాడు... ఈ విషయమై మేము ఫిర్యాదు చేసి, కళాశాల నుంచి పంపితే మళ్లీ సంవత్సరం తిరగకముందే ఇక్కడికి వచ్చాడు. మరి ఇలాంటి అధ్యాపకుడు వద్ద మేము చదువు నేర్చుకోలేం. కావాలంటే ఆయన తరగతిని బహిష్కరిస్తాం' అంటూ డీకేడబ్ల్యూ కళాశాల ఎదుట డిగ్రీ విద్యార్థినులు శనివారం ఆందోళన చేపట్టారు.

● ఏడాది క్రితం డిప్యుటేషన్‌పై..

డీకేడబ్ల్యూ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా కే ప్రభాకర్ విధులు నిర్వహిస్తున్నాడు. ప్రాక్టికల్స్ పీరియడ్‌లో ఎక్కడపడితే అక్కడ తాకుతున్నాడని, దీనిపై ఫిర్యాదు చేస్తామని చెబితే ప్రాక్టికల్స్ మార్కులు తగ్గిస్తానని బెదిరిస్తున్నాడని విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఈ విషయాన్ని ఉన్నత విద్యా బోర్డుకు తీసుకెళ్లగా ప్రభాకర్‌ను డిప్యుటేషన్‌పై గూడూరు ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. అక్కడ చేరిన ఆరు నెలలకే ఇలాంటి ఆరోపణలే రావడంతో అక్కడి నుంచి ప్రకాశం జిల్లా కంభంకు పంపారు. అయితే ప్రభాకర్ అక్కడ డిప్యుటేషన్‌ను రద్దు చేయించుకుని మళ్లీ డీకేడబ్ల్యూ కళాశాలకు పోస్టింగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. దీంతో శనివారం ఆయన విధుల్లో చేరేందుకు కళాశాలకు వచ్చారు.

● విద్యార్థినుల నిరసన

ప్రభాకర్ విధుల్లో చేరేందుకు శనివారం ఉదయం కళాశాలకు రాగానే డిగ్రీ విద్యార్థునులు తరగతులు బహిష్కరించి కళాశాల బయట నిరసనకు దిగారు. ప్రభాకర్‌ను విధుల నుంచి తొలగించాలని, తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసనలు చేపట్టారు. కొద్దిసేపటికి ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు విద్యార్థినుల వద్దకు చేరుకుని నిరసనకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఈనెల 10వ తేదీ డీకేడబ్ల్యూ కళాశాలలో అధ్యాపకుడిగా చేరేందుకు ఆర్డర్లు వచ్చాయని, అప్పటి నుంచే ఆయన నాపై గతంలో ఫిర్యాదు చేసిన వారిని వదలనంటూ బయట ప్రచారం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమతో అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పినప్పటికీ మళ్లీ అతన్నే మా కళాశాలకు పంపడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

● ప్రిన్సిపాల్ హామీ

ఈ క్రమంలో విద్యార్థినుల వద్దకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మస్తానయ్య వచ్చి చర్చించారు. వారి సమస్య విని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, కొద్దిరోజుల్లోనే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

● అలాంటిదేమీ లేదు : ప్రభాకర్

ప్రభాకర్‌ను దీనిపై ప్రశ్నిస్తే అలాంటిదేమీ లేదని, కొందరు అధ్యాపకులు కావాలనే విద్యార్థినులను రెచ్చగొట్టి గొడవ చేయిస్తున్నారని, తనకు పూర్తిగా ఆరోగ్యం బాగాలేదని ఆయన సమాధానమిచ్చారు.



జనార్దన్‌రావు దంపతులకు సన్మానం చేస్తున్న అతిథులు

తెలుగుజాతికి వారసత్వ సంపద పద్యం

● మొల్ల కవితాపీఠాధిపతి విద్వాన్ హనుమంతరావు

సూళ్లూరుపేట : తెలుగుజాతి వారసత్వ సంపద పద్యం. పూర్వీకులు ఇచ్చిన ఆస్తి.. పద్యం ఊహల్లో విహరింపచేస్తుంది. దానిని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందంటూ పద్యం విశిష్టతను కడపకు చెందిన ఆచార్య మొల్ల కవితా పీఠాధిపతి జి. హనుమంతరావు చాటిచెప్పారు. సూళ్లూరుపేట రోటరీహాల్‌లో శనివారం సాయంత్రం విశ్రాంత అధ్యాపకుడు, జాతీయ ఉత్తమ విద్యావేత్త, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత అష్టావధాని డాక్టర్ ఎస్. జనార్దన్‌రావు కలం నుంచి జాలువారిన అక్షర శ్రోత్రాంజలి, అక్షయ ప్రణుతాక్షరి కవితా కుసుమాల ఆవిష్కరణ వైభవంగా జరిగింది. కలియుగ వెంకటేశ్వరునిపై విరసించిన అక్షయ ప్రణుతాక్షరిని షార్ కంట్రోలర్ జెవి రాజారెడ్డి చెంగాళమ్మను చుచిస్తూ అభినవ కవితా సుకుమాంజలి అక్షర స్తోత్రాంజలిని చెంగాళమ్మ ఆలయ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చెన్నై ప్రముఖ ఆడిటర్ జేకే రెడ్డి అక్షయ ప్రణుతాక్షరి కవితలను తన స్వరమాధూర్యంతో ఆలపించి సభికులకు రుచిచూపారు. తిరుమల వైభవాన్ని కవి జనార్దన్‌రావు తన కవితలతో వెల్లడిస్తూనే అక్కడ పేట గణిత భక్తులపై చూపే వ్యత్యాసాన్ని సైతం ఆ వెంకటేశ్వరునికి నివేదించడం ఆయనకు సమ సమాజంపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఆచార్య ఆత్రేయ సూళ్లూరుపేట ప్రాంతీయుడని అంతటి కవి జనార్దన్‌రావు అంటూ షార్ కంట్రోలర్ రాజారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జనార్దన్‌రావు దంపతులకు సన్మానం చేశారు. ఆయన తన సహజ ఆసు పద్య కవిత్వంతో ప్రసంగించి ఆకట్టుకున్నారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. సుభాషిణి, ఆంధ్ర విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఎం. రాజగోపాల్‌రెడ్డి, రైల్వేబోర్డు సలహా సంఘ సభ్యుడు అయితా ఆనందకృష్ణయ్య, తదితరులు ప్రసంగించారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ కావ్యావిష్కరణ మహోత్సవం జరిగింది. డాక్టర్ సాయిరాం, అయితా శ్రీధర్, ఉస్మాన్‌బాషా, తదితరులు ఈ కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకున్నారు. చెంగాళమ్మ ఆలయ పాలకవర్గ సభ్యులు ఆకుతోట రమేష్, పులుగు శ్రీనివాసులురెడ్డి, బ్రాహ్మణ సేవాసమాఖ్య ప్రతినిధులు మల్లిస్వామి,. రమణస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం నేతలు హాజరయ్యారు.

హనుమంత వాహనంపై వెంకయ్య అభయం


హనుమంతునిపై కొలువుదీరిన వెంకయ్య స్వామి

వెంకటాచలం: ఆరాధనోత్సవాల్లో భాగంగా అవధూత వెంకయ్యస్వామి శనివారం ఉదయం హనుమంత వాహనంపై భక్తులను అనుగ్రహించారు. వేకువజాము నుంచే స్వామివారికి అర్చకులు వివిధ రకాల పూజలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి హనుమంత వాహన సేవకు ఉత్సవర్లను సిద్ధం చేశారు. హనుమంతునిపై కొలువుదీరిన స్వామి వారిని గొలగమూడి గ్రామవీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు స్వామివారికి కర్పూరహారతులు పట్టారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఊరేగింపు ముందు భక్తులు కోలాటాలు, భజనలు నిర్వహించారు. హనుమంత సేవకు ఇందుకూరుపేటకు చెందిన సూదలగుంట నాగార్జునరావు ఉభయకర్తగా వ్యవహరించారు. ఉత్సవాలకు తోడు శనివారం కావడంతో స్వామి సమాధి మందిరాన్ని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


స్వామి ఊరేగింపు ముందు కోలాటం చేస్తున్న భక్తులు

ఉత్సవాల్లో నేడు..

ఆరాధనోత్సవాల్లో మూడవ రోజైన ఆదివారం ఉదయం వెంకయ్యస్వామికి చినశేషవాహన సేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. ఈ సేవకు ఉభయకర్తలుగా శ్రీధర్, నరసింహారావు, సుబ్బరాజు, దిలీప్‌కుమార్ రెడ్డి వ్యవహరిస్తారన్నారు. రాత్రికి హంసవాహన సేవ జరుగుతుందని తెలియజేశారు. ఈ సేవకు మోచర్ల మధు, ఉప్పల మోహన్, నల్లగొండ్ల గాంధీ, రవీంద్ర రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఖమ్మం జిల్లాకు చెందిన గారపాటి సూర్యనారాయణ దంపతులు అన్నదానం చేస్తారని వివరించారు. సాయి నాట్యమండలి వారిచే రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర నాటకాలు ప్రదర్శిస్తారని తెలియజేశారు.


సమాధి మందిరాన్ని దర్శించుకోవడానికి క్యూలో ఉన్న భక్తులు

చెంగాళమ్మ సేవలో జిల్లా అదనపు జడ్జి శ్యామలాదేవి

సూళ్లూరుపేట : చెంగాళమ్మతల్లిని శనివారం జిల్లా అడిషనల్ జడ్జి కే శ్యామలాదేవి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెను చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి స్వాగతించి దర్శనాంతరం సత్కరించి అమ్మణ్ణి ప్రసాదాలు అందజేశారు. పాలకవర్గ సభ్యులు ఆకుతోట రమేష్, పి. శ్రీనివాసులురెడ్డిలతోపాటు రామకృష్ణ పాల్గొన్నారు.


జడ్జిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

రుణాల మంజూరుకు 23న ఇంటర్వ్యూలు

ఆత్మకూరు: ప్రభుత్వ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా స్వయంఉపాధి పథకాలకు ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ వి.శ్రీనివాస రావు, ఎంపీడీవో నిర్మలాదేవి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మున్సిపల్ పరిధిలో దరఖాస్తుదారులకు మున్సిపల్ కార్యాలయంలో, మండల పరిధిలోని దరఖాస్తుదారులకు మండల కార్యాలయంలో వేర్వేరుగా ఇంటర్వ్యూలు జరుగుతాయని వారు తెలియజేశారు. అభ్యర్థులు వారి కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతో హాజరుకావాలని వారు కోరారు.

● ఇంటర్వ్యూ



లబ్ధిదారుల వాటా చెల్లింపునకు
గడువు పెంపు

శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

?. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - ఎన్టీఆర్ నగర్‌కు ఎప్పటిలోగా లబ్ధిదారులు తమ వాటా చెల్లించాలి?

!. లబ్ధిదారులు తమ వాటా మొత్తం చెల్లించేందుకు మరోసారి గడువు పొడిగించాం. ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా డీడీలు చెల్లించాలి.

?. ఇప్పటివరకు ఎంతమంది చెల్లించారు?

!. పక్కాగృహాలు మంజూరైన 1,028 మంది లబ్ధిదారుల్లో ఇప్పటివరకు 350 మంది పైగా డీడీలు చెల్లించారు.

?. ఏఏ కేటగిరీలకు ఎంత మొత్తం చెల్లించాలి

!. సింగిల్ బెడ్‌రూమ్‌కు రూ.500లు, టైప్-2 సింగిల్ బెడ్‌రూమ్‌కు రూ. 12, 500లు, డబుల్ బెడ్‌రూమ్‌కు రూ.25 వేలు మొదటి విడతగా చెల్లించాలి.

?. ఎక్కడ చెల్లించాలి?

!. ఆత్మకూరు మున్సిపాలిటీకి సంబంధించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అకౌంట్ నెంబర్ 50200025267780లో డబ్బులు చెల్లించి, ఆ రశీదు ఫొటోస్టాట్ కాపీని, తమ ఆధార్ నెంబర్‌ను మున్సిపాలిటీలో అందజేయాలి.

?. సింగిల్‌బెడ్ రూమ్ నుంచి డబుల్ బెడ్‌రూమ్‌కు మార్చుకునే వెసులుబాటు ఉందా

!. లబ్ధిదారులు సింగిల్‌బెడ్ రూమ్ నుంచి డబుల్ బెడ్‌రూమ్‌కు, డబుల్ బెడ్‌రూమ్ నుంచి సింగిల్ బెడ్‌రూమ్‌కు ఇప్పటికైనా మార్చుకునే వెసులుబాటు ఉంది.

?. నూతనంగా పక్కాగృహాలు మంజూరు చేసే అవకాశం ఉందా?

!. ఇప్పటికీ మంజూరు చేస్తున్నాం. ఇంటి స్థలం ఉన్న వారు, ఇళ్లు లేనివారు తమ పేర్లను మున్సిపాలిటీలో నమోదు చేసుకుంటే పరిశీలించి, మంజూరు చేస్తాం.

- ఆత్మకూరు

ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు నీటి కష్టాలు



నిర్మాణ దశలో ఇళ్లు



డ్రమ్ములతో నీరు తెచ్చుకుంటున్న లబ్ధిదారులు

అనంతసాగరం: సోమశిలలో ఎన్టీఆర్ గృహనిర్మాణాలకు నీటి సమస్య ఆటంకంగా మారింది. సోమశిల గిరిజనకాలనీ సమీపంలో ఎస్సీ, మైనార్టీ, బీసీ వర్గాలకు చెందిన 50 మందికి ఎన్టీఆర్ గ్రామీణ గృహకల్ప పథకం ఇళ్లు మంజూరయ్యాయి. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను అధికారులు ఆదేశించారు. ఆ ప్రాంతంలో బోరు వేసినా నీరు పడే పరిస్థితి లేకపోవడంతో సోమశిల జలాశయానికి కిలోమీటరు దూరంలో ఉన్నా, ఉత్తరకాలువలో నీరు లేకపోవడంతో, ఇళ్ళు నిర్మించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో గ్రామం నుంచి ఎడ్లబండ్లపై డ్రమ్ముల్లో నీళ్లు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. త్వరితగతిన బేస్‌మెంట్ వేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తామని అధికారులు చెబుతుండడంతో అష్టకష్టాలు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతంలో నీటి వసతి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం



నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. డ్రమ్ములతో ఇతర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుని వాడుకునే పరిస్థితి ఏర్పడింది. అధికారులు దృష్టిసారించి నీటి వసతి కల్పించాలి.

-శోభ, సోమశిల

నిర్మాణ వ్యయం పెరిగిపోతోంది



ఇళ్లు నిర్మించే ప్రాంతానికి సమీపంలో నీటి వనరులు లేవు. నిర్మాణానికి అవసరమైన నీటిని ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా తెచ్చుకోవడానికి అదనంగా ఖర్చవుతోంది. పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని అందించాలి.

- కాలేషా, సోమశిల

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆవిర్భవించిందని ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి కె.రమణరాజు, డిపో అధ్యక్షుడు ఎం.చిన్నారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం సిల్వర్‌జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయూ చేసిన పోరాటాలు, ఆందోళనలతో కార్మికులకు ప్రయోజనం చేకూరి, ఆత్మగౌరవం పెరిగిందన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, సంస్థ లాభాల బాటలో పయనించేందుకు యూనియన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ రీజనల్ కార్యదర్శి లుక్సన్, రీజనల్ నాయకులు ఎ.జయరామిరెడ్డి, షేక్ చాన్‌బాష, పి.శ్రీనివాసులు, గ్యారేజి కార్యదర్శి వి.పి.ఆర్.రెడ్డి, అధ్యక్షులు షేక్ గౌస్‌అహ్మద్, డిపో ఛైర్మన్ వి.ఎస్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమణరాజు

23న రుణ దరఖాస్తుల పరిశీలన

ఏఎస్‌పేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణయ్య తెలిపారు. 2017-18 సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు. కాపు రుణాలు 54 యూనిట్లు, బీసీ 35, ఎస్సీ 41, ఎస్టీ 7 యూనిట్లకు అర్హులను ఎంపిక చేస్తామన్నారు. కావున లబ్ధిదారులు ఉదయం 10 గంటల నుంచి సంబంధిత పత్రాలతో కార్యాలయానికి విచ్చేయాలని కోరారు.

ఇసుకకు అనుమతులు అవసరం లేదు

ఏఎస్‌పేట: ప్రాంతీయంగా ఇసుక రవాణా చేసుకునేందుకు ఎవరి అనుమతులు అవసరం లేదని శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు ఆదేశించినట్లు ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజు తెలిపారు. ఇది మరుగుదొడ్లు, ఇల్లు నిర్మించుకునేవారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణాలకు ఆటంకం ఏర్పడడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కానీ పెద్దపెద్దభవనాలు, వ్యాపార కలాపాలకు మాత్రం తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రాంతీయంగా మాత్రమే రవాణా చేయాలని జిల్లాలు దాటితే చర్యలు తప్పవన్నారు.



కంపచెట్లతో మూసుకుపోయిన రహదారి

మూసుకు పోతున్న రహదారి

మర్రిపాడు: ఉమ్మాయపల్లి నుంచి బ్రాహ్మణపల్లి వరకు వెళ్లే రహదారి కంపచెట్లతో మూసుకుపోతోంది. దీంతో వాహన చోదకులు ఆ రహదారిలో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా కంపచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల బాధ్యతల స్వీకరణ

మర్రిపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం బదిలీపై వచ్చిన 86 మంది ఉపాధ్యాయులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. స్థానికంగా 8 ఏళ్లు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరూ ఇతర మండలాలకు బదిలీ అయినట్లు ఆయన వివరించారు.

బోరు రంధ్రాలు పూడ్చివేయండి

ఏఎస్‌పేట: చిన్నారుల పాలిట మృత్యుద్వారాలుగా మారుతున్న బోరు రంధ్రాలను వెంటనే పూడ్చివేయాలని ఇన్‌చార్జి తహసీల్దారు నాగరాజు తెలిపారు. బోర్లు వేసి నీరు పడని రంధ్రాలను యజమానులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీంతో వాటిని వెంటనే పూడ్చివేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిలా ్లకలెక్టర్ ఆదేశించినట్లు వివరించారు. నిరుపయోగంగా ఉన్న బోర్ల సమాచారం రెవెన్యూ అధికారులకు అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు టీడీపీ మండల సమావేశాలు

అనంతసాగరం/మర్రిపాడు: అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో ఆదివారం నిర్వహిస్తున్న టీడీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల టీడీపీ నేతలు శాకమూరి సుబ్బారావు, శాకమూరి నారాయణ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సమావేశాలకు మాజీ మంత్రి, ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డి వస్తున్నారని టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు, గ్రామకమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

మర్రిపాడులో తేలికపాటి వర్షం

మర్రిపాడు: మర్రిపాడు మండలంలో శనివారం తేలికపాటి వర్షం నమోదైంది. మూడు రోజులుగా మండలంలో ఓ మోతాదు వర్షం కురిసింది. ఈ వర్షంతో చెరువులు, వాగులు, వంకల్లో నీరు చేరితే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు

వరికుంటపాడు: మండల పరిధిలోని జీ.కొండారెడ్డిపల్లిలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ శనివారం జీవవైవిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఔషధ మొక్కల గురించి తెలియచేశారు. సేంద్రియ వ్యవసాయ విధానంతో కలిగే మేలు, లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మిత రమణారెడ్డి, బయోడైవర్సిటీ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, హెచ్‌ఎం హర్షనారాయణ, హరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



విద్యుత్‌దీపాలంకరణలో ఆలయం

అనంతసాగరం: అనంతసాగరంలోని సాయిబాబా ఆలయంలో 13వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రెండవ రోజు ఘనంగా జరిగాయి. సుప్రభాత సేవ, సాయినాధుని పూజ, హారతి, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించారు. అధికసంఖ్యలో సాయిబాబాను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏఎస్‌పేట: మండలంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్‌వర్మ తెలిపారు. మండలంలో 33 కేవీ లైన్‌కు మరమ్మతులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

ఉదయగిరి జామియా పెద్దమసీదు ఆస్తుల సంరక్షణకు చర్యలు

ఆత్మకూరు: ఉదయగిరిలోని జామియా పెద్ద మసీదుకు చెందిన ఆస్తులను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఆర్డీవో టి.బాపిరెడ్డి తెలిపారు. శనివారం ఉదయగిరికి చెందిన కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుకు ఆయన స్పందించారు. మసీదు స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని, నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు ఆరు నెలలు జైలుశిక్ష, రూ.8 వేల జరిమానాకు అర్హులవుతారన్నారు. ఈ విషయాన్ని ఆక్రమణకు యత్నించేవారు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల



శిథిలావస్థలో అనంతసాగరం పశువైద్యశాల


నెర్రెలుబారి పడిపోయే స్థితిలో గోడలు

అనంతసాగరం: పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయం.. భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. అనంతసాగరంలో 1970లో పశువైద్యశాల భవనం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం గోడలు నెర్రెలువారి కూలిపోయే స్థితికి చేరింది. పైకప్పు ఉరుస్తుండడంతో రికార్డులు, పీహెచ్‌సీలో ఉన్న దాణా తడిసి పాడవుతున్నాయి. మండలంలోని 24 పంచాయతీలకు గాను

● రికార్డులు, దాణాకు రక్షణ కరువు

20 పంచాయతీలకు చెందిన పాడిరైతులు ఈ వైద్యశాలను వినియోగించుకుంటున్నారు. ఈ వైద్యశాల పరిధిలో గొర్రెలు 16,500, మేకలు 12,470, ఆవులు 1,480, గేదెలు 1,080 ఉండగా, నిత్యం రైతులు వైద్య సేవల కోసం వస్తుంటారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనం గోడల్లో చెట్లు మొలచి, శ్లాబుపెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో భవనం పడగొట్టి నూతన పక్కాభవనం నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినా, అమలుకు నోచుకోలేదు. ఇకనైనా అధికారులు దృష్టిసారించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని, తొలగించి నూతన భవనం నిర్మించాలని సిబ్బంది, పాడిరైతులు కోరుతున్నారు.

పక్కాభవనం నిర్మించాలి



భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్యశాలకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. పశువైద్యశాలలో నిల్వ చేసిన దాణా వర్షాలకు పాడవుతోంది. అధికారులు దృష్టిసారించి పక్కాభవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

- రవీంద్రరెడ్డి, వరికుంటపాడు

ఇబ్బందులు తప్పడం లేదు



పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. చాలా ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ పశువైద్యశాల కూలిపోయేలా ఉంది. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు చేపట్టాలి.

- బాలిరెడ్డి, అనంతసాగరం

ప్రతిపాదనలు పంపాం



పశువైద్యశాల భవనం ఉరుస్తుండడంతో వర్షాకాలంలో రికార్డులు, దాణా పాడవుతున్నాయి. నూతన భవనం నిర్మించాలని గతంలో ప్రతిపాదనలు పంపాం. ఈ విషయాన్ని మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- డాక్టర్ సుబ్బానాయుడు, పశువైద్యాధికారి

బొడ్డురాయి వివాదం పరిష్కారం


సమావేశానికి హాజరైన ఇరువర్గాల పెద్దలు


మాట్లాడుతున్న ఆర్డీవో బాపిరెడ్డి

సంగం: సిద్ధీపురం గ్రామంలో బొడ్డురాయి ఏర్పాటులో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో బాపిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నాలుగు రోజుల కిందట సిద్ధీపురంలో పోలేరమ్మ ఆలయం ప్రారంభంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న బొడ్డురాయి విషయంలో దళితులకు, గ్రామస్థులకు వివాదం ఏర్పడిన విషయం విదితమే. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఆత్మకూరు ఆర్డీవో శుక్రవారం రాత్రి సిద్ధీపురం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఇరువర్గాల వారిని సంగం తహసీల్దారు కార్యాలయానికి పిలిపించి చర్చించారు. దళితుల అభీష్టం మేరకు కాలనీకి తూర్పు వైపున బొడ్డురాయి ఏర్పాటుకు ఇరువర్గాలు సమ్మతించాయి. దీంతో వివాదం సద్దుమణిగింది. ఈ చర్చల్లో ఇన్‌చార్జి తహసీల్దారు షఫిమాలిక్, వీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఇరువర్గాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


బహుమతి అందచేస్తున్న ఉపాధ్యాయిని

సంగం: మండల కేంద్రంలోని నార్త్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సరోజనమ్మ, చెన్నయ్య, సుశీలమ్మలను విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ సభ్యుడు శ్రీనివాసులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్ పాఠశాలలో ఇంటర్వ్యూ

మర్రిపాడు: నందవరం గ్రామంలోని మోడల్ పాఠశాలలో ఆదివారం ఆంగ్ల భాషోపాధ్యాయుడి పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శారదాకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు

తల్లిదండ్రుల సమావేశం


మాట్లాడుతున్న మేట్రిన్ మల్లేశ్వరి

సంగం: స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో మేట్రిన్ మల్లేశ్వరి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సమస్యలపై చర్చించారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తేవాలని కోరారు. వసతి గృహంలో ప్రభుత్వ సూచించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామన్నారు. సెలవుల్లో విద్యార్థినులు ఇళ్లకు తీసుకెళ్లినా, సకాలంలో హాస్టల్‌కు పంపాలని కోరారు.

నిర్లక్ష్యంగా వదిలేసిన బోర్లపై సమాచారం ఇవ్వాలి

కలువాయి : గ్రామాల్లో నిరుపయోగంగా తెరుచుకుని ఉన్న బోర్లపై వెంటనే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని తహసీల్దారు రవీంద్రనాథ్ కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎక్కడైనా వ్యవసాయ అవసరాల కోసం బోరు వేసి నిరుపయోగంగా వదిలేసి ఉంటే వాటిపై తహసీల్దారు, ఎంపీడీవో, వ్యవసాయాధికారికి సమాచారం అందించాలని కోరారు. వీటి వల్ల ఎలాంటి ప్రమాదాలు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

రుణ బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న వెలుగు ఏసీ మురళీ

రాపూరు: బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న పొదుపు సభ్యులు తక్షణమే రుణాలు తిరిగి చెల్లించాలని వెలుగు ఏసీ మురళీ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏపీజీబీలో రూ.23లక్షలు, సిండికేటు బ్యాంకులో రూ.43లక్షలు, స్టేట్‌బ్యాంకులో రూ.9 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. పొదుపు సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకుల పురోభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్నారు. బకాయిలు పెరిగిపోతే కొత్తవారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉండదన్న విషయాన్ని అందరూ గుర్తించుకుని కంతుల వారీగా బకాయిలు చెల్లించాలన్నారు. వెలుగు ఏపీఎం కిరణ్, సిండికేటు, ఏపీజీబీ మేనేజర్లు వీరభద్రం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధులకు 67 మంది ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుల జాయినింగ్ ఆర్డర్ అందుకొంటున్న ఎంఈవో

వెంకటగిరి: మండలంలోని 70 మంది ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల స్థానంలో 67 మంది కొత్త ఉపాధ్యాయులు శనివారం విధులకు హాజరయ్యారని ఎంఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణ పరిధిలోని పీర్జాతి పేటలోని రెండు ఉర్దూ ఉపాధ్యాయులు, బంగారుపేట బీసీ కాలనీలోని ఒక్క బయోలజీ ఉపాధ్యాయిని పోస్టు మాత్రం ఇంకా భర్తీ కాలేదని, త్వరలో అవి కూడా భర్తీ అవుతాయని వివరించారు. కొత్తగా బాధ్యతలు తీసుకొన్న ఉపాధ్యాయులు సమయాపాలన పాటించాలని సూచించారు.

జియో ట్యాగింగ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఏపీఎం చిన్నయ్య

సైదాపురం: స్థానిక స్త్రీ శక్తి భవనంలో జియోట్యాగింగ్‌పై శనివారం వెలుగు ఏపీఎం చిన్నయ్య విలేజ్ డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణాలు, బ్యాంక్ లింకేజీల సర్వేలపై జియోట్యాగింగ్ ద్వారా సర్వేలు నిర్వహించేందుకు వీడీఏలకు యాప్‌లపై అవగాహన కల్పించామన్నారు. వీడీఏలు గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శైలజ పాల్గొన్నారు.

బస్సులు డిపోలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి

గూడూరు(టౌన్): రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సులు డిపోలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని శనివారం స్థానిక డిపోలో ఆర్టీసీ డీఎం అనిల్‌కుమార్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సీవీఆర్ కుమార్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో బస్సులు బైపాస్‌లో వెళుతుండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. డిపోలోకి వచ్చేలా చర్యలు చేపడితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌కుమార్, చల్లా వెంకటేశ్వర్లు, కోదండ పాణి, కలాం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక రవాణా



మాట్లాడుతున్న ఆర్డీవో అరుణ్‌బాబు

గూడూరు: కలెక్టర్ ముత్యాలరాజు ఉత్తర్వుల మేరకు నిర్మాణాలకు అధికారులు గుర్తించిన ప్రాంతాల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాలని ఆర్డీవో అరుణ్‌బాబు అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇసుక రీచ్‌లను గుర్తించామన్నారు. అయితే పలు మండలాలకు ఆ రీచ్‌లు దూరంగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆయా మండలాల్లో ఇసుక నిల్వలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇసుకను నిర్మాణాలకు తరలించుకునేలా చర్యలు చేపట్టారన్నారు. ఆయా ప్రాంతాలలో తీసుకున్న ఇసుకను మండల పరిధి దాటి వెళ్లకూడదన్నారు. ఇసుకను రవాణా చేసే ట్రాక్టర్‌కు తప్పనిసరిగా జీపీఎస్ సిస్టం బిగించాలన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ మొదటివారంలోగా డివిజన్ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించామన్నారు. అదేవిధంగా అందుబాటులో ఉన్న నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా ల్యాండ్ రికార్డుల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలన్నారు. ఈ మేరకు అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

42 మంది బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

గూడూరు(టౌన్): గూడూరు పోలీస్ డివిజన్ పరిధిలో 42 మంది క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.63,860, 38 సెల్‌ఫోన్లు, ఒక ఎల్ఈడీ టీవీ స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి డీఎస్పీ రాఘవ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పట్టుబడిన నిందితులను మీడియా ఎదుట ఉంచి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేగిన క్రికెట్ బెట్టింగ్ కేసులో జిల్లా వ్యాప్తంగా దర్యాప్తులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు గూడూరు పట్టణ, రూరల్, చిల్లకూరు మండలంలో మొత్తం 42 మంది క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను అరెస్ట్ చేశామన్నారు. వీరిలో ఒకటో పట్టణానికి చెందిన 17 మందిని ఎస్ఐ సుధాకర్, సిబ్బంది అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 36,460, 16 సెల్‌ఫోన్లు, రెండో పట్టణానికి చెందిన 10 మందిని ఎస్ఐ నరేష్ స్బిందితో కలసి అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 8,400, 7 సెల్‌ఫోన్లు , చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలోని గిరీష్‌కుమార్ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్‌లు అడుతున్న 11 మందిని ఎస్ఐ అంకమ్మ, సిబ్బంది దాడి చేసి అరెస్ట్ చేసి వారి నుంచి రూ.13 వేలు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో సబ్‌బుకీ నవశేఖర్ ఇంట్లో సబ్ బుకీలైన షఫీ, బ్రహ్మానాయుడు, జనార్దన్‌రెడ్డితో కలపి నలుగురిని ఇన్‌చార్జి ఎస్ఐ ఏడుకొండలు అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో పోలీసులపై దాడికి యత్నించిన ఈ నలుగురిపై 307 కేసు నమోదు చేశామన్నారు. వారి నుంచి రూ. 6 వేలు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ఎల్ఈడీ టీవీని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు సుబ్బారావు, అక్కేశ్వరరావు, ఎస్ఐలు సుధాకర్, నరేష్, అంకమ్మ, ఏడుకొండలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ రాఘవరెడ్డి

28న మస్తాన్ ఔలియా గంధ మహోత్సవం

గూడూరు(టౌన్): స్థానిక సయ్యద్ హుస్సేని జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో ఈ నెల 28న వైభవంగా గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక దర్గాలో గంధమహోత్సవం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23న నిశాన్, 26న చందన సేవ, 28న గంధం కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కులమతాలకతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇలియాజ్ అయ్యద్, మగ్దూమ్, షాన్‌వాజ్, సందానీబాషా, యస్‌దాన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

● ఇంటర్వ్యూ



5,432 మందికి పింఛన్లు అందజేస్తున్నాం

● భవానీ, ఎంపీడీవో, గూడూరు

? మండలంలో పింఛన్లు ఎన్ని, ఎంత మొత్తం అందిస్తున్నారు.

! మండలంలో ప్రతి నెలా 5,432 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నాం. వీరికి రూ. 63 లక్షలు అందజేస్తున్నాం.

? మండలంలో ఆత్మగౌరవం కార్యక్రమం ఎలా సాగుతోంది.

! మండలంలోని 23 పంచాయతీల్లో ఆత్మగౌరవం పథకం ద్వారా ఇప్పటికే 6,312 మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాం. మరో 321 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి దశకు చేరుకున్నాయి. అదేవిధంగా రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 311 ఫారమ్‌పాండ్స్ నిర్మించాం.

? కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేశారా.

! 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల ద్వారా 138 యూనిట్ల రుణాలు మంజూరు చేసేందుకు లబ్ధిదారులను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకున్నాం.

- గూడూరు(రూరల్)

జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చేది ఫొటోలే



ప్రదర్శన నిర్వహిస్తున్న ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు

గూడూరు: జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చేది ఫొటోలేనని ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు అన్నారు. శనివారం అంతర్జాతీయ ఫొటో గ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితాలలో తీపి గుర్తులను ఫొటో గ్రాఫర్లు తమ ఫొటోల ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. వారి సంక్షేమానికి అసోసియేషన్ పాటు పడుతుందన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం సహకారం ఇవ్వాలన్నారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మారుబోయిన చిరంజీవిగౌడ్, శ్రీను, చెందు, ప్రభాకర్, రత్నం, ఖాదర్, వెంకీ, దయాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గూడూరు(టౌన్): గూడూరు- రాపూరు రహదారిపై చెన్నూరు కట్టాలమ్మ దేవస్థానం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం మేరకు.. ఓజిలి మండలం బత్తలాపురానికి చెందిన కాకాణి ఏడుకొండలు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ ఎక్స్‌కవేటర్ రాపూరు మండలంలో పనిచేస్తుండటంతో ఇంటి నుంచి బైకుపై రాపూరుకు వెళుతుండగా సైదాపురం నుంచి గూడూరు వైపు వెళుతున్న కంటైనర్ అదుపు తప్పి బైకును ఢీకొంది. దీంతో ఏడుకొండలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ఏడుకొండలు

విద్యార్థులకు ఎమ్మార్ టీకా

గూడూరు(రూరల్): దివిపాళెం పంచాయతీ చవటపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎమ్మార్ టీకా వేశారు. ఈ సందర్భంగా సర్పంచు పిట్టి చంద్రసేన మాట్లాడుతూ 15 ఏళ్ల లోపు పిల్లలకు ఎమ్మార్ టీకా వేయడం వలన తట్టు, రుబెల్లా వంటి వ్యాధులు సోకకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పిట్టి నాగరాజు, ఏసుపాక పెంచలయ్య, హెచ్‌ఎం కాంచన, ఏఎన్ఎం శశిదేవి, బలరామయ్య పాల్గొన్నారు.



విద్యార్థినికి టీకా వేస్తున్న ఏఎన్ఎం

'నారాయణ'లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

గూడూరు: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల మేనేజింగ్ సెక్రటరీ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ డే సందర్భంగా విద్యార్థులలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఫొటోగ్రఫీపై పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలో జాన్‌తరుణ్ మొదటి స్థానంలో నిలవగా, తరుణ్‌కుమార్ రెండో స్థానం, జ్యోత్స్న మూడో స్థానంలో నిలవడంతో వారికి బహుమతులు అందజేశామన్నారు. అదేవిధంగా స్థానిక కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థులకు వీఎల్ఎస్ఐ డిజైన్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో వీఎల్ఎస్ఐ డిజైన్లపై ఉద్యోగావకాశాలను మెరుగ్గా ఉంటాయన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నకంపెనీ ప్రతినిధులు

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నేనే రాజు నేనే మంత్రి
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	ఫిదా
సంగం:	లై

కోట

ఆర్ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించండి

కోట: ప్రభుత్వ సూచనల మేరకు చౌకదుకాణాల డీలర్లు ఇంటింటికి తిరిగి గ్యాస్ విని యోగంపై అవగాహన కల్పించాలని రెవెన్యూ అధికారులు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ కేఎం రోజ్‌మాండ్ అధ్యక్షతన నిర్వహించిన రేషన్‌షాపుల డీలర్ల సమావేశంలో ఆర్ఐలు రమ్య, వేణు మాట్లాడుతూ అందరూ గ్యాస్ వినియోగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కిరోసిన్ రహిత రాష్ట్రంగా చేసేందుకు తమవంతు సహకారం అవసరమని, ఆ మేరకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. షాపుల్లో బియ్యం సకాలంలో పంపిణీ చేయాలన్నారు.

సిలికా లారీ బోల్తా

చిల్లకూరు: నల్లయగారిపాళెం గ్రామ సమీపంలో శనివారం వేకువజామున సిలికా లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. చెన్నైకు చెందిన లారీ సిలికా లోడుతో చింతవరం నుంచి చెన్నైకి వెళ్తుండగా నల్లయగారిపాళెం సమీపంలోని మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ డ్రైవర్లు వంజునాథ్, విజయ్‌కు స్వల్ప గాయాల య్యాయి.



బోల్తా పడిన లారీ

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

● జూనియర్ సివిల్ జడ్జి శైలజ

వాకాడు: ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండా లని కోట జూనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. శనివారం వాకాడులోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బాలికల పాఠశాల లోని నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో విద్యార్థులకు చట్టా లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలు, వాటికి అనుకూలమైన చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగా హన కలిగి ఉండాలన్నారు. అలాంటప్పుడే జీవితంలో జరిగే పరి ణామాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వీలుంటుంద న్నారు. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ చాలా కీలకమని, దీనిని సక్ర మంగా సద్వినియోగం చేసుకున్న వారు జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, జూనియర్ లాయర్లు మోహన్, అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శైలజ

వజ్జవారిపాళెంలో పశు వైద్యశిబిరం

కోట: వజ్జవారిపాళెంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటాస్ ఫా ర్మసూటికల్ సహకారంతో ఇక్కడ ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశా రు. పాల ఉత్పత్తి, పశు సంపద సంరక్షణ అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పిం చారు. పశు పోషణలో సరైన మెలకువలు పాటిస్తే వ్యాధులు అంత దూరంలో ఉంటా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి డాక్టర్ ధాత్రి, బాలబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

ఏకాంతసేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

చిల్లకూరు: కలువకొండ తిప్పపై వెలసిన లక్ష్మీనరసంహ స్వామి బ్రహ్మోత్సవాలు శనివా రం ఏకాంతసేవతో ముగిశాయి. ఈ బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఉదయం ధ్వజ అవరోహణం, సుప్రభాతం, చక్రస్నానం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పుష్పయాగం, ఏకాంతసేవ కార్యక్రమాలు నిర్వ హించారు. ఉభయదాతలుగా బొకు బాలచం ద్రరావు, జయలక్ష్మి, నరసంహారావు, వినీల, శ్రీకాంత్‌రావు, పుష్పలత, సోమిశెట్టి రామసు బ్బయ్య, రాజ్యలక్ష్మి, రాచూరి బాలనరసిం హులు, ధనలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్ర మాలను ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



స్వామికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

వాకాడు: విధి నిర్వహణలో వైద్య సిబ్బందికి నిర్లక్ష్యం తగదని, సకా లంలో హాజరుకావాలని గూడూరు డివిజన్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎం శంకరరావు అన్నారు. శనివారం ఆయన వాకాడు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దువ్వూరు మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వాకాడు ఆసు పత్రిలో వందల సంఖ్యలో కాన్పులు జరిగేవని, ప్రస్తుతం నెలలో పదుల సంఖ్యలో కూడా కాన్పులు జరగడం లేదన్నారు. అందరూ క్రమశిక్షణతో పనిచేసి ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాల న్నారు. చైర్మన్ మధురెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లో రోగులకు తాగు నీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే దుకు, అలాగే ఇక్కడ పనిచేస్తూ డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను తిరిగి ఇక్కడే పనిచేసేలా కమిటీ తీర్మానించిందన్నారు. నెల రోజుల్లో సొంత నిధులతో కాన్పుల గదిని అధునాతనంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ రవికుమార్, దంత వైద్యులు డాక్టర్ శ్యాం, కమిటీ సభ్యుడు అన్నమేటి చంద్రయ్య, వైద్య సిబ్బంది, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణ మూర్తి పాల్గొన్నారు.



కాన్పుల గదిని పరిశీలిస్తున్న మధుసూదనరెడ్డి

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదవాలి



మొక్కలు నాటుతున్న నరసారెడ్డి, తేజోవతి

కోట: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్య త్తు ఉంటుందని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నరసారెడ్డి, అసి స్టెంట్ వెల్ఫేర్ అధికారి తేజోవతి అన్నారు. కొత్తపాళెం, కోట బీసీ బాలుర, బాలికల వసతిగృహాలను శనివారం వారు ఆకస్మి కంగా తనిఖీ చేశారు. కోట బాలుర వసతిగృహంలో విద్యార్థు లు, అధికారులు మొక్కలు నాటారు. కొత్తపాళెం వసతి గృహం లో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. వారి వెంట వార్డెన్ నరసింహామూర్తి ఉన్నారు.

విద్యార్థులకు సర్పంచు చేయూత

వాకాడు: దుజరాజపట్నం పంచాయతీ ప రిధిలోని కొం డూరు పాళెం, అంజిలాపురం, పాఠశాలల్లోని 60 మంది విద్యార్థులకు శ నివారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, స్థానిక సర్పంచు దోసకాయల కృష్ణమూర్తి సొంత నిధులతో ఉచిత బస్సు పాసు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి క్రమశి క్షణతో పాటు, నాణ్యమైన విద్యను అభ్యసించాలని, దాతలు కల్పించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.



పాసులు పంపిణీ చేస్తున్న సర్పంచు

బకింగ్‌హాం కెనాల్ అభివృద్ధి పనులు చేపట్టండి

వాకాడు: బకింగ్ హాం కెనాల్ అభివృద్ధి పనులు త్వరి తగతిన చేపట్టాలని ఆ కెనాల్ పర్యావరణ పరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యులు శనివారం జలవనరుల శాఖ అధి కారులు ఈఈ కృష్ణమోహన్, డీఈ రత్నరాజు, జేఈ శ్రీధర్, టెక్నికల్ డీఈ వీరకుమార్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఈఈ కృష్ణమోహన్ మొదట శ్రేణిలో కాకినాడ నుంచి చినగంజాం వరకూ, రెండవ విడతలో చినగంజాం నుంచి, మూడవ విడత నెల్లూరు జిల్లాలో బీసీ కెనాల్ అభివృద్ధి పనులు చేపడుతామన్నారని కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కళా వల్లీప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో దాసరి సుందరం, వాకాటి సంపత్‌కుమార్, వాటంగారి వెంకటరమణయ్య, నారాయణ, వెంకయ్య, ఏకాంబరం, మాధవ్ పాల్గొన్నారు.



అర్జీ అందజేస్తున్న బీసీ కెనాల్ కమిటీ సభ్యులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చిల్లకూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుం దని ఎంఈవో మధుసూదన్‌రావు అన్నారు. శనివారం రామరెడ్డిపాళెం గ్రామానికి చెందిన పలువురు మన ఊరు సేవసమితి అనే నూతన సంస్థను ప్రారంభించి స్థానిక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఎంఈవో, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గౌరవం పెరుగు తుందన్నారు. విద్యార్థులు దాతలు అందించే ప్రోత్సాహా లను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి మొక్కలు అందజేసి చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీ రమణారెడ్డి, ఎంపీ టీసీ మునిశేఖర్‌గౌడ్, ఏలూరు చంద్రశేఖర్, నలజాం పసాద్, నిర్మలమ్మ, లావణ్య, మోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

ఆలయ అభివృద్ధికి కృషి

గూడూరు: స్థానిక మిట్టపాళెంలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తామని మున్సి పల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన, పారిశ్రామిక వేత్త పొనకా శివకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మందిరం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె వెంకటసుబ్బారెడ్డి, బత్తిన సుధాకర్, రఘు, మంజులమ్మ, పూర్ణచంద్ర, కృష్ణ, ద్వారక్ పాల్గొన్నారు.

'ఎన్‌బీకేఆర్'లో ప్రాంగణ ఎంపికలు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశా లలో ఈసీఈ ఫైనలియర్ విద్యార్థులకు శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సాక్ట్రానిక్ బహుళజాతి కంపెనీ ప్రతినిధి పవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు 61 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కూలిన చెట్టు..

వాకాడు: స్థానిక బీసీ కాలనీలో మూడు రహదారుల కూడలి వద్ద ఉన్న పెద్ద చెట్టు శనివారం ఉదయం ప్రమాదవశాత్తు ఒక్కసారిగా విరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో పరిసర ప్రాంతంలో ఉన్న స్థానికులు రోడ్లపైకి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి.

ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

గూడూరు: దళితులను కించపరిచేలా మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, రాహుల్, దావుద్దీన్, రమణ, విష్ణు, అవినాష్, భార్గవ్ తదితరులు డిమాండ్ చేశారు.

విజయవాడలో ఆలయాలు నిర్మించాలి

గూడూరు(రూరల్): విజయవాడలో రోడ్ల విస్తర ణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన 46 ఆల యాలను వెంటనే నిర్మించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు మల్లెమాల మురళీరెడ్డి, ఆర్వీ రావు, పుల్ల య్య, మల్లికార్జున, రావు రవిచంద్ర డిమాండ్ చేశారు.

22న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

గూడూరు(టౌన్): స్థానిక మున్సిపల్ కార్యాలయం లో ఈ నెల 22న 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ వర్గాలకు అందిం చే సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు సం బంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దొరవారిసత్రం : మండలంలోని ఉచ్చూరు ప్రభుత్వ పాఠశాలలో 85 మంది విద్యార్థులకు సూళ్లూరుపేట జూనియర్ చాంబర్ ఉచితంగా నోట్‌పుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. పరుచూరు మాధవరావు 8వ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు డాక్టర్ సుబ్రహ్మణ్యం దాతృత్వంతో జూనియర్ చాంబర్ ఈ కార్యక్రమం నిర్వహించింది. సర్పంచ్ పామాంజి శ్రీనివాసులు చేతులుమీదుగా విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ చాంబర్ ప్రతినిధులు మునగా నాగరాజు, దుగ్గి సుదర్శన్‌గుప్తా, అయితా శ్రీధర్, అయితా సునీల్‌కుమార్, భగవాన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

గణనాథ.. గట్టెక్కించవా!

● కళాకారుల బొజ్జనింపని విగ్రహాల తయారీ ● జీఎస్టీతో పెరిగిన ముడిసరుకులు

నాయుడుపేటరూరల్ : వినాయక చవితి.. ఈ పండుగ వచ్చిందంటే పల్లె నుంచి పట్టణాల వరకు యువత ఎంతో ఉత్సాహంగా ఉంటారు. ప్రతి సెంటర్లో ఓ ప్రత్యేక విగ్రహం ప్రతిష్ఠించాలని నెల రోజుల ముందు నుంచే గాలిస్తుంటారు. అందమైన, విభిన్నమైన విగ్రహం దొరకగానే అడ్వాన్స్ ఇచ్చి ఇతర ఏర్పాట్లలో నిమగ్నమైపోతారు. అందమైన వినాయక ప్రతిమలకు జీవం పోసే కళాకారులు మాత్రం ప్రతి ఏడాది నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది అదనంగా జీఎస్టీ తోడుకావడంతో ముడిసరుకులు అమాంతంగా పెరిగాయి. దీంతో గత ఏడాదితో పోలిస్తే చిన్నసైజు విగ్రహ తయారీకి వెయ్యి రూపాయలు అదనంగా ఖర్చవుతోంది. అదేవిధంగా ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో పల్లెల్లో వినాయక చవితి సందడి తగ్గుముఖం పడుతోంది. దీంతో కళాకారుల కష్టాలు వర్ణాతీతంగా మారాయి. సుమారు ఐదు నెలల ముందు నుంచే వినాయక విగ్రహాల తయారీకి కళాకారులు శ్రీకారం చుడతారు. ఇక్కడి వినాయక ప్రతిమలు నాణ్యతగా ఉండడంతో నాయుడుపేట పట్టణం నుంచే కాకుండా ఓజిలి, చిట్టమూరు, దొరవారిసత్రం, పెళ్లకూరు, బాలాయపల్లి, తదితర మండలాల నుంచి చవితి నిర్వాహకులు ఇక్కడ విగ్రహాలను కొనుగోలు చేస్తారు. కాగా ఈ ఏడాది జీఎస్టీ ప్రభావం అధికంగా పడుతుందని విగ్రహాల తయారీ కళాకారులు వాపోతున్నారు. దీంతో తాము చెప్పిన ధరకు కొనుగోలుకు ముందుకు రావడం లేదని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి అయిపోయిన వెంటనే కొన్ని ప్రతిమలు మిగిలిపోతుండటంతో కళాకారులు కొంతమేర నష్టపోవాల్సి వస్తుంది. వర్షాలు లేకపోవడం కారణంతో ఈ ఏడు వినాయక విగ్రహాలను ప్రజలు కొనుగోలు విషయంలో వెనుకడుగువేసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు వాపోతున్నారు.



వినాయక విగ్రహాలను తీర్చిదిద్దుతున్న కళాకారుడు



విగ్రహ తయారీకి ముందు..

జీఎస్టీ ప్రభావం ఇలా..

వినాయక విగ్రహానికి చెక్క, ప్లాస్టాఫ్ ప్యారిస్,పెయింటింగ్స్, పేపర్లు, చెక్కలు వాడుతారు. వినాయకస్వామి ప్రతిమలు గత ఏడాది 2వేల రూపాయల నుంచి 20 వేల రూపాయల వరకు ధర పలికితే.. ఈ ఏడాది 3వేల రూపాయల నుంచి 26వేల రూపాయల వరకు పలుకుతున్నాయి. ప్లాస్టాఫ్ ప్యారీస్ 36 కేజీల సంచి గత ఏడాది 290 రూపాయలు ఉండగా ఈ ఏడాది 340కి పెరిగింది. అలాగే పెయింట్స్ లీటరుపై 30 రూపాయలు పెరిగాయి. కూలీ రేట్లు 400 రూపాయలు ఉండగా ఈ ఏడాది 600 డిమాండ్ చేస్తున్నారు.

వంశపారపర్యంగా తయారీ



వినాయక ప్రతిమల తయారీతో వంశపారపర్యంగా జీవనోపాధి సాగిస్తున్నాం. గతంలో స్వామివారి ప్రతిమల తయారీలో ఎంతో ఆదాయం ఉండేది. ఇప్పుడు పెరిగిన ముడిసరుకుల ధరలతో ఆదాయం అంతంతమాత్రంగా ఉంది.

\- మరుపూరి రవి

పూర్వజన్మ సుకృతం



అందరూ ఆరాధనగా కొలిచే వినాయకస్వామి ప్రతిమలను తయారుచేయడం పూర్వజన్మ సుకృతం. స్వామివారి ప్రతిమల తయారీతోనే కుటుంబ పోషణ. ఈ పని అయిపోయిన వెంటనే మట్టి కుండీలు, సిమెంట్ అచ్చుల పనికి వెళ్తాం.

\- పర్తిపాటి వెంకటకృష్ణయ్య

శ్రమకి తగ్గ ఫలితం లేదు



వినాయక ప్రతిమలు చేస్తున్నామే కాని కష్టానికితగ్గ ఫలితం కనిపించడం లేదు. నెలల తరబడి ఈ విగ్రహాల తయారీలోనే ఉంటాం. చివరికి ఆదాయం నామమాత్రంగా మిగులుతోంది.

\- కొత్తూరు శ్రీనివాసులు

పోలీసుల అనుమతితో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి



ఎస్ఐ రవినాయక్

నాయుడుపేట రూరల్ : శాంతి భద్రతలకు, ప్రజల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా వినాయక చవితికి విగ్రహాల ఏర్పాటుకు ఆయా ప్రాంతాల కమిటీ సభ్యులు ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో అనుమతులు పొందాలని ఎస్ఐ రవినాయక్ తెలిపారు. శనివారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసుల అనుమతి, విద్యుత్ శాఖ నుంచి కూడా అనుమతులు పొందాలని ఆయన తెలిపారు. విగ్రహ ఏర్పాటు స్థలం, విగ్రహ పొడవు, వెడల్పుల వివరాలను కూడా తెలపాలని ఆయన కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. విగ్రహ ఊరేగింపులో ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా జాగ్రత్తలతో ఊరేగింపును కొనసాగించాలన్నారు.

నేడు చెంగాళమ్మ ఆలయంలో వైద్యశిబిరం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం జరుగుతున్నట్లు చెంగాళమ్మ ఆలయ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి తెలియజేశారు. దొరవారిసత్రంకు విచ్చేసిన ఆయన మెగా వైద్య శిబిర ప్రకటనలను, పోస్టర్‌ను దొరవారిసత్రంలో విడుదల చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లకు జియోట్యాగింగ్ తప్పనిసరి

తడ: ఇసుకను రవాణాచేసే ట్రాక్టర్లకు జియో టాగింగ్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లకు పోలీసులు నెంబర్లతో కూడిన స్టిక్కర్లను మంజూరు చేశామన్నారు. ఆ స్టిక్కర్లు కలిగిన ట్రాక్టర్లు జియో టాగింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ ట్రాక్టర్లు కాకుండా మరేఇతర వాహనాలు ఇసుక రవాణా చేయరాదన్నారు. అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏ మండలానికి చెందిన ట్రాక్టర్లు ఆ మండలంలోనే ఇసుకను రవాణా చేయాల్సి ఉందన్నారు. అక్రమ ఇసుకను రవాణాచేసే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

శ్రీసిటీలో దొడ్ల డెయిరీ పార్లర్

తడ : శ్రీసిటీ సెజ్‌లో నూతనంగా దొడ్ల డెయిరీ పార్లర్‌ను ఏర్పాటు చేశారు. దొడ్ల డెయిరీ సంస్థ బి. సునీల్‌రెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో పీవీకే రెడ్డి, శ్రీసిటీ ప్రతినిధులు సతీష్ కామర్స్ రమేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న శివప్రదీప్, ఎంఈవో శ్రీనివాసులు, డిపో మేనేజర్ ముక్తేశ్వర్‌రావు

నాయుడుపేట : స్థానిక మాలయకోట ప్రభుత్వ పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు టెక్స్‌మో ఎంఎస్ఆర్ ఇంజనీరింగ్ అధినేత పగడాల శివప్రదీప్ సొంత నిధులతో బస్‌పాస్‌లు సమకూర్చారు. వీటిని శనివారం ఎంఈవో నలమాకుల శ్రీనివాసులు, వాకాడు ఆర్టీసీ డీపో మేనేజర్ ముక్తేశ్వర్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాథమిక విద్య దశ నుంచే విద్యార్థులు విద్యాభ్యాసాలపట్ల ఆసక్తి చూపించాలన్నారు. దీంతో ఉన్నత విద్యను సునాయాసంగా అభ్యసించవచ్చన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి సేవలు అందించడంతోపాటు ప్రజలకు సురక్షితమైన ప్రయాణాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, పల్లేటి వేణుగోపాల్, పసల చంద్ర, కృష్ణయ్య, మధుసూధన్, మణెమ్మ, తదితరులు ఉన్నారు.

తాగునీరు అందించండి మహాప్రభో..

నాయుడుపేటరూరల్ : కొళాయిల్లో నీరు రాక, ట్యాంకర్లతో అందించకపోతే ఎలా జీవించాలంటూ పలువురు మహిళలు రోడ్డెక్కి నిరసన ప్రకటించారు. ఎల్ఏసాగరంలో తాగునీరు సక్రమంగా రాకపోవడంతో శనివారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసనలు తెలియజేశారు. స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలో ఉన్నప్పటికి తాగునీటికి అవస్థలు పడుతున్నామని అన్నారు. కాగా ఈ విషయం తెలుసుకున్న నగరపంచాయతీ అధికారులు తాగునీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేశారు.



ఖాళీబిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు



ర్యాలీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

సజీవ జ్ఞాపకాలు దృశ్యమాలికలతోనే సాధ్యం

నాయుడుపేట : సంఘటనల సజీవ జ్ఞాపకాలను గుర్తించుకునేలా భావితరాలకు దృశ్య రూపంలో అందించేందుకు ఫొటోగ్రఫీ ఎంతగానో దోహదపడుతుందని ఫొటోగ్రాఫర్ యూనియన్ల నాయకులు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఫొటోగ్రాఫర్లు గాంధీమందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతి వ్యక్తి జీవితంలోని మరచిపోలేని సంఘటనలను దృశ్యరూపంలో ఫొటోల రూపంలో బంధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శివ, వెంకటేశ్వర్లు, ధర్మయ్య, రాహుల్, కిషోర్, చంద్రశేఖర్, రవి, చంటిబాబు, జయరామ్, అనిల్, రవి ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిర్మాణాలపై నివేదిక పంపుతాం: ఈఈ

ఓజిలి: పెద్దపరియలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఈఈ సురేంద్రబాబు తెలిపారు. పెద్దపరియలో ఆసుపత్రి పనులలో చోటుచేసుకున్న అవకతవకలపై ఆంధ్రజ్యోతిలో 'నాణ్యతకు మంగళం' శీర్షికన ప్రచురితమైన వార్తపై కలెక్టర్ ఆదేశాలతో విచారణకు చర్యలు తీసుకున్నారు. అందులోభాగంగా పెద్దపరియకు వెళ్లి విచారణ చేపట్టారు. నిర్మాణాల పనితీరు తదితర వివరాలపై నివేదికలు తయారుచేసి కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఉన్నారు.

వీరికి నిబంధనలు వర్తించవా!?



నెంబరులేని బైక్‌పై హెల్మెట్ కూడా లేకుండా వెళ్తున్న పోలీస్

సూళ్లూరుపేట: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయి.. వాహనచోదకులు నిబంధనలు పాటిస్తున్నారు.. వాహనాలకు పొల్యూషన్ చెకప్‌కూడా చేయిస్తున్నారు. వాహనాలను కండిషన్‌లో ఉంచుకొంటున్నారు. హెల్మెట్‌లు పెట్టుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ కాగితాలు, లైసెన్స్‌లు దగ్గర ఉంచుకొంటున్నారు. లైసెన్స్‌లు లేనివారు వాహనాలు నడపాలంటే గడగడలాడిపోతున్నారు. ఎస్పీ చర్యల్లో భాగంగా జిల్లాలో వాహనచోదకుల్లో మంచి మార్పు వచ్చింది. ఇంత మార్పునకు కారకులు పోలీసు, రవాణాశాఖ అధికారులు వాహనాలు తనిఖీలు చేశారు. నిబంధనలు పాటించనివారిపై కేసులుపెట్టి సక్రమ మార్గంలో వాహనచోదకులను ఉండేలా చేశారు. మరి ఇంత చేసిన పోలీసులు తామమాత్రం నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారు. అందుకు ఇదిగో ఈ ఫోటోనే సాక్ష్యం... దొరవారిసత్రం - నాయుడుపేట మధ్య శనివారం ఉదయం జాతీయ రహదారిపై ఓ పోలీస్ నెంబరు కూడా లేని మోటారు సైకిల్‌పై దర్జాగా ఎలా వెళ్తున్నాడో చూడండి. పైగా హెల్మెట్ కూడా పెట్టుకోలేదు. నీతులు చెప్పేవారు నీతులు పాటిస్తేనే ఆ నీతులకు విలువ. పోలీసులు ముందు మీరు మారాలిసార్.

వర్షం కురిసేనా..
పంటలు పండేనా!?

- పెరగని వర్షపాతం
- బంజరు భూముల్లో పిచ్చి చెట్లు




దుక్కులు సిద్ధమైన పొలం

చిట్టమూరు: చుట్టపు చూపుగా వస్తున్న రుతుపవనాలు.. అలా పలకరించి వెళ్లిపోతున్నాయి. వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడుల వడ్డీలు పెరిగిపోతున్నాయన్న బెంగ రైతులను కుంగదీస్తోంది. ఈ ఏడాదైన వానలు పడుతాయి పంటలు వేసుకుంటామని ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. గత ఏడాది లాగే వర్షాలు కురవకుండా మొండికేస్తే ఎలా బతకాలి, బిడ్డలను ఏవిధంగా చదివించుకోవాలి, చేసిన అప్పులు తీర్చుకోవడం ఎలా అన్న సందిగ్ధంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చిట్టమూరు మండలంలో సుమారు 10,200 హెక్టార్లలో వరి సాగవుతూ ఉండేది. ఫిల్టర్ పాయింట్‌ల ద్వారా 2 వేల హెక్టార్లలో వరి సాగు చేపట్టేవారు. గత ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా రైతులు నారుమళ్లను ఎండబెట్టుకోగా ఫిల్టర్ పాయింట్ల ద్వారా 355 హెక్టార్లలో వరి సాగు చేశారు. కాగా భూగర్భజలాలు అడుగంటడంతో ఫిల్టర్ పాయింట్లు పనిచేయక ఆశించినంత ఫలితాలు రాలేదు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో వ్యవసాయం కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆందోళనలో పడ్డారు. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రం పడడంతో గునపాడు, గునపాటిపాళెం, మెట్టు, చిట్టమూరు, ఎం.జంగాలపల్లి గ్రామాల్లో ఫిల్టర్ పాయింటు కింద 320 హెక్టార్లలో వరి సాగు చేయగా, 17 హెక్టార్లలో వేరు శెనగ సాగవుతుంది. మిగతా ప్రాంతాల్లో రైతన్నలు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గత ఏడాది పంటలు వేయకపోవడంతో పొలాలు పిచ్చి చెట్లలతో నిండిపోయాయి.

2015లో 219 మిమీ వర్ష పాతం నమోదు కాగా చివరి రెండు మూడు తడులు తగ్గడంతో రైతులు సాగునీటి కోసం భగీరథప్రయత్నం చేసి అతి కష్టం మీద పంటలు పండించుకున్నారు. అయితే చేతి కొచ్చిన పంటను అమ్ముకునేందుకు గిట్టుబాటు ధర లేక రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం ఇప్పటికీ అమ్ముకోలేని పరిస్థితి నెలకొని ఉంది. 2016లో 122మిమీ వర్షపాతం నమోదుకావడంతో నారుమళ్లు పోసుకున్న రైతులు వర్షం పడుతుందని దుక్కిలు సిద్ధం చేసుకోగా వర్షం పడకపోవడంతో వదిలేశారు. ఈ క్రమంలో ఒక్కో ఎకరాకు సుమారు రూ.10వేలు ఖర్చు చేశారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఎదురుచూసిన రైతులకు నిరాశ మిగిలింది. చిట్టమూరు మండలాన్ని కరువు మండలంగా కూడా ప్రకటించలేదు. ఈ ఏడాది చెదురుమదురు వర్షాలు కురుస్తుండడంతో రైతులు దుక్కిలు చేసుకుని ప్రభుత్వం రాయితీపై అందజేసిన పచ్చిరొట్ట విత్తనాలు జీలగ, పిల్లిపెసర పొలాల్లో చల్లుతున్నారు. తీరప్రాంత మండలమైన చిట్టమూరుకి తెలుగుగంగ కాలువ పనులు పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయని రైతులు అంటున్నారు. తవ్విన తెలుగు గంగ కాలువల్లోని నీటితో ఒక తడి పారించుకునే అవకాశం ఉండగా ఆ నీటిని కొందరు రొయ్యల గుంతల కోసం తొలగించేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాలువలు పూర్తి చేయాలి



మండలానికి వస్తున్న తెలుగు గంగ కాలువలు ప్రభుత్వం పూర్తి చేయాలి. కేవలం వర్షాధారంపైనే ఆధారపడే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. సాగు నీటి వసతి లేకపోవడంతో రైతులు ఆక్వా సాగుకు లీజుకి ఇచ్చేస్తున్నారు.

- పి వెంకటాచలం
రైతు,ఆరూరు

రైతులు నష్టపోకుండా సూచనలిస్తున్నాం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు వ్యవసాయంపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందజేస్తున్నాం. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి.

- ఏవో నింజన్‌కుమార్

పండితేనే కడుపు నిండేది



వర్షం పడి పంటలు పండితేనే జీవనం. లేకుంటే వస్తులే. తీర ప్రాంతంలో కేవలం వర్షాధారంపైనే పంటలు పండాలి. ఇలాంటి ప్రాంతాలకు తెలుగుగంగ నీరు వస్తే సస్యశ్యామలంగా పంటలు పండుతాయి. ప్రభుత్వం గంగ కాలువల పనులుపై దృష్టి పెట్టాలి.

- బి సుబ్రమణ్యం
రైతు,ఖురదగాలి కొత్తపాళెం

పూడేరు ఉన్నత పాఠశాలలో 'వనం-మనం'



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నాయుడుపేట: పూడేరు పాఠశాలలో శనివారం నూతన ఉపాధ్యాయులచేత హెచ్‌ఎం ఆడేరు సుధాకర్ వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాలతో జి. వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, మునిసుబ్బులు, రాధయ్య బాధ్యతలుచేపట్టారు. తెలుగు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు మామిడి మొక్కలు తెప్పించి పాఠశాల ప్రాంగణంలో నాటారు.

భూరికార్డుల పరిశీలన త్వరితగతిన చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శీనానాయక్

తడ: భూములకు సంబంధించిన రికార్డులు ప్యూరిఫికేషన్ త్వరిగతిన పూర్తి చేయాలని నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్ ఆదేశించారు. శనివారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు భూసమస్యలు అన్నింటిని గుర్తించాలని వచ్చేనెల 15వ తేదీలోపు వాటిపై రికార్డులను సిద్ధంచేసి కలెక్టర్‌కు పంపాల్సి ఉందని అనంతరం వీటిపై గ్రామసభలు నిర్వహించి ఆ రికార్డులు అన్నింటిలో ఉన్న తప్పులను సరిచేయాలని ఆదేశించారు. వీటిపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఏడుకొండలు, ఎంపీడీవో రమణయ్య, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

- ఏడీఏ రాజగోపాల్

నాయుడుపేట: వ్యవసాయంలో భూమి, నీటి యాజమాన్య పద్ధతులతోపాటు సేంద్రియ ఎరువులు వాడకం ద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయశాఖ సహాయసంచాలకులు రాజగోపాల్ అన్నారు. నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో శనివారం గిరిజన మహిళలకు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక విస్తరణ పథకం ద్వారా వారికి శిక్షణా తరగతి నిర్వహించారు. వ్యవసాయంలో భూసారాన్ని పెంచేందుకు సాంప్రదాయమైన ఎరువులను వాడాలన్నారు. అలాగే పచ్చిరొట్టలు అయిన జనుము, జీలగ వంటి వాడటం ద్వారా భూమికి మంచి సారం ఏర్పడుతుందన్నారు. ఎరువులు, పురుగుమందులను విచక్షణరహితంగా వాడటం ద్వారా వాతావరణం కాలుష్యంతోపాటు రైతులు అనారోగ్యపాలవుతారన్నారు. వేప గింజలతో కషాయాన్ని, ఆవు పేడ, మూత్రంతో వివిధ రకాలైన క్రిమికీటకాదులను నాశనం చేసేవిధంగా ద్రావకాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నందిమండలం కవిత, ఎంపీఈవో ప్రశాంతి, మహిళారైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చిట్టమూరు: గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న పి మౌనికకు శనివారం దాతలు ఆర్థిక సాయం చేశారు. వివేకనందా చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఉన్నత చదువుల కోసం రూ.5వేలు దాతలు దువ్వూరు శేషురెడ్డి, పార్వతమ్మ దంపతులు అందజేశారు.



విద్యార్థినికి నగదు అందిస్తున్న దాతలు

నిందితుడి అరెస్టు



వినోద్‌కుమార్

తడ: ఓ వివాహితపై అత్యాచార కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర రావు తెలిపిన వివరాల మేరకు 2015లో తడ రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న దంపతులకు ఇద్దరు వ్యక్తులు కత్తులతో బెదిరించి వివాహితను సమీపంలో ఉన్న జామాయిల్ చెట్ల వద్దకు తీసుకెళ్లి అత్యాచారం జరిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు యల్లా వినోద్‌కుమార్ అలియాస్ యల్లాను శనివారం పోలీసులు చెన్నైలో పట్టుకున్నారు. ఆ నిందితుడ్ని సూళ్లూరుపేట సీఐ కిషోర్‌బాబు ద్వారా కోర్టుకు అప్పగించారు.

బాణసంచా దుకాణ భూములను పరిశీలించిన ఆర్డీవో

వెంకటాచలం: నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం సర్వేపల్లి గ్రామం వద్ద స్థల పరిశీలన చేశారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి సర్వేపల్లి వద్ద బాణా సంచా తయారీ కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు ఆర్డీఓ అనుమతి కావల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన గ్రామానికి వెళ్లి బాణా సంచా కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. స్థలం అందుకు అనువైనదా కాదా అనే విషయం ప్రభుత్వానికి ఆయన నివేదికను పంపనున్నారు. ఆయన వెంట తహసీల్దారు సోమ్లా నాయక్ కూడా ఉన్నారు.

నాలుగు రోజుల్లో పూడ్చించండి

పొదలకూరు: జిల్లాలో నోళ్లు తెరుచుకున్న బోర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నాలుగు రోజుల్లో వాటిని పూడ్చించాలని అన్ని మండలాల అధికారులను కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఆదేశాలు జారీ చేశారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుపయోగంగా వదిలేసిన బోర్లు సుమారు 21వేల పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అన్ని గ్రామాల్లో దండోరా వేయించి బుధవారం లోగా మూత వేసి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి బోర్లను మూతవేయించాలని సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణ అవినీతిపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ పరిధిలో ఆత్మగౌరం పథకంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిపై శనివారం డీఆర్‌డీఏ అధికారులు విచారణ చేపట్టారు. పొదలకూరు మరుగులో అవినీతి కంపు అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఆత్మగౌరం పథకం ఇన్‌చార్జి కృష్ణారెడ్డి విచారణకు ఆదేశించారు. దీంతో డీఆర్‌డీఏ నుంచి ఓ అధికారి పొదలకూరు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణాలను జాబితా ఆధారంగా తనిఖీ చేశారు. సోమవారం నుంచి మరో రెండు టీమ్‌లు అదనంగా రానున్నట్లు తెలిసింది.

పర్యావరణాన్ని పచ్చగా ఉంచాలి



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మనుబోలు : గ్రామాల్లో పర్యావరణాన్ని పచ్చగా ఉంచితే అది ఎంతో ఉపయోగకరమని ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్న కోఆర్డినేటర్ పీడి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో రెండురోజుల నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్)శిబిరంను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో బాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంను నిర్వహించారు. ప్రతి ఇంట ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని విద్యార్థులు గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతి, గ్రామస్తులు గోను శ్రీనువాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గోను గౌరి,దాసరి విజయమ్మ,మాసు అంకమ్మ, బళ్ళ హరిలు పాల్గొన్నారు.

ఏజెన్సీల పేరుతో టోకరా

- ఇస్లాంపేట తరహాలో మోరో మోసం
- రూ.16500 పోగొట్టుకున్న అనికేపల్లి వాసులు

వెంకటాచలం: గృహోపకరణాల ఏజెన్సీలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించడానికి ఏజెంట్లు కావాలని అందుకు అంగన్‌వాడీ కార్యకర్తలే నమ్మకంగా ఉంటారని నమ్మించారు. అందుకు డిపాజిట్టు కింద కొంత మొత్తం చెల్లించాలంటూ చెప్పారు. తమ బ్యాంకు అకౌంటులో నగదు వేయించుకున్నారు. అనంతరం సెల్‌ఫోను స్విచ్ ఆఫ్ చేసి టోకరా ఇచ్చారు. ఈ సంఘటన ఇస్లాంపేటలో మార్చి నెలలో జరిగింది. ఇదే తరహాలో అనికేపల్లి గ్రామానికి చెందిన తలారి రమణయ్య, దయాకర్ మోసపోయారు. తలారి రమణయ్య ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. ఆయన వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇస్లాంపేట తరహాలోనే చెప్పారు. అందుకు రూ.16500 నగదును తమ బ్యాంకు ఖాతాల్లో వేయాలని సూచించారు. దీన్ని నమ్మిన తలారి రమణయ్య, దయాకర్ కలిసి రూ.16500 లను వారు చెప్పిన బ్యాంకు ఖాతాకు జమ చేశారు. తాము పోసపోయామని గ్రహించిన బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

గుల్లల వేట.. తీరంతో ఆట

- తగ్గిన మత్స్యసంపద
- నత్తగుల్లల ఏరివేతలో మత్స్యకారులు
- పట్టించుకోని మత్స్యశాఖాధికారులు

తోటపల్లిగూడూరు : ప్రకృతి వైపరీత్యాలైన సునామీ, తుఫాను వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు సముద్రం ముందుకు రాకుండా తీరానికి వారధిగా ఉండే నత్తగుల్లలను మత్స్యకారులు ఏరేస్తున్నారు. ఫలితంగా సముద్రతీరం రోజురోజుకూ ముందుకు వస్తోంది. జిల్లాలోని తోటపల్లిగూడూరు సముద్రతీర ప్రాంతంలో ఇది ఎక్కువగా జరుగుతోంది. సముద్ర తీరానా అలల తాకిడిని తట్టుకుంటూ తీరం కరిగిపోకుండా సముద్రం ముందుకు రాకుండా ఉండేవిధంగా నత్తగుల్లలు తీరం వెంబడి విస్తరించి ఉంటాయి. సముద్రతీర ప్రాంతంలో భారీ పరిశ్రమలు రాక కారణంగా తీరంలో మత్స్య సంపద చాలావరకు తగ్గిపోయింది. దీంతో మత్స్యకారుల జీవనం ఒడిదొడుకులకు లోనవుతోంది. ఫలితంగా వారు నత్తగుల్లలను ఏరి విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకోవడం మొదలుపెట్టారు. తీరం వెంబడి ఉన్న నత్తగుల్లలను ఏరివేసి పగులగొట్టి మాంసాన్ని తీసి అమ్ముతున్నారు.

మాంసానికి మంచి గిరాకీ.....

నత్తగులల నుంచి తీసిన మాంసం వెనామీ రొయ్యల సాగుకు మేతగా ఉపయోగపడుతుంది. దీంతో ఈ మాంసానికి మంచి గిరాకీ, ఉంది. దీనికితోడు వెనామీ రొయ్యల మేత తయారీ విధానంలో ఈ మాంసాన్ని కూడా ఉప యోగించి రొయ్యల మేత తయారు చేస్తున్నారు. అందువల్ల గతంలో కేజీ రూ.40 ఉన్న ఈ మాంసం ధర ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300 వరకు చేరింది. దీంతో వేటసాగని మత్స్యకారులు నత్తగుల్లల ఏరివేతపై మొగ్గ చూపుతున్నారు. దానికితోడు ఈ నత్తగుల్లల మాంసాన్ని రొయ్యల మేతతోపాటు కోళ్లమేతకు ఉపయోగించడంతో



అమ్మకానికి సిద్ధంగా నత్తగుల్లలు



ముందుకు వచ్చిన సముద్రం

తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాలు తీరంలో నత్తగుల్లల ఏరివేతపై దృష్టి సారిస్తున్నాయి. ఒక వ్యక్తి రోజుకు 5 నుంచి 7 కిలోల వరకు నత్తగుల్లలు ఏరడం వలన దాదాపు రూ.1000నుంచి 1500ల వరకు సంపాదిస్తున్నాడు. వీరికి ఉపాధి లభిస్తున్నా నత్తగుల్లల ఏరివేతతో తీరం కోతకు గురవుతోంది. సంబంధిత మత్స్యశాఖ అధికారులు తీరంలో జరుగుతున్న నత్తగులల ఏరివేతపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదేసమయంలో మత్సకారులకు ఉపాధి కల్పించాల్సి ఉంది.

పరిశ్రమల వల్లే



గ్రామాలకు పరిసర ప్రాంతాల్లో భారీ పరిశ్రమల కారణంగా వేట సాగడం లేదు. ప్రత్యామ్నాయంగా కుటుంబ పోషణకు ఏదో ఒకటి అన్న ఉద్దేశంతో నత్తగుల్లలవైపు మొగ్గుచూపుతున్నాం.

- పామంజి రామలింగయ్య,

కుటుంబ పోషణకు



చేపల వేట సాగక ఇబ్బంది పడుతున్నాం. కుటుంబాల పోషణ భారమైంది. అందువల్ల పోషించుకునేందుకు తప్పనిసరి పరిస్థితిలో ఈ గుల్లల ఏరివేత చేస్తున్నాం.

- శ్రీలక్ష్మి, మత్స్యకారురాలు

వేట సాగకే



సముద్రంలో వేట తగ్గిపోయింది. బతుకు దెరువు కోసం గుల్లలు ఏరుతున్నాం. ప్రభుత్వం కానీ, నాయకులు గానీ వేట గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం ఆలోచించాలి.

- తేటంగారి ఆదిశేషు

15 మంది బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

రూ, 1.72 లక్షల నగదు స్వాధీనం

పొదలకూరు: పొదలకూరులోని బాలాజీనగర్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 15మంది బెట్టింగ్ రాయుళ్లను శనివారం పొదలకూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి లక్షా 72వేలా 9వందల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆత్మకూరు డీఎస్పీ సుబ్బారెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రముఖ క్రికెట్ బెట్టింగ్ బుకీ మన్నెం శ్యామ్‌ప్రసాద్ వద్ద కొంతకాలంగా పంటర్లుగా బెట్టింగ్ నిర్వహిస్తున్న బెట్టింగ్‌రాయుళ్లు బుకీ శ్యామ్‌ప్రసాద్‌ను ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడంతో పరారయ్యారని అన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో పొదలకూరులోని బాలాజీనగర్‌లో పెనళ్ల సతీష్ ఇంట్లో ఇండియా-ఏ, సౌత్‌ఆఫ్రికా- ఏ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్‌మ్యాచ్‌పై కిక్‌బజ్ యాప్ ద్వారా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ అల్లూరి జగత్‌సింగ్‌కు సమాచారం అందిందన్నారు. దీంతో ఎస్ఐ తన సిబ్బంతో కలిసి వెళ్లి ఇంట్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 15బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,72,900లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరందరినీ 3అండ్5 గేమింగ్ యాక్ట్ ప్రకారం అరెస్టు చేసి గూడూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు. అరెస్టయిన వారిలో ఉయ్యాల కృష్ణారెడ్డి, పెసళ్ల సతీష్, మన్నవరపు సంపత్‌కుమార్, షేక్ ఫరియాజ్, పలుకూరు శ్రీనివాసులురెడ్డి, విజయ్‌మోహన్, రాజగోపాల్ రెడ్డి, పందిపాటి సుధీర్‌రెడ్డి, తరుగు నాగేంద్ర, గజ్జెల వెంకటేశ్వర్లు, పెంచల రాంబాబు, కండే మురళి, పెరిచెర్ల మాల్యాద్రి, గాలి వెంకటేశ్వర్లు, లెక్కల శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు. వీరు కొంత కాలంగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు.



పోలీసుల అదుపులో బెట్టింగ్ రాయుళ్లు

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం



డీఎస్పీ సుబ్బారెడ్డి

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉచిత ఇసుక పాలసీలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఆధ్యాత్మికానందం కోసం

గొలగమూడి యాత్ర

వెంకటాచలం: గురువు సాంగత్యం లేనిదే మోక్షం రాదు అని పురాణాలు ఘోషిస్తున్నాయి. భారత సంస్కృతిలో గురువుకు అంతటి ఉన్నత స్థానం ఉంది. అందుకే ఎంతో మంది మహనీయులు తమ శిష్యులకు తమదైన శైలిలో హితబోధ చేస్తూ వారిని సన్మార్గంలో నడిపించారు. భోగులను సైతం వారు యోగులుగా మార్చారు. వెంకయ్యస్వామి కూడా తమ శిష్యులకు హితబోధ చేస్తూ అవధూతగా అవతరించాడు. నమ్మిన వారికి ఆధ్యాత్మికానందం పంచుతూ కొంగు బంగారంగా మారాడు. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో నిత్యం వస్తుంటారు. సమాధి మందిరాన్ని దర్శించుకుంటున్నారు. ఆధ్యాత్మికానందం పొందుతున్న భక్తులు మనోభావాలు వారి మాటల్లోనే..

మానసిక ప్రశాంతత పొందుతున్నా



ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడిని. శారీరక ఇబ్బందుల వల్ల సంస్థ నన్ను విధుల నుంచి రెండేళ్ల క్రితం తొలగించింది. దీంతో నేను మానసికంగా ఎంతో కుంగి పోయాను. ఈ పరిస్థితిలో ఓ మిత్రుడి సలహా మేరకు గొలగమూడికి వచ్చాను. మొదటి రోజే మాటలకు అందని అనుభూతి పొందాను. నాటి నుంచి నాకు ఏ లోటూ లేదన్న సంతృప్తితో ఉన్నా. తరచుగా గొలగమూడికి వస్తున్నాను.

- హజరత్ రెడ్డి, స్వామి భక్తుడు, కావలి

ఆరాధన ఏర్పాట్లు భేష్



ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఆశ్రమం వారు చేసిన ఏర్పాట్లు ఎంతో బాగున్నాయి. ఎంత మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండడానికి సత్రాలు, అద్దె గదులు ఏర్పాటు చేసి ఉన్నారు. అంతే కాకుండా అన్నదానం, ఉచిత వైద్య సేవలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆశ్రమ నిర్వహణ బాగుండడంతో గొలగమూడికి మళ్లీ మళ్లీ రావాలనిపిస్తోంది. అందుకే కుటుంబ సమేతంగా తరచుగా గొలగమూడికి వస్తుంటా.

- తెనాలి సురేష్, భక్తుడు,సర్వేపల్లి

అవకతవకలకు పాల్పడితే షాపు సీజ్ చేస్తాం

వెంకటగిరి(టౌన్): రేషన్ దుకాణాల్లో ప్రజలకు అందించే నిత్యావసర సరుకుల పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడితే వారి షాపులను సీజ్ చేస్తామని తహసీల్దారు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక తహీ సీల్దారు కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని డీలర్లపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మరోసారి ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తే వారి షాపును సీజ్ చేస్తామన్నారు. అలాగే సకాలంలో డీడీలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాలకు గ్రహణం!

- వెంటాడుతున్న నిధుల కొరత
- శాఖల మధ్య సమన్వయలోపం
- ఉపాధి అనుసంధానం అస్తవ్యస్తం
- నెరవేరని పేదల సొంతింటి కల


డక్కిలిలో పూర్తికాని ఇళ్లు

డక్కిలి మండలంలో ఎన్టీఆర్ గృహకల్ప పథకం అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతోన్నాయి. ఉపాధిహామీ (డ్వామా), గృహనిర్మాణ శాఖల సమన్వయ లోపం లబ్ధిదారులకు శాపంగా మారింది. ఈ పథకం కింద ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొన్న పేదలకు గృహనిర్మాణ శాఖ నుంచి సకాలంలో బిల్లులు అందుతున్నప్పటికీ డ్వామా నుంచి నిధుల జమ కావడం లేదు. వివిధ దశల్లో నిధులు సకాలంలో అందచేస్తేనే పేదలు ఇల్లు నిర్మించు కొంటారు. కానీ ఉపాధి హామీలో ఆపరిస్థితి కనిపించడం లేదు. మండలంలో 2016-17వ సంవత్సరంలో 326, 2017-18లో 94, 2018-19వ సంవత్సరానికి 361 ఇల్లు మంజూరయ్యాయి. ఒక్కో పక్కా గృహం యూనిట్ విలువ రూ.1.50 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో గృహ నిర్మాణ సంస్థ రూ.95 వేలు, ఉపాధి హా మీ పథకం ద్వారా రూ.55 వేలు మంజూరు చేయాలి. అయితే ఇల్లు పూర్తి చేసుకొన్న వారికి గృహనిర్మాణ శాఖ వాటా సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుండగా ఉపాధిహామీ పథకం నుంచి నిధులు ఖాతాలకు జమకావడం లేదు. లబ్ధిదారులకు ఉపాధి పథకం కింద 90 రోజులు పనిదినాలు హాజరు పట్టికలో (మస్టరు) వేయడం ద్వారా నిధులు విడుదల కావాల్సి ఉంది. ముందుగా ఉపాధి సిబ్బంది ద్వారా మస్టర్లు వే యాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆ బాధ్యతను గృహనిర్మాణ శాఖకు బద లాయించారు. దీంతో ఈ ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటి వరకు 226 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నా ఎన్ఆర్ ఈజీఎస్ నుంచి అందాల్సిన రూ.55 వేల లెక్కన సొమ్ము ఇంతవరకు ఒక్క ఇంటికి కూడా అందలేదు. దీంతో ఉపాధి నిధుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం అన్ని ఇళ్లకు ఉపాధి నిధులతో లింకు పెట్టింది. ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ చెల్లించాల్సిన రూ.95 వేలు సకాలంలో అందుతుండగా మిగిలిన రూ.55 వేలు ఇంటి నిర్మాణం పూర్తి అయ్యేలోగా లబ్ధిదారులకు 90 రోజులు పనికల్పించి అందుకు రూ. 17.460 కూలీ కింద లబ్ధిదారుడి ఖాతాకు జమచేయాలి. ఈ సొమ్మును మూడు దఫాలుగా చెల్లించాల్సి ఉంది. 28 రోజులు పునాది దశకు, మరో 36 పనిదినాలు రూఫ్ లెవల్ దశకు, ఇక మిగిలిన రూ. 25 వేలు ఇటుకల కింద చెల్లిస్తారు. మరో రూ. 12 వేలు మరుగుదొడ్డి నిర్మాణ పనులకు చెల్లించాలి. అయితే అవేమీ ఆచరణక నోచుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీఆర్ గృహకల్ప పథకానికి పల్లెల్లో గ్రహణం పట్టింది. ఈ పథకానికి ఉపాధి హామీ పథకం అనుసంధానం అస్తవ్యస్తంగా ఉంది. పథకం అమలులో వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో నిర్మాణం ప్రారంభమైన గృహాలు పూర్తికాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకం ద్వారా ఇల్లు నిర్మించుకొంటున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇల్లు కట్టి చూడు...పెళ్లి చేసి చూడు అనే నానుడికి బదులు ఇల్లుకట్టి చూడు.. బిల్లు పొంది చూడు అన్న చందంగా ఉంది ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల పరిస్థితి.

- డక్కిలి

బిల్లుల చెల్లింపులో జాప్యం లేదు

గృహనిర్మాణ సంస్థలో బిల్లుల చెల్లింపులో జాప్యం లేదు. క్షేత్ర స్థాయిలో జియోట్యాగింగ్, ఫొటోలు వంటి వాటికి కొంత సమయం పడుతుంది. అంతేకాకుండా ఆధార్ అనుసంధానం సమస్యతో కొన్ని ఇళ్లకు బిల్లులు అందడంలో కొంత జాప్యం జరగవచ్చు.

- ఇనయ్‌తుల్లా, వర్క్ఇన్‌స్పెక్టర్, గృహనిర్మాణశాఖ

ఆధార్ లింక్‌తో జాప్యం వాస్తవమే

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం నుంచి చెల్లించాల్సిన బిల్లుల్లో ఆధార్‌కార్డు అనుసంధానంతో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఉపాధి పథకానికి ఎలాంటి సంబంధం లేకుండా ఆ బాధ్యత గృహ నిర్మాణ శాఖకు అప్పగించారు. తమ కెలాంటి సంబంధం లేదు.

- ఏడుకొండలు, ఏపీఎం, ఉపాధి పథకం

పెనుబర్తిలో వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రాపూరు: కరుణామయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో పెనుబర్తి గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు మురళీ, నాయుడు, ట్రస్టీలు రామ్మోహన్‌రావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో మోస్తరు వర్షం

సైదాపురం: మండలంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షాలు లేక బావులు, బోర్లు అడుగంటి తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో ఓ మోస్తారు వర్షం కురవడంతో ఆరుతడి పంటలు, నిమ్మ పంటల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు లేక పంటలు కాపాడుకో లేక రైతులు వరుణుడు కోసం ఎదురు చూస్తున్నారు.

వనిత కార్డు సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి(టౌన్): ఆర్టీసీ ప్రయాణికులకు అందించే వనిత కార్డు ద్వారా బస్సు ప్రయాణాల్లో పది శాతం రాయితీ పొందవచ్చునని ఆర్టీసీ డీఎం రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీఎం కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు వనిత కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్డును పొందేందుకు తెల్లరేషన్‌కార్డు, పాసు ఫొటోలు, వంద రూపాయల నగదు చెల్లించి వనిత కార్డు పొందాలన్నారు. ఈ కార్డు పొందితే ప్రమాద బీమా రూ.లక్ష వర్తిస్తుందన్నారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

రాపూరు: మండలంలోని పులిగిలపాడు గ్రామానికి చెందిన పెంచలనరసింహులు (28) పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్యా యత్నం చేశాడు. కండలేరు డ్యాం సమీపంలోని చెల్లటూరు వద్ద పురుగుల మందు తాగి రోడ్డుప్రక్కన పడి ఉండడంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది ప్రాథ మిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


చికిత్స చేస్తున్న సిబ్బంది

ఎకరాకు రూ.6.5లక్షల పరిహారానికి ప్రతిపాదనలు

కలువాయి: సోమశిల-కండలేరు వరద ప్రవాహపు కాలువ కింద చేజర్ల మండలం కండాపురం వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ కింద కాలువల నిర్మాణంలో రైతులు కోల్పోతున్న భూములకు ఎకరాకు రూ.6.5లక్షలు పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఎల్. నరసింహులు తెలిపారు. తెలుగుంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతితో పాటు ఆయన శనివారం కాకివాయి, చీపినాపి, చింతలాత్మకూరు, కేశమనేనిపల్లి, పర్లకొండ గ్రామాల్లో కాలువల కోసం సేకరిస్తున్న భూములను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. అనంతరం కలువాయిలోని తెలుగుగంగ అతిథిగృహంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విలేఖరులతో మాట్లాడారు. చవటపల్లి రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు ఇస్తున్న రూ.6.5లక్షలు తమకు వర్తింప చేయాలని కండాపురం రైతులు కోరినట్లు ఆయన తెలిపారు. కాలువ నిర్మాణానికి భూసేకరణ వేగవంతం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు రవీంద్రనాథ్ ఉన్నారు.

రథయాత్ర విజయవంతం చేయండి

వెంకటగిరి: హిందు ధర్మ పరిరక్షణ ట్రస్ట్, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమలానంద భారతి స్వామి నిర్వహించనున్న సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శనా రథయాత్ర, పాదయాత్రను మండలంలో విజయవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు కోరారు. శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేఖరులతో వారు మాట్లాడుతూ ఆదివారం మండలంలోని పారవోలులో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ఆర్‌వీఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే బహిరంగ సభను కూడా జయప్రదం చేయాలని కోరారు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు వెంకటగిరి రూరల్, పట్టణ పరిధిలో నిర్వహించనున్నట్లు వివరించారు. నాయకులు సంజీవరెడ్డి, కేవీకే ప్రసాద్‌నాయుడు, రామచంద్రయ్య, చింతగుంట కోటి కోరారు. పాల్గొన్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

వెంకటగిరి(టౌన్): దళారులను ఆశ్రయించకుండా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సహదేవయ్య అన్నారు. శనివారం స్థానిక సంస్థ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్, హార్టికల్చర్ రైతులు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యులుగా చేరితే రైతు పండించిన పంటకు నూరుశాతం గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఎంత మోతాదు అవసరమో నిర్ణయించి సభ్యులకు 20 శాతం రాయితీ అందిస్తామన్నారు. పండిన పంటను రైతుల నుంచి ఉత్పత్తి దారుల సంస్థ ద్వారానే కొనుగోలు చేసి వచ్చిన ఆదాయాన్ని రైతులకు అందిస్తామన్నారు. ఇందుకోసం చెన్నై నుంచి ఓ ఫైనాన్స్ సంస్థ ఈ వ్యాపారాలకు పెట్టుబడికి ముందుకు వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యాక్రమంలో రవికుమార్, వేమాద్రి, నాగేశ్వరరావు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సహదేవయ్య

‘ఎర్ర’ స్మగ్లింగ్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

రాపూరు: ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు అధికారి శ్రీనివాసరావు కోరారు. గోనుపల్లి గ్రామంలో శనివారం ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధించేందుకు రోడ్‌షో, లేజర్ షో ప్రదర్శన చేపట్టారు. ఎర్రచందనం ఎంతో విలువైందన్నారు. మన ప్రాంతంలో మాత్రమే లభ్యమయ్యే చందనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉందన్న విషయాన్ని అందరూ గుర్తించుకోవాలన్నారు. ఎక్కడైనా స్మగ్లింగ్ కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇచ్చి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ముగింపు పలుకాలన్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాగంటి కాంతారావు ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.


గోనుపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సినిమాగైడ్

వెంకటగిరి

త్రిభువని: లై
జ్యోతిమహాల్: నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంభ : జయ జానకి నాయక

రాపూరు

శ్రీనివాసమహల్: నేనే రాజు నేనే మంత్రి
వేంకటేశ్వరమహల్: జయ జానకి నాయక